
www.jagritiweekly.com
సంపుటి : 77 సంచిక : 15 పుటలు : 52

# జాగృతి

కలి 5126-శ్రీ క్రోధి మాఘ శుద్ధ షష్ఠి
03-09 ఫిబ్రవరి 2025
వెల : ₹20/-



## స్వర్ణయుగమా? సంచలనమా?



## విశ్వాసానికి అతీతంగా..

జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా http://payit.cc/S18970 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

77 ఏళ్లుగా వెలువడుతున్న జాతీయ తెలుగు వారపత్రిక

తపస్



# మల్క కొమరయ్య

ఉమ్మడి కరీంనగర్ -నిజామాబాద్ -మెదక్- ఆదిలాబాద్

ఉపాధ్యాయ నియోజకవర్గ శాసన మండలి ఎమ్మెల్సీ అభ్యర్థి

1

మొదటి ప్రాధాన్యత
ఓటు వేసి అత్యధిక మెజారిటీతో
గెలిపించగలరని మనవి

# TPUS

## తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్)

అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ABRSM) న్యూఢిల్లీ అనుబంధం)

# చైనాలో రామాయణం

ఈ దృశ్యమేదో భారతీయ ఇతివృత్తంగా ఉన్న ప్రదర్శనలోనిది అని అనిపిస్తే తప్పు కాదు. అది రామాయణంలోని ఒక ఘట్టం. అయితే ప్రదర్శించిన వారు మాత్రం చైనా కళాకారిణులు. ఆదికావ్యం పేరుతో చైనాలో రామాయణ నృత్య ప్రదర్శన నిర్వహించారు. చైనాకు చెందిన ప్రఖ్యాత భరతనాట్య కళాకారిణి జిన్ షాన్‌షన్ ఆధ్వర్యంలో జనవరి 25న ఈ ప్రదర్శన జరిగింది. ఇందులో 80 మంది స్థానిక నర్తకీమణులు పాల్గొన్నారు. ప్రొఫెసర్ జీ జియాన్‌లిన్ మాండిరిన్ భాషలోకి అనువదించిన రామాయణంతో ప్రేరణ పొంది ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనకు అక్కడి భారత దౌత్య కార్యాలయం సహకారం అందించింది. చైనా వైస్ మినిస్టర్ సున్ హైయూన్ నృత్య ప్రదర్శనకు హాజరయ్యారు. ఈ ప్రదర్శన ఎంతో ప్రత్యేకమైనదని చైనాలో భారత రాయబారి ప్రదీప్ రావత్ వ్యాఖ్యానించారు. భారత్-చైనా సంబంధాలు సాధారణ స్థితికి తీసుకురావాలన్న ఆకాంక్షతో జనవరి 26న విదేశాంగ కార్యదర్శుల స్థాయి సమావేశం ఏర్పాటయిన నేపథ్యంలో ఈ నృత్య ప్రదర్శన ఏర్పాటు చేశారు.






Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.

**Editor : Dr. Goparaju Narayana Rao.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు, వ్యాపార ప్రకటనల వివరాల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

జి.తుకారాం : సర్క్యులేషన్ మేనేజర్

**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం (ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

కె. దుర్గారెడ్డి : అసోసియేట్ ఎడిటర్ -

సబ్ ఎడిటర్ : - **9959991304**

డిజైనర్ : చిగుళ్ల కుమార్, ఎడ్ల కృష్ణ


## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ **"To Bank / UPID"** ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

**విడి ప్రతి రూ.20**

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 920010061405325, Axis Bank, Kothapet Branch.**

**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ మేనేజర్, జాగృతి


ప్రజాస్వామ్యం నవనవోన్మేషంగా పరిఢవిల్లుతున్నదనడానికి గీటురాయి న్యాయ వ్యవస్థకు దక్కిన, దక్కుతున్న గౌరవమే. శాసన నిర్మాణ, కార్యనిర్వాహక వ్యవస్థలు పరిధులు దాటకుండా న్యాయవ్యవస్థ గీసిన లక్ష్మణరేఖ వెనుకే ఉంటున్నాయని చెప్పుకోగలగడమే ప్రజాస్వామ్యానికి గీటురాయి. అందుకే న్యాయవ్యవస్థ అందరికీ సమన్యాయం, సమాన హక్కులు ప్రజాస్వామ్యం ఇస్తుంది మూడో స్తంభంగా మన్నిస్తారు (నాలుగో స్తంభంగా పత్రికా వ్యవస్థను గౌరవిస్తారు). భారత అత్యున్నత న్యాయస్థానం జనవరి 28, 2025తో 75 ఏళ్ల ప్రయాణం పూర్తి చేసుకున్న సందర్భం అందుకే స్మరణీయమైంది. చరిత్రాత్మకమైనది కూడా. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ ఇందుకు సంబంధించిన ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు.

ఈస్టిండియా కంపెనీ కాలంలోనే (1774) కలకత్తాలో (నేటి కోల్‌కతా) అత్యున్నత న్యాయస్థానం ఏర్పడింది. తరువాత మద్రాస్ (1800), బొంబాయి (1823) సుప్రీం పేరిట న్యాయస్థానాలు ఆవిర్భవించాయి. హైకోర్టులు కూడా కంపెనీ ఏలుబడిలోనే 1861లో మొదలయ్యాయి. ఇక మన రాజ్యాంగ వ్యవస్థలన్నింటికీ మూలమని చెప్పే భారత ప్రభుత్వ చట్టం 1935 పుణ్యమా అని ఫెడరల్ కోర్టు ఏర్పడింది. నేటి సుప్రీంకోర్టుకు మాతృక ఇదే. భారత రాజ్యాంగం అమలులోకి వచ్చిన రెండు రోజుల తరువాత, జనవరి 28, 1950న సుప్రీంకోర్టు ఉనికిలోనికి వచ్చింది. ప్రధాన న్యాయమూర్తితో కలిపి 8 మందితో ఆరంభమైన మన సుప్రీంకోర్టు ఇప్పుడు 34 మందితో రాజ్యాంగ రక్షణ కృషిలో నిమగ్నమై ఉంది. ప్రస్తుతం బాధ్యతలు నిర్వర్తిస్తున్న జస్టిస్ సంజీవ్ ఖన్నా 51వ ప్రధాన న్యాయమూర్తి. హక్కులు ఉంటాయి. అలా అని నిరపేక్షమైనవి కావు. మన హక్కు అవతలివారి హక్కునకు భంగం కలిగించేటట్టు ఉంటే దానిని సరిదిద్దవలసిన బాధ్యత ప్రజాస్వామ్యంలో కోర్టులు మాత్రమే చేయగలవు. ఆ బాధ్యతను నిర్వర్తించే సమున్నత వేదికే సుప్రీంకోర్టు.

సుప్రీంకోర్టు ప్రధాన విధి అప్పీళ్లను విచారించడమే. కేంద్రం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుంచి వచ్చిన అప్పీళ్లను ఇది పరిశీలిస్తుంది. చట్టాల సమీక్ష కూడా ఈ న్యాయస్థానం బాధ్యతే. కొన్ని తీవ్ర వివాదాల విషయంలో నేరుగా కూడా విచారణ జరుపుతుంది. ఏకసభ్య ధర్మాసనం మొదలు, 13 మంది న్యాయమూర్తుల

**శాలివాహన 1946 శ్రీ క్రోధి మాఘ శుద్ధ షష్ఠి**

## లోపలి పేజీలలో...





ముఖపత్ర కథనం

**స్వర్ణయుగమా? సంచలనమా?**

6లో



జాతీయ వేడుక

**జన ఘన తంత్రం**

14లో

ధారావాహిక నవల

**తూర్పు-పడమర**

– గన్నవరపు నరసింహమూర్తి



12

20లో

# జాగృతి

## సంపాదకీయం

ధర్మాసనం వరకు (కేశవానంద భారతి వర్సెస్ కేరళ ప్రభుత్వం,1973) న్యాయస్థానం వ్యాఖ్యాన్ని బట్టి పరిస్థితులను చర్చించి తీర్పులు ఇచ్చిన చరిత్ర ఉంది. ఎన్నో కీలక తీర్పులు ఉన్నాయి. ప్రజాస్వామ్యాన్ని పటిష్టం చేశాయి. మత విశ్వాసాలకు, ప్రాంతీయ తత్వాలకు, ప్రలోభాలకు లోనుకాకుండా మన సుప్రీంకోర్టు తన తీర్పులు వెలువరించింది. షరియాకు వ్యతిరేకమని ఆ వర్గం చెబుతున్నా, సుప్రీంకోర్టు మహిళలకు జరగవలసిన న్యాయాన్ని మాత్రమే పరిగణనలోనికి తీసుకుని షాబానో కేసులో సంచలన తీర్పు ఇచ్చింది. కానీ ఆ తీర్పును తుంగలో తొక్కడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నించింది. సుప్రీం

# సుప్రీంకోర్టు @75

కోర్టు చరిత్రలో చూస్తే 1947-1964 మధ్య ఆస్తి హక్కు గురించి ఒక స్పష్టత రావడానికి ఆస్కారం కల్పించే పరిణామాలు కనిపిస్తాయి. 1965 నుంచి 1993 వరకు రాజ్యాంగ సవరణల గురించి తన వైఖరి ఏమిటో వివరించిన సమయంగా కనిపిస్తుంది. 1993-2018 న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి విధి విధానాలపై సూత్రీకరణలు జరిగాయి. అయినా ఇప్పటికీ కేంద్రానికీ, అత్యున్నత న్యాయస్థానానికీ మధ్య విభేదాలు కొనసాగుతూనే ఉన్నాయి. అందులో ముఖ్యమైనది కొలీజియం వ్యవస్థ. చిత్రంగా భారత అత్యున్నత న్యాయస్థానంలో కూడా 80,439 (2023 నాటికే) కేసులు అపరిష్కృతంగా ఉండిపోవడం విచారకరమే. ఇందుకు కోర్టునే బోనెక్కించడం ఇక్కడ ఉద్దేశం కాదు. మిగిలిన ఎన్నో అంశాలు ఉన్నాయి. వాటిని త్వరితంగా పరిష్కరించాలి. రాజ్యాంగాన్ని సవరించే హక్కు ఉన్నప్పటికీ మౌలిక స్వరూపాన్ని కేంద్ర ప్రభుత్వం మార్చలేదనీ (కేశవానందభారతి కేసు), రాష్ట్రాల మీద కేంద్ర పాలన విధింపునకు పరిమితులు ఉన్నాయని (ఎస్ఆర్ బొమ్మయ్ కేసు), పనిచేసే చోట మహిళల లైంగిక వేధింపుల నిరోధం (వైశాఖ వర్సెస్ రాజస్తాన్ కేసు), ప్రాథమిక హక్కుల రక్షణకు ఇంకా ఎన్నో తీర్పులు మన అత్యున్నత న్యాయస్థానం ఇచ్చింది. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత పెంచి లావాదేవీలను నిర్వహించాలని అమృతోత్సవాల సందర్భంగా నిర్ణయించడం ముదావహం.

మనకు గతం నుంచి, విదేశీ పాలన నుంచి సంక్రమించిన విషాదాలూ, వివాదాలూ తక్కువేమీ కాదు. వాటిలో చాలావాటిని పరిష్కరించడానికి సుప్రీంకోర్టు తనవంతుగా గొప్ప సేవ చేసింది. అందులో పేర్కొనదగినది అయోధ్య రామ జన్మభూమి వివాదం. ఐదువందల ఏళ్ల నాటి ఆ వివాదాన్ని నవంబర్ 9, 2019న తన తీర్పు ద్వారా పరిష్కరించింది. ఇందుకు జాతి మన అత్యున్నత న్యాయస్థానానికి ప్రణమిల్లాలి. ఈ దేశంలో హిందువులు అధిక సంఖ్యాకులు కాబట్టి తీర్పు రాముడికి అనుకూలంగా వచ్చిందని బాధ్యతనెరిగిన వారు ఎవరూ వ్యాఖ్యానించలేదు. ఆ వివాదాన్ని కూడా భూ వివాదంగానే విచారించి తీర్పును నిర్ధారించామని ధర్మాసనం పేర్కొన్నది. దరిమిలా అయోధ్యలో రాముడిని హిందువులు ప్రతిష్ఠించుకున్నారు. ఇప్పుడు భారతదేశంలో పరిణామాలంటే అయోధ్య వివాదానికి ముందు, అయోధ్య వివాదానికి తరువాత అన్న తీరులో అంచనా వేయవలసి ఉంది. అందుకే ఈ తీర్పు సుప్రీంకోర్టు చరిత్రలో లేదా భారత న్యాయవ్యవస్థ చరిత్రలో ఒక మలుపు. సెక్యులరిజం పేరుతో జరిగిన దగా, మైనారిటీల బుజ్జగింపు ధోరణి, ఇంతకు ముందు న్యాయవ్యవస్థలో జరిగిన అవాంఛనీయ జాప్యం వంటి అన్ని అంశాలను, దాని పర్యవసానాలను ఆ తీర్పు బట్టబయలు చేసింది. అవి ఈ దేశానికీ, ఈ దేశ వైవిధ్యానికీ, మత సామరస్యానికీ తెచ్చిన చేటును కూడా సాధారణ భారతీయుడు తెలుసుకునే సదవకాశం ఇచ్చింది. ఈ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకుంటూ మన ప్రజాస్వామ్యం మరింత పరిఢవిల్లాలని మనసారా కోరుకుందాం. ★


03 ఫిబ్రవరి 2025, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ - బృహదారణ్యకోపనిషత్




కథ

**భారతి అనే నేను**


- దుద్దుంపూడి అనసూయ





| | | |
|---|---|---|
| సనాతన ధర్మం సహనానికి పరీక్ష (వితండవాదం) | - | 12 |
| రాష్ట్రంలో పథకాలు...పెద్ద ఎత్తున నిధులు (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| ఏమిటీ 'ఎనిమీ ప్రాపర్టీ?' (చర్చ) | - | 23 |
| జానపద వీరగాథల పరిశోధకుడు - తంగిరాల (నివాళి) | - | 24 |
| సనాతన నర్తనమణి నిర్మల (మహిళ) | - | 26 |
| ఆర్ఎస్ఎస్ శాఖకు డాక్టర్ అంబేద్కర్ (చరిత్ర) | - | 28 |
| విశ్వాసానికి అతీతంగా (వేదిక) | - | 30 |
| దావోస్‌లో భారత్ ఛేష్ (అంతర్జాతీయం) | - | 33 |
| చిత్రసీమకు సొబగులద్దిన పద్మపురస్కార గ్రహీతలు (సినిమా) | - | 43 |
| నిన్నటి క్రికెటర్లు... నేటి వీరసైనికులు! (క్రీడ) | - | 50 |

# స్వర్ణయుగ



ట్రంప్ ప్రమాణ స్వీకారం



# మా? సంచలనమా?

'నేను మళ్లీ పోటీ చేస్తాను' అని నాలుగేళ్ల క్రితం ఘంటాపథంగా చెప్పారు డొనాల్డ్ జాన్ ట్రంప్. సందర్భం– జో బైడెన్ చేతిలో ఓడిన క్షణం. అన్నట్టే ఆయన పోటీ చేశారు. ట్రంప్ గెలవడానికి బైడెన్ అన్ని విధాలా సాయపడ్డారు కూడా. తన మతిమరుపుతో, అభ్యర్థిత్వం హఠాత్తుగా కమలా హ్యారిస్‌కు బదలీ చేయడం వంటి అంశాలు, ఇక విధానపరమైన నిర్ణయాలు ఉండనే ఉన్నాయి. బైడెన్ హయాం ముందు ట్రంప్ వెంటాడుతూ వస్తున్న వివాదాలు కూడా వెలవెలబోయాయి. జూన్ 6, 2024ను అమెరికా అధ్యక్ష ఎన్నికల చరిత్రలో చిరస్మరణీయం చేస్తూ ఆయన రెండోసారి నాలుగేళ్ల వ్యవధి తరువాత శ్వేతసౌధంలోకి అడుగుపెట్టారు. తన ప్రత్యర్థి కమలా హ్యారీస్ (డెమోక్రాటిక్ పార్టీ) మీద 295 ఎలక్టొరల్ ఓట్లతో ఘన విజయమే సాధించారు. అమెరికా 47వ అధ్యక్షుడిగా జనవరి 20, 2025న ఈ రిపబ్లికన్ పార్టీ నేత ప్రమాణ స్వీకారం చేస్తూనే సంచలనాలకు శ్రీకారం చుట్టారు. అమెరికా అత్యున్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాన్ రాబర్ట్స్ ఆయన చేత ప్రమాణ స్వీకారం చేయించారు. 1861లో అబ్రహాం లింకన్ ప్రమాణం చేసిన బైబిల్ మీదనే ట్రంప్ కూడా ప్రమాణం చేసి, పదవీ స్వీకారం చేశారు. ఇంకా శ్వేతసౌధంలోకి వెళ్లకుండానే ట్రంప్ బైడెన్ నిర్ణయాలన్నింటిని ఒక్క కలం పోటుతో త్రోసిరాజన్నారు. ట్రంప్ కంటే ముందు ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రమాణం చేశారు. ట్రంప్ తనదైన ధోరణిలో వాన్స్ భార్య ఉష ఉపాధ్యక్షురాలు అయి ఉంటే బాగుండేదని చెప్పడం కొసమెరుపు.

స్వర్ణయుగం మాటేమోగాని, సంచలనాలు మాత్రం ప్రపంచ మీడియాలో పతాక శీర్షికలుగా నిలిచిపోయాయి. ఎన్నికల ప్రచారంలో తనపై జరిగిన హత్యాయత్నాలను కూడా ఆయన ఇప్పుడు తనకు అనుకూలంగా మలుచుకుంటూ వ్యాఖ్యానించారు. అమెరికాను తిరిగి గొప్ప దేశంగా పునఃప్రతిష్ఠించడానికే తనను దేవుడు రక్షించాడని అన్నారు. అక్రమవలసదారులకు అమెరికాలో స్థానంలేదంటూ భారత్ వంటి మిత్రదేశానికి ఆనందం కలిగించారు. మూడో ప్రపంచ యుద్ధం రాకుండా అడ్డుకుంటానని ప్రకటించి ప్రజాస్వామ్యప్రియులను, శాంతికాముకులను ఆకట్టుకునే ప్రయత్నం కూడా చేశారు. ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి భారత్ తరపున విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ హాజరయ్యారు. ట్రంప్‌కు భారత ప్రధాని నరేంద్ర మోదీ, హంగేరి ప్రధాని ఒర్బన్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ కూడా అభినందనలు అందించారు.

అయితే అంతా అనుకున్నట్టే ట్రంప్ నిర్ణయాలు వెంటనే అమలయ్యే అవకాశాలకు అడ్డుకట్ట పడింది. ఆయన నిర్ణయాలను, ప్రధానంగా జన్మతః అమెరికా పౌరసత్వం నిర్ణయం మీద ట్రంప్ నిర్ణయం న్యాయ వ్యవస్థ చేతిలో పడింది.

2021, జనవరిలో బైడెన్ గెలుపు సమాచారం వెలువడిన తరువాత కేపిటల్ భవనం మీద ట్రంప్ అనుచరులు వేసిన వీరంగం నిజానికి కొంత అపఖ్యాతిని తెచ్చింది. తరువాత ఆయన మీద కొన్ని కేసులు కూడా ఉన్నాయి. అయినప్పటికీ ట్రంప్ ఈ ఎన్నికలలో గెలిచి రెండోసారి అధ్యక్ష పీఠం అధిరోహించారు. ప్రపంచాన్ని కలవర పెడుతున్న ఇజ్రాయెల్–హమాస్ సంఘర్షణ; రష్యా–ఉక్రెయిన్ యుద్ధం, చైనా దూకుడు, ఐదో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవిస్తున్న తరుణంలో ట్రంప్ అధ్యక్షుడయ్యారు. ఎలాన్ మస్క్ వంటి దిగ్గజం అండదండలు కూడా ఈ ఎన్నికలలో ఆయన కలసి వచ్చాయి. ట్రంప్ ధోరణిలో తొలి నుంచి ప్రస్ఫుటంగా ఉన్నదే అక్రమ వలసల అడ్డుకట్ట వేసి తీరాలన్న ఆశయం. అలాగే సమానత్వం పేరుతో, హక్కుల పేరుతో ప్రజాస్వామిక ప్రభుత్వాలను చీకాకు పెట్టే డీప్‌స్టేట్ మీద, జార్జిసోరోస్ సంస్థల మీద, ఎల్‌జీబీటీక్యూ వంటి ధోరణుల మీద ఆయన ఉక్కుపాదం మోపడం ఖాయంగానే కనిపిస్తున్నది.

ట్రంప్ నిర్ణయాలన్నీ కాలపరీక్షకు నిలిచేవేనని ఇప్పుడే ఎవరూ చెప్పడం లేదు. కానీ ఆయన ప్రపంచాన్ని సంక్షోభం వైపు నెడుతున్న అక్రమ వలసల గురించి దృష్టి పెట్టడం ముదావహం. దీనితో ముస్లిం మతోన్మాదానికి అడ్డుకట్ట వేసే అవకాశం కూడా వస్తుంది. లండన్ మేయర్ సాదిక్ ఖాన్ ట్రంప్ గెలుపు, ఆయన ప్రయాణం ముందే ఊహించినట్టు భయాందోళనలు వ్యక్తం చేయడం చాలా విషయాలను వెల్లడిస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి వైదొలగుతున్నట్టు ప్రకటించారు. అందుకు కారణం, ఆరోగ్య సంస్థ చైనా చేతులలోకి వెళ్లిందని ఆరోపించారు. అలాగే పనామా కాల్వ కూడా చైనా చేతిలోకి వెళ్లిందని ఆగ్రహం వ్యక్తం చేయడం గమనార్హం.

నిజానికి అమెరికా అధ్యక్షుడి నిర్ణయాలు, రాజకీయాలు ప్రపంచం మీద గట్టి ప్రభావాన్నే కలిగి ఉంటాయి. ఈ సంప్రదాయాన్ని ట్రంప్ కొనసాగించడం అత్యంత సహజం. అందుకే అమెరికా అధ్యక్ష ఎన్నికకు అంత ప్రాధాన్యం.

# అక్రమ వలస



డోనాల్ట్ ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఆయన చేపడుతున్న చర్యల కారణంగా అంతర్జాతీయంగా, భారత ఆర్థికవ్యవస్థలో కొంతమేర అనిశ్చితి ఏర్పడే అవకాశం ఉంది. ఎన్నికల్లో ప్రకటించిన విధంగానే ఇమ్మిగ్రేషన్, టారిఫ్‌ల విషయంలో నిర్ణయం తీసుకున్నారు. మరి వీటి ప్రభావం ఏ విధంగా ఉంటుందో వేచి చూడాల్సిందే. అన్నింటికంటే ముఖ్యమైంది డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనం పడటం! ఒకవేళ ఈ పరిస్థితుల్లో రూపాయిని కాపాడేందుకు ఆర్‌బిఐ ఏమైనా చర్యలు తీసుకుంటే ఎగుమతులపై ప్రభావం పడుతుంది. దీన్ని తట్టుకోవడానికి దేశీయంగా మరిన్ని ఉద్యోగాల సృష్టి, వినియోగాన్ని పెంచే దిశగా కేంద్రం చర్యలు చేపట్టక తప్పదు. డాలర్ బలపడటానికి ప్రధాన కారణం వివిధ దేశాల ఉత్పత్తులపై టారిఫ్‌లు విధిస్తామంటూ చేసిన ట్రంప్ హెచ్చరికలే. ఈ విధంగా టారిఫ్‌లు పెంచడం వల్ల అమెరికాకు దిగుమతులు తగ్గుతాయి. కరెంట్ ఖాతా లోటు, వాణిజ్య లోటు తగ్గుతుంది. ఫలితంగా వివిధ దేశాలకు అందుబాటులో ఉండే డాలర్లు తగ్గుతాయి. ఆ విధంగా డాలర్ బలోపేత మవుతుంది. వివిధ కంపెనీలు తమ ఉత్పత్తులను అమెరికాకు ఎగుమతి చేయలేని పరిస్థితి ఏర్పడటంతో, క్రమంగా తమ తయారీలను అమెరికాకు మారుస్తాయి. దీనివల్ల అమెరికాకు మరింత మూలధనం సమకూరుతుంది. ఈ విధంగా డాలరుపై సానుకూల ప్రభావం ఏర్పడి అమెరికా ఆర్థికవ్యవస్థ, డాలరు బలోపేతమవుతాయి. ఇదీ ట్రంప్ అనుసరించే వ్యూహం.

ఇక అమెరికాలో పుట్టిన పిల్లలకు జన్మతః వచ్చే పౌరసత్వ హక్కును రద్దు చేస్తూ ట్రంప్ తీసుకున్న నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమంటూ సియాటిల్ ఫెడరల్ కోర్టు తాత్కాలికంగా నిలిపేయడం తాజా పరిణామం. ఇది అందరూ ఊహించిందే. శతాబ్ద కాలంగా అమల్లో ఉన్న ఈ చట్టాన్ని రద్దు చేసే విషయంలో ట్రంప్ అభిప్రాయం ఎట్లా ఉన్నా, అక్కడి వ్యవస్థలు దీన్ని అంగీకరించే పరిస్థితి లేదని అందరూ అనుకున్నదే. సహజంగానే ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకించిన డెమోక్రట్లు అధికారంలో ఉన్న రాష్ట్రాలు వాషింగ్టన్, అరిజోనా, ఇల్లినాయిస్, ఓరేగాన్ రాష్ట్రాలు సియాటిల్ ఫెడరల్ కోర్టును ఆశ్రయించారు. రాజ్యాంగంలోని 14వ సవరణ ప్రకారం పౌరసత్వ చట్ట నిబంధనలకు ఈ నిర్ణయం వ్యతిరేకమని వాదించాయి. దీంతో కింది న్యాయమూర్తి జాన్ కాఫ్నర్ ఈ ఆదేశాలను తాత్కాలికంగా నిలిపివేస్తూ తీర్పు చెప్పారు. ఇప్పటికే పలు పౌరసంఘాలు, 22 రాష్ట్రాలు ట్రంప్ పౌరసత్వ రద్దు నిర్ణయంపై పలు కోర్టుల్లో దావాలు వేశాయి. అయితే ట్రంప్ సహా మరే ఇతర యు.ఎస్. అధ్యక్షుడు ఈ రాజ్యాంగ హక్కును రద్దుచేయడం అంత సులభం కాదు. ఈ బిల్లుకు ఆమోదం లభించాలంటే దిగువ సభ (హౌజ్), ఎగువ సభ (సెనెట్)లో మూడింట రెండు వంతుల మెజారిటీ రావాలి. తర్వాత మూడు వంతుల రాష్ట్రాల ఆమోదం పొందాలి. అప్పుడే ఈ చట్టం అమల్లోకి వస్తుంది. ఇంత తతంగం ఉన్నందున ఈ చట్టం అమల్లోకి తేవడం అంత తేలికకాదని నిపుణుల అభిప్రాయం.

**అక్రమ వలసలపై భారత్ మద్దతు**

అక్రమ వలసదార్లపై ట్రంప్ ప్రభుత్వ వైఖరిని భారత్ సమర్థించింది. అమెరికాలో ఉంటున్న అక్రమ భారతీయ వలసదారుల్ని చట్టబద్ధంగా తిరిగి పంపిస్తే స్వీకరిస్తామని విదేశాంగ మంత్రి జైశంకర్ ప్రకటించారు. చట్టవిరుద్ధంగా ఎలాంటి డాక్యుమెంట్లు లేకుండా అమెరికాలో చొరబడ్డ అక్రమ వలసదారుల్ని స్వీకరించడానికి ఎల్లవేళలా సిద్ధంగా ఉంటామని ఆయన స్పష్టం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్‌ల మధ్య ఫిబ్రవరిలో భేటీ ఉండే అవకాశాలున్నాయని రాయిటర్స్ వార్తాసంస్థ ఒక కథనాన్ని ప్రచురించింది.



# దారులే లక్ష్యం?



ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌తో

అమెరికా వస్తువులపై సుంకాలు అధికంగా విధిస్తున్నారని పదే పదే చెబుతున్న ట్రంప్ ఈ అంశాన్ని లేవనెత్తే అవకాశముంది. సుంకాలు తగ్గించడంతో పాటు అమెరికా పెట్టుబడులను మరింతగా ఆకర్షించే దిశగా పలు నిర్ణయాలను ట్రంప్ ముందుంచాలని మోదీ భావిస్తున్నారని రాయిటర్స్ పేర్కొంది. మనకు అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వామి. 2023-24 సంవత్సరంలో రెండు దేశాల మధ్య 118 బిలియన్ డాలర్ల వాణిజ్యం జరిగింది.

**మనదేశంతో వివాదం**

వర్ధమాన దేశాల ముసుగులో భారత్, చైనాలు వాణిజ్య ప్రయోజనాలు పొందుతున్నాయని మొదట్నుంచీ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేస్తూనే ఉన్నారు. తర్వాతి కాలంలో దక్షిణాఫ్రికా, ఇండొనేషియాలను కూడా ఈ జాబితాలో చేర్చారు. గతంలో తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు అమెరికా ఉత్పత్తి చేస్తున్న ఖరీదైన హార్లీ డేవిడ్‌సన్ ద్విచక్ర వాహనాలపై సుంకాలను తగ్గించాలని మన దేశంపై ట్రంప్ ఒత్తిడి తెచ్చారు. చివరకు మనదేశం సుంకాలు తగ్గిస్తే, ఇది చాలదంటూ పేచీకి దిగారు. అంతేకాదు మన ఉక్కుపై 25%, అల్యూమినియం ఉత్పత్తులపై 10% అదనపు టారిఫ్ విధించడం ద్వారా ప్రతీకార వైఖరిని చూపారు. మనదేశం కూడా అమెరికా నుంచి దిగుమతి అయ్యే వస్తువులపై సుంకాలు పెంచింది. తర్వాత జీఎస్టీ నిబంధనలు భారత్‌కు వర్తింపజేయొద్దని ఏకంగా ప్రపంచ వాణిజ్యసంస్థలకు ట్రంప్ లేఖ రాశారు. ఇక బ్రిక్స్ దేశాలు డాలర్ రహిత వాణిజ్యం వైపు మొగ్గు చూపితే వందశాతం టారిఫ్‌లు విధిస్తానని హెచ్చరించారు. బ్రిక్స్‌లో మనదేశం కీలక భాగస్వామి. ఏదో విధంగా మనదేశాన్ని రష్యా, చైనాల నుంచి దూరం చేయాలన్నది ట్రంప్ ఉద్దేశం. అయితే ఈ విషయంలో ఆయన తెగేదాకా లాగే ధైర్యం చేయకపోవచ్చు. ఎందుకంటే అటువంటి చర్యలు అమెరికాకూ నష్టమే! ఉదాహరణకు 2019లో చైనా ఎగుమతులపై రూ.30 వేల కోట్ల సుంకాలు విధిస్తామని ట్రంప్ ప్రకటించిన వెంటనే అమెరికా వ్యవసాయ రంగ ఉత్పత్తుల కొనుగోళ్లు ఆపేయాలని చైనా తన ప్రభుత్వ రంగ సంస్థలకు నిర్దేశించిన వెంటనే అమెరికా స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. ట్రంప్ తన హెచ్చరికను ఉపసంహరించుకున్న తర్వాత కానీ పరిస్థితి కుదుటపడలేదు.

**పనామా కాల్వ వివాదం**

అమెరికా 47వ అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసిన ట్రంప్ పనామా కాల్వను బలవంతంగానైనా సరే స్వాధీనంలోకి తెచ్చుకుంటామంటూ చేసిన ప్రకటన భవిష్యత్ పరిణామాలపై ఆందోళన రేకెత్తించేదిగా ఉంది. 1977 నాటి ఒప్పందం ప్రకారం పనామాకు ఈ కాల్వను అమెరికా ఇచ్చివేసింది. ఇప్పుడు ఈ కాల్వ నియంత్రణ చైనా చేతుల్లోకి వెళ్లిందనేది ట్రంప్ ఆరోపణ. అసలు ఈ కాల్వను పనామాకు అప్పగించడమే మూర్ఖపు నిర్ణయమన్నది ఆయన అభిప్రాయం. అమెరికా నుంచి భారీఎత్తున ఫీజు వసూలు చేస్తున్నదంటూ ట్రంప్ చెప్పినా, ఆయన ప్రకటన వెనుక అసలు కారణం వేరే ఉంది. చైనా దూకుడుకు అడ్డుకట్ట వేయాలనే ఉద్దేశం దీని వెనుక ఉన్నదని చెబుతున్నారు. ఒకవేళ అదే నిజమైతే డ్రాగన్ తన విస్తరణ కాంక్షను మరింత దృఢంగా అమలు చేసే ప్రమాదం లేకపోలేదు. తైవాన్ విషయంలో చైనాను సంయమనంగా వ్యవహరించేలా చేయడమే ఇప్పటివరకు అమెరికా అనుసరిస్తున్న విధానం. ఇప్పుడు పనామా విషయంలో ట్రంప్ ప్రకటన, చైనాను తన విస్తరణ కాంక్షను చట్టబద్ధంగా భావించే పరిస్థితిని తెచ్చిపెట్టింది. ట్రంప్ ప్రకటన వల్ల కొన్ని కీలక ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అమెరికా పనామా కాల్వను స్వాధీనం చేసుకోవడం సముచితమైనప్పుడు, రష్యా తనవిగా భావించే ఉక్రెయిన్‌లోని

భాగాలను ఆక్రమించుకోవడం తప్పెలా అవుతుంది? ఇదే సమయంలో తైవాన్ తమదేశంలో భాగమని చైనా వాదిస్తోంది. అప్పుడు ఇదికూడా తప్పు కాదు. మనదేశానికి వస్తే పీఓకే మనదే అంటున్నాం. బలప్రయోగంతో దీన్ని స్వాధీనం చేసుకోవడం కూడా చట్టబద్ధమే అవుతుంది.

### రష్యా, చైనాలదీ తప్పు కాదు

సమస్య ఇక్కడితో ఆగలేదు, కెనడా, ఉత్తర అట్లాంటిక్ సముద్ర ప్రాంతంలోని గ్రీన్‌ల్యాండ్‌ను కలిపేసుకుంటామని ట్రంప్ చేసిన ప్రకటనలను పరిశీలిస్తే, రష్యా, చైనాల భూఆక్రమణలకు ఆమోదం లభించినట్టే కాగలదు. ట్రంప్ ప్రకటనల్లో దేన్ని అమలు చేసినా, చైనా తక్షణమే తైవాన్‌ను కలిపేసుకోవడం ఖాయం. నిజానికి పసిఫిక్, అట్లాంటిక్ మహాసముద్రాలను కలుపుతూ పనామా కాల్వను అమెరికా తవ్వించింది. 1904–14 మధ్యకాలంలో జరిపిన ఈ కాల్వ పనుల్లో కొన్ని వేలమంది అమెరికా కార్మికులు మరణించారు. ఎట్టకేలకు కాల్వ నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రయాణ దూరం చాలావరకు తగ్గడంతో ఈ కాల్వ గుండా వాణిజ్య ఓడల రాకపోకలు పెరిగాయి. వీటిల్లో 70 శాతం ఓడలు అమెరికాకు చెందినవే కావడం గమనార్హం. 1977లో కుదిరిన ఒప్పందం ప్రకారం 1999 నుంచి ఈ కాల్వ పనామా అధీనంలో కొనసాగుతోంది. ఎప్పుడైనా భద్రతకు ప్రమాదం వాటిల్లుతున్నదని భావిస్తే అమెరికా జోక్యం చేసుకోవచ్చు. ఇప్పుడు ట్రంప్ ఈ కాల్వ చైనా నియంత్రణలో ఉన్నదని చెబుతున్నారు. వాస్తవమేంటంటే హాంకాంగ్‌కు చెందిన సీకే హచిసన్ అనుబంధ కంపెనీ పనామా కాల్వలోని కరీబియన్, పసిఫిక్ ప్రవేశాల వద్ద నిర్వహణ బాధ్యతలు చేపట్టింది. కాకపోతే 2017లో చైనా ప్రారంభించిన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌లో చేరిన మొట్టమొదటి దేశం పనామా! 2016లో చైనా ప్రభుత్వ సీఓఎస్‌సీఓకు చెందిన ఓడ తొలిసారిగా పనామా కాల్వలోకి ప్రవేశించింది. అదే ఏడాది చైనాకు చెందిన లాండ్‌బ్రిడ్జ్ గ్రూపు మార్గరిటా దీవి లోని అతిపెద్ద నౌకాశ్రయాన్ని కొనుగోలు చేసింది. పనామా కాల్వపై మరో రెండు వంతెనల నిర్మాణ కాంట్రాక్టును కూడా చైనా కంపెనీలే దక్కించు కున్నాయి. ఈ విధంగా క్రమంగా ఈ ప్రాంతంలో చైనా ప్రాబల్యం విస్తరిస్తుండటం, అమెరికా ఆగ్రహానికి ప్రధాన కారణం. తాను కష్టపడి నిర్మించిన కాల్వపై చైనా క్రమంగా తన పెత్తనాన్ని పెంచుకుంటూ పోవడం అమెరికాకు ఏమాత్రం మింగుడు పడనిది. ఈ నేపథ్యంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో పనామా కాల్వ కొనుగోలు చేయాలన్న ప్రతిపాదనను ముందుకు తేవడం తాజా పరిణామం.

### వాణిజ్యంపై ప్రభావం

సుంకాలు విధిస్తామంటూ హెచ్చరిస్తున్న ట్రంప్ వీటి పర్యవసానం కలిగించే ప్రతికూల ఫలితాలను గుర్తించాలి. 1930లో అమెరికా టారిఫ్ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. ఇందుకు ప్రతిగా ఇతర దేశాలు కూడా వాణిజ్య ఆంక్షలు విధిస్తూ రావడంతో, పెను సంక్షోభం ఏర్పడింది. ఫలితంగా ప్రపంచ దేశాల జీడీపీ పడిపోయి, చివరకు హిట్లర్ ఈ సంక్షోభాన్ని తనకు అనుకూలంగా మలచుకోవడానికి దారితీసింది. అధికారాన్ని చేపట్టిన తర్వాత గతంలో చెప్పినట్టుగానే ట్రంప్ మెక్సికో, కెనడా, చైనాల దిగుమతులపై దిగుమతి సుంకాలను పెంచేయడం ద్వారా అమెరికాను మరింత స్వీయ రక్షణ విధానాల్లోకి తీసుకెళ్లారు. ఈ కొత్త టారిఫ్ విధానాలవల్ల మెక్సికో, కెనడాలకు మాత్రమే కాదు అమెరికాకు కూడా నష్టమే! ఉదాహరణకు కార్ల తయారీ రంగానికి ఈ మూడు దేశాల్లో సరఫరా శృంఖలాలున్నాయి. ఈ టారిఫ్‌లవల్ల ఈ శృంఖలాలు పూర్తిగా దెబ్బతిని ఆటోమొబైల్ మార్కెట్ పూర్తిగా దెబ్బతినడం ఖాయం. రేట్లు విపరీతంగా పెరిగి, డిమాండ్ పడిపోవడమే ఇందుకు కారణం. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో రాజీనామాకు ఈ టారిఫ్‌ల భయం కూడా ఒక కారణమని చెబుతున్నారు. అయితే ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో అందుకు తమ నుంచి కూడా ప్రతీకారం ఉంటుందని జస్టిన్ ట్రూడో హెచ్చరించారు. దీనివల్ల నష్టపోయేది వినియోగదారులేనని ఆయన అన్నారు. కెనడానుంచి 34 రకాల అత్యవసర ఖనిజాలు, లోహాలను అమెరికా దిగుమతి చేసుకుంటున్నది. విద్యుత్, ముడి చమురు,



పండ్లు, కూరగాయలు, మాంస ఉత్పత్తులు కొనుగోలు చేస్తోంది. ప్రతిరోజూ 270 కోట్ల డాలర్ల విలువైన వస్తువుల వాణిజ్యం ఇరుదేశాల మధ్య జరుగుతుంటుంది.

**చైనాకు తలనొప్పి**


ఇక టారిఫ్‌ల బారినపడే మరో దేశం చైనా. చవక ధరలకే వస్తువులను ఇతరదేశాలకు ఎగుమతి చేస్తూ ప్రపంచ తయారీ కర్మాగారం చైనా వస్తువులు, పెంచిన టారిఫ్‌ల పుణ్యమాని ధరలు పెరిగి డిమాండ్ పడిపోవడం ఖాయం. 2024లో చైనా ప్రభుత్వ లక్ష్యాల మేరకే ప్రగతిని సాధించినప్పటికీ, అంతర్గత, బాహ్య ఒత్తిళ్లను తీవ్రంగా ఎదుర్కొంటున్నది. కొనసాగుతున్న స్థిరాస్థి సంక్షోభం, నిరుద్యోగం వంటి సమస్యలకు తోడు చైనా నుంచి 500 బిలియన్ డాలర్ల విలువైన దిగుమతులపై సుంకాలు పెంచేస్తామన్న బెదిరింపులతో చైనా పాలకులకు దిక్కుతోచడం లేదు. నిపుణులు చైనా ప్రగతి స్థిరంగా ఉంటుందని అంచనా వేస్తున్నా, క్రమంగా పెరుగుతున్న అస్థిర పరిస్థితులు చైనా ప్రగతిపై నీలినీడలు ప్రసరిస్తున్నాయి. ఈ నేపథ్యంలో దేశీయ మార్కెట్‌లో కొనుగోళ్లను పెంచుకుందామనుకున్నా, వినియోగదార్ల కొనుగోలు శక్తి బలహీనంగా ఉండటం పెద్ద అడ్డంకి. దీన్ని ఏవిధంగా ఎదుర్కోవాలన్నది చైనా ప్రభుత్వం ముందున్న ప్రధాన సవాలు! ప్రభుత్వం ఇప్పటివరకు తీసుకున్న చర్యల కారణంగా ప్రపంచ బ్యాంకు అంచనా ప్రకారం 2024 డిసెంబర్ నెలాఖరకు చైనా ప్రగతి 4.1%గా నమోదైంది. ఈ ఏడాది 4.5%కు చేరుకునే అవకాశాలు న్నాయని అంచనా. ఇక ట్రంప్ మొదటిసారి యు.ఎస్. అధ్యక్షుడైనప్పటి నుంచే చైనా దిగుమతులపై టారిఫ్‌లు పెంచడం మొదలైంది. అది బైడెన్ ప్రభుత్వ హయాంలో మరింత పెరిగి, ఇప్పుడు ట్రంప్-2 హయాంలో మరింత సంక్లిష్టతకు గురికానున్నాయి. ఈవిధంగా టారిఫ్‌లు పెంచడమంటే చైనా కంపెనీలను మరో దేశాన్ని చూసుకోమని పరోక్షంగా చెప్పడమే! అయితే గత మూడు నాలుగు దశాబ్దాల కాలంనుంచి చైనా క్రమంగా ఎదుగుతూ నేడు ప్రపంచ తయారీ కేంద్రంగా మారింది. ఈ నేపథ్యంలో అక్కడి కంపెనీలు ఉన్నఫళంగా అక్కడినుంచి మారే పరిస్థితి లేదు. అందువల్ల ప్రస్తుత పరిస్థితుల్లో చైనాను పూర్తిగా పక్కనబెట్టడం సాధ్యం కాదు కూడా. అయితే ఈ సారి ప్రపంచ వాణిజ్య పోరులో ప్రధానపాత్ర విద్యుత్ వాహనాలదే అవుతుంది. ఎందుకంటే గత ఏడాది చైనా 10మిలియన్ల వాహనాలను అమ్ముకోగలిగింది. వీటిల్లో సింహభాగం అమెరికా, కెనడా, యూరోపియన్ యూనియన్ దేశాలకే ఎగుమతి అయ్యాయి. ఇప్పుడీ దేశాలు టారిఫ్‌లు విధించడానికి ఉద్యుక్తమవడంతో చైనా ప్రపంచ వాణిజ్యసంస్థలో ఫిర్యాదు చేస్తానని బెదిరిస్తోంది. ఇప్పుడు ట్రంప్ విధిస్తున్న టారిఫ్‌ల




వల్ల ఈయూ దేశాలపై కూడా ప్రభావం చూపనుంది. సంప్రదాయికంగా జర్మనీ, ఫ్రాన్స్‌లు యూరప్ దేశాల ఆర్థిక ప్రగతికి ఇంజన్లుగా కొనసాగుతున్నాయి. ట్రంప్ నిర్ణయం వల్ల అమెరికా ఆర్థిక వ్యవస్థ కోలుకుంటుందేమో కానీ, యూరప్ దేశాల ఎగుమతులు దెబ్బతిని వాటి ఆర్థిక వ్యవస్థలు కుదేలయ్యే పరిస్థితి నెలకొంది. ఇక కెనడా నుంచి దిగుమతులపై 25% టారిఫ్ పెంచడం, ఆ దేశంలో తీవ్ర రాజకీయ సంక్షోభానికి కారణమవుతోంది. ట్రంప్ బెదిరింపులను ఎదుర్కొనే విషయంలో విభేదాల నేపథ్యంలో మాజీ ఆర్థిక మంత్రి క్రిస్టియా ఫ్రీలాండ్స్ రాజీనామా చేసారు. తర్వాతి పరిణామాల్లో జస్టిన్ ట్రూడోకు మద్దతు క్రమంగా పడిపోవడంతో ప్రధాని పదవి నుంచి తప్పుకుంటానని ప్రకటించక తప్పలేదు. ఫలితంగా కెనడా రాజకీయాలు పెద్ద కుదుపునకు లోనయ్యాయని చెప్పక తప్పదు.

**ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు?**

రష్యా- ఉక్రెయిన్ యుద్ధానికి వందరోజుల్లోగా ముగింపు పలకాలని ట్రంప్ యంత్రాంగం నిర్ణయించి ఆ దిశగా అడుగులు ముందుకేస్తున్నది. అయితే ఇప్పుడు ఉక్రెయిన్ అధ్యక్షులు జెలన్‌స్కీపై ఒత్తిడి తీవ్రంగా ఉంది. ప్రధానంగా తమ దేశ భూభాగాలను కోల్పోవడం, రష్యాకు అనుకూలంగా మినహాయింపులు ఇవ్వాల్సివస్తే పరిస్థితేంటనేది జనన్‌స్కీని వెంటాడుతున్న సమస్య! ఉక్రెయిన్‌కు సంబంధించి తాను అమెరికా అధ్యక్షులు ట్రంప్‌తో చర్చించేందుకు సిద్ధమని రష్యా అధ్యక్షులు కూడా పుతిన్ కీలక వ్యాఖ్యలు చేయడం తాజా పరిణామం. రష్యా టెలివిజన్‌లో మాట్లాడుతూ అసలు 2020లో డోనాల్డ్ ట్రంప్ అధికారంలో వున్నట్లయితే అసలు ఉక్రెయిన్‌తో యుద్ధం వచ్చి ఉండేదేకాదన్నారు.ఈ సందర్భంగా ట్రంప్‌పై ప్రశంసల జల్లు కురిపించడమే కాదు, గత ఎన్నికల్లో ట్రంప్ విజయాన్ని 'దొంగిలించి ఉండకపోతే' ఉక్రెయిన్ సంక్షోభం వచ్చివుండేది కాదంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు, నాటి తన పరాజయం అక్రమమంటూ ట్రంప్ చేస్తున్న వాదనకు బలం చేకూర్చేవిగా ఉన్నాయి. దావోస్ వేదికగా జరుగుతున్న వర్చువల్ సదస్సులో ట్రంప్ మాట్లాడుతూ రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి సాధ్యమైనంత త్వరగా ముగింపు పలుకుతానని చెప్పారు. సౌదీ అరేబియా, ఒపెక్ దేశాల కూటమి చమురు ధరలు తగ్గిస్తే యుద్ధం త్వరగా ముగిసిపోతుందన్నారు. అయితే చమురు ధరలకు, యుద్ధం ఆపడానికి సంబంధం లేదని రష్యా స్పష్టం చేసింది. అమెరికా-రష్యా సంబంధాలు ఉక్రెయిన్ యుద్ధంతో దారుణంగా క్షీణించాయి. రష్యాతో పోరాడుతున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలన్‌స్కీకి అమెరికా అధ్యక్షుడుగా జోబైడెన్ ఉన్న కాలంలో పెద్ద మొత్తంలో ఆర్థిక, ఆయుధ సహకారం అందింది. ఇక మధ్య ప్రాచ్యం విషయానికి వస్తే ఇజ్రాయెల్‌పై ఒత్తిడి తెచ్చి, హమాస్ గ్రూపులపై తన పలుకుబడిని ఉపయోగించి, ఎట్టకేలకు ఇజ్రాయెల్-పాలస్తీనాల మధ్య ఒక అంగీకారం కుదిరేలా చేశారు. ముఖ్యంగా గాజాలో కాల్పుల విరమణకోసం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహును ఒప్పించగలిగారు. ఈ పరిణామాలన్నింటినీ పరిశీలిస్తే రాబోయే కాలంలో వరల్డ్ ఆర్డర్ మారనున్నదా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.



**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

# సనాతన ధర్మం సహనా

**భారతీయుల సనాతన ధర్మం విలువను పలు ప్రపంచ దేశాలు తెలుసుకుంటున్నాయి. అనుసరించేందుకు ప్రయత్నిస్తున్నాయి. కానీ మన దేశంలో స్వయం ప్రకటిత మేధావులు కొందరు హిందువుల విశ్వాసాలపై దాడి చేయడం సర్వసాధారణంగా మారింది. సర్వే జనా సుఖినో భవంతు అంటూ ఇతర మతాల విశ్వాసాలను గౌరవిస్తున్న హిందువుల మంచితనాన్ని చేతకానితనంగా తీసుకుంటున్నారు. సనాతన ధర్మం మనకు నేర్పిన సహనాన్ని పరీక్షిస్తున్నారు. ఇటీవల మన తెలుగు నేలపై జరిగిన కొన్ని ఘటనలు పరిశీలిస్తే ప్రపంచంలో ఎక్కడా లేని విధంగా లౌకివాదం ఒక్క హిందువులకే పరిమితమా అనిపిస్తుంది. మిడిమిడి జ్ఞానంతో సనాతన ధర్మంపై అవాకులు చెవాకులు పేలుతున్న వారికి ఇతర మతాలపై వ్యాఖ్యానించే ధైర్యం లేదు కానీ మాన విశ్వాసాలపై మాత్రం నోరు పారేసుకుంటున్నారు.**

**“అజ్ఞః సుఖమారాధ్య స్సుఖతరమారాధ్యతే విశేషజ్ఞః / జ్ఞానలవ దుర్విదగ్ధం బ్రహ్మాసి నరం న రంజయతి”**

(తెలియని వారికి సులభంగా తెలియజేయవచ్చు. తెలిసిన వారికి మరింత సులభంగా తెలియజేయవచ్చు. తెలిసీ తెలియనివారికి మాత్రం తెలియజేయడం బ్రహ్మదేవుడి తరం కూడా కాదు)

పై మాటలు నేటి కుహనా మేధావులకు, సెక్యులరిస్టులకు సరిగ్గా సరిపోతాయి. ఇటీవల భాగ్యనగరంలో ఏర్పాటు చేసిన పుస్తకాల ప్రదర్శనలో వామపక్షవాది ఎన్.వేణుగోపాల్, సినీ ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం, మీడియా యాంకర్ శ్రీముఖి, సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ తమకు అన్నీ తెలుసన్నట్టు సనాతనధర్మంపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఆయా రంగాల్లో పేరుగాంచిన వీరు చేసే వ్యాఖ్యలకు సమాజంలో విస్తృతంగా ప్రచారం లభించే అవకాశాలుండడంతో ఆచితూచి వ్యవహరించాల్సిన బాధ్యత వీరిపై ఉంటుంది. అయితే, ఆ సంగతి విస్మరించి మేము నమ్మిందే నిజం అనుకుంటూ, వాటిని నిరూపించే ప్రయత్నంలో అవాస్తవాలతో హిందువుల మనోభావాలను దెబ్బతీస్తున్నారు. సనాతన ధర్మంపై నమ్మకం లేని వ్యక్తులు, విదేశీ శక్తుల భావాలకు ప్రభావితమై వారు చెప్పిన అసత్యాలు, కల్పితాలను నమ్మకుండా వాస్తవాలను తెలుసుకొని మాట్లాడితే మంచిదనే భావన సర్వత్రా వ్యక్తమవుతోంది.

తెలుగు సమాజంపై సినిమాల ప్రభావం అధికం. కొందరు సినీ ప్రముఖుల రాజకీయాల్లో క్రియాశీలక పాత్ర పోషించారు. వారి వ్యవహార శైలి, మాట్లాడే ప్రతి మాటకు విలువ ఉన్న నేపథ్యంలో ఏమి మాట్లాడినా చెల్లుబాటు అవుతుందనే ధోరణితో కాక ఆచితూచి వ్యవహరించాలి. తెలుగు చిత్ర పరిశ్రమలో వెయ్యికిపైగా సినిమాలో హాస్యనటుడిగా నటించి అందరికీ ఆనందం కలిగించిన బ్రహ్మానందం ఇటీవల ఒక కార్యక్రమంలో మాట్లాడుతూ తన స్థాయిని దిగజార్చుకున్నారు. సామాజిక మాధ్యమాలలో వెల్లువెత్తిన విమర్శలే ఇందుకు నిదర్శనం. వేదాలు, మనుశాస్త్రం స్త్రీలను చులకనగా చూశాయని, సావిత్రిబాయి ఫూలే వంటి మహిళలు నేటి మహిళలకు ఆదర్శమని అన్నారు. సావిత్రిబాయి ఫూలే గొప్పవారు అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే తాను వేదాలను ఔపోసిన పట్టినట్టు, మను ధర్మశాస్త్రంపై పరిశోధన చేసినట్టు విమర్శలు చేయడమే ఆశ్చర్యమేసింది.

సమాజంలో పేరు ప్రఖ్యాతలున్న వారు ఒక విషయంపై మాట్లాడేటప్పుడు ఒక్కటికి రెండుసార్లు ఆలోచించాలి. సనాతన ధర్మంపై ద్వేషమున్న వారు రాసిన పుస్తకాలు చదివి అవే నిజమనుకొని మాట్లాడే బదులు, వారు ఏమి చెప్పారు? ఎందుకు చెప్పారు? ఏ సందర్భంలో చెప్పారు? వంటి అంశాలపై పరిశోధిస్తూ అధ్యయనం చేయాలి. ఎందుకు అంటే, వారు విమర్శలకు దిగుతున్నది కోట్లాది మంది విశ్వాసాలకు సంబంధించిన అంశం మీద. కాల పరీక్షకు నిలిచిన జీవన విధానం మీద. అందులో ఏమైనా చెడు ఉంటే గుర్తించి వాటిని విస్మరించాలి. మంచిని అనుసరించాలి. చేతకాకపోతే కనీసం అందులో ఉన్న మంచీ చెడు రెండూ కూడా చెబుతూ, ఏపక్షంగా బురదజల్లడం మానుకోవాలి.

దేవీ భాగవతం చదివితే తెలుస్తుంది ఈ జగమంత జగన్మాత సృష్టే అని, బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు సహా దేవతలందరూ దేవీమాత కృపకు పాత్రులు కావాల్సిందే అని దేవీ భాగవతంలో ఉంది. సనాతన ధర్మంలో స్త్రీకి ఇచ్చిన ప్రాధాన్యం ఇతర ఏ మతంలో అయినా ఉందని వీరు చెప్పగలరా? హిందూ మతంలో ఉన్నట్టు మహిళలను దేవతలుగా ఇతర ఏ మతంలోనైనా ఆరాధించినట్టు వీరికి తెలుసా? మన వేదాల్లో ‘శ్రీ సూక్తం’, ‘దేవీ సూక్తం’ స్త్రీ శక్తిని స్తుతించారని ఆయనకు తెలుసా? మహాభారతం ఆదిపర్వంలో ‘ఏ పురుషుడూ కోపంలో కూడా తన భార్యకు నచ్చని పని చేయ కూడదు. ఆనందం, ధర్మం భార్యపైనే ఆధారపడి ఉంటుంది. స్త్రీలు లేనిదే పురుషులను ఎవరూ సృష్టించలేరని చెప్పిన విషయం వేదాల ప్రస్తావన’ తెచ్చిన బ్రహ్మానందానికి తెలుసా?

వేదాలపైనే కాకుండా మనుధర్మ శాస్త్రంపై కూడా పరిశోధన చేసినట్టు మాట్లాడిన బ్రహ్మానందానికి మనుధర్మంలో తల్లిని భూదేవీ రూపంగా చెప్పారని, స్త్రీలను సోదరులు, తండ్రులు, భర్త గౌరవించాలని, స్త్రీలను మన్నించిన చోట దేవుళ్లు సంతోషంగా ఉంటారని, స్త్రీలు బాధపడే చోట కుటుంబం సర్వనాశనమవుతుందని చెప్పిన విషయాలు ఆయనకు తెలుసా? దేనిపైన అయినా విమర్శలు చేసినప్పుడు అందులో నిజమెంతో రూఢి చేసుకోకుండా మాట్లాడడం ఒక స్థాయిలో ఉన్న వారికి కళంకమే. మహిళా సాధికారత కోసం పరితపిస్తున్నట్టు నటించే ఇలాంటి పెద్ద మనుషులు మన గ్రంథాలపై వ్యాఖ్యలు చేసినట్టు ఇతర మతాలలో స్త్రీల పరిస్థితులపై మాట్లాడగలరా? మాట్లాడితే ఏమవుతుందో వారికి బాగా తెలుసు. హిందువులైతే స్పందించరని, పట్టించుకోరనే నమ్మకంతో ఇష్టం వచ్చినట్టు పేలుతున్నారు. దేశంలో అత్యున్నత పురస్కారాల్లో ఒకటైన పద్మశ్రీ అవార్డు అందుకున్న బ్రహ్మానందం ఇలాంటి అర్థరహితమైన అనుచిత వ్యాఖ్యలు చేయడం శోచనీయం. సనాతన ధర్మంపై సదభిప్రాయం లేని ఈయన ఈ వ్యాఖ్యల అనంతరం తిరుమలలో వైకుంఠ దర్శనం చేసుకోవడం గమనార్హం. బ్రహ్మానందం బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతూ మేము ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందనే ధోరణితో వ్యవహరిస్తే నవ్వులు పంచే ఈ నటుడే నవ్వులపాలు కావడం ఖాయం. ఆయన తన వ్యాఖ్యలపై ఆత్మ పరిశీలన చేసుకోవాలి.

సనాతన ధర్మంపై అవగాహనా రాహిత్యంగా వ్యాఖ్యలు చేయడం పరిపాటిగా మారుతున్న వేళ తెలుగు యాంకర్ శ్రీముఖి హిందువులు పవిత్రంగా ఆరాధించే రామాయణంలోని రాముడు, లక్ష్మణుడు కల్పిత పాత్రలు అంటూ వ్యాఖ్యానించారు. ఆదర్శపురుషుడు రాముడిపై వ్యాఖ్యలు చేసిన ఆమెకు రామాయణంపై అవగాహన ఉందా? భారతీయ వాఙ్మయంలో ఆదికావ్యంగా పూజలందుకుంటున్న

రామాయణం జీవనవిధానం నేర్పిస్తుంది. మనకు నడవడిక నేర్పింది. భారతదేశంలోనే కాకుండా వియాత్నం, ఇండోనేషియా, థాయిలాండ్, కంబోడియా, మలేషియా వంటి దేశాల ప్రజల మీద ప్రభావం కలిగిన రామాయణంపై పుణ్యభూమి అయిన మన దేశంలో అనుచిత వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరం. యాంకర్ శ్రీముఖి వ్యాఖ్యలపై హిందువులు నిరసనలు తెలపడంతో అనంతరం పొర పాటు తెలుసుకున్న ఆమె తొందరగానే స్పందించి విచారం వ్యక్తం చేయడం స్వాగతించాల్సిన అంశం.



# నికి పరీక్ష

రామాయణంపై అనుచిత వ్యాఖ్యలు చేయడం దేశంలో ఒక పరిపాటిగా మారింది. ముఖ్యంగా వామపక్షం, హేతువాదం భావనలకు ఆకర్షితులైన వారితో సనాతన ధర్మానికి ప్రమాదం ఏర్పడింది. మన ఇతిహాసాలని వక్రీకరిస్తూ హిందువులు పూజించే దేవతలను విమర్శిస్తూ, రాక్షసులుగా ఉన్న వారిని కీర్తించడం ఒక ఫ్యాషన్‌గా మారింది. అందులో భాగంగానే తెలుగు సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ ఇటీవల రావణాసురుడిని గొప్పవాడిగా పేర్కొన్నారు. రామాయణంలో కూడా రావణాసురుడి గుణగణాలను తెలిపినా, ఆయన ఎందుకు, ఏవిధంగా పతనమయ్యాడో తెలియజేస్తూ మనం ఎలా ఉండకూడదో తెలియజేసింది. ఇతిహాసాల్లోని చెడును ఉటంకిస్తూ మనకు ఆదర్శమైన మార్గదర్శకాలు చేయాల్సిన రచయితలు రాక్షసులను కీర్తిస్తూ నేటి తరానికి ఎలాంటి సంకేతాలు పంపిస్తు న్నారో ఆలోచించుకోవాలి.

తెలుగు సినీ రంగ ప్రముఖుల తీరు ఇలా ఉంటే సనాతన ధర్మంపై నిత్యం నిప్పులు చెరిగే వామపక్ష వాది ఎన్.వేణుగోపాల్ ఇటీవల హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించిన బుక్ ఎగ్జిబిషన్‌లో మరింత రెచ్చిపోయారు. ఆయన ఏర్పాటు చేసిన పుస్తకాల స్టాల్‌లో కోట్లాది మంది ఆరాధ్యమైన వేంక టేశ్వరస్వామి పవిత్ర స్థలమైన తిరుమల ఒక బౌద్ధ క్షేత్రం అంటూ పుస్తకాన్ని విక్రయించారు. ఇలాంటి పుస్తకాలు అమ్ముతూ సనాతనధర్మం అనుసరిస్తున్న వారి మనోభావాలను ఎందుకు కించపరుస్తున్నారని, ఒక మతానికి వ్యతిరేకంగా ఉన్న పుస్తకాన్ని ఎలా అమ్ముతారని ఒక సందర్శకుడు ప్రశ్నిస్తే "నా స్టాల్ నా ఇష్టం. ఇతర పుస్తక స్టాల్‌లో అన్య మతస్తులను కించపరుస్తూ ఉన్న పుస్తకాలు లేవా..? ఇక్కడ అన్ని రకాల పుస్తకాలు అమ్ముతాం.. హిందూమతం అంత దుర్మార్గం ఎక్కడా లేదు" అని ఆయన దురుసుగా మాట్లాడిన ఒక వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఈ వ్యాఖ్యలను గమనిస్తే వీరు హిందు మతానికి వ్యతిరేకంగా వామపక్ష నీడన ఎంతగా రెచ్చిపోతున్నారో తెలుస్తుంది.

వేణుగోపాల్ తమ కుటుంబంలోని కొందరి ప్రమేయంతో వామపక్షం వైపు ఆకర్షితులై హిందు మతానికి, జాతీయతకు వ్యతిరేకంగా వ్యవహారాలు నడుపుతూ రచనలు చేస్తుంటారు. వీక్షణం అనే పత్రికకు ఎడిటర్‌గా ఉన్న ఈయన సనాతన ధర్మంపై దాడి చేయడంలో ముందు వరుసలో ఉంటారు. అన్ని రకాల పుస్తకాలు అమ్ముతాం అని ఈయన చెప్పినా, వారి స్టాల్‌లో హిందూ మతానికి వ్యతిరే కంగా పుస్తకాలు ఉన్నాయే కానీ, ఇతర మతాలకు వ్యతిరేకంగా ఒక్క పుస్తకం కూడా లేదు. మరోవైపు ఇతర స్టాల్స్‌లో ఇతర మతాలను కించపరుస్తూ పుస్తకాలున్నాయని ఈయన చెప్పినా బుక్ ఎగ్జిబిషన్ మొత్తం తిరిగినా ఎవరి ధర్మాల గురించి వారు గొప్పగా చెప్పుకున్న పుస్తకాలున్నాయి తప్ప అన్య మతస్తులను కించపరుస్తూ ఎలాంటి పుస్తకాలు ఎగ్జిబిషన్‌లో కనిపించలేదంటే వీరి విమర్శలు ఎంత అర్థరహితంగా ఉన్నాయో తెలుస్తుంది.

హేతువాదులం, కమ్యూనిస్టులం అని చెప్పుకునే మేధావులు ఒక ధర్మాన్ని ఎలా లక్ష్యంగా చేసుకుంటారు? కులం, మతం లేవనే వీరికి ఇతర మతాలలో ఉన్న లోపాలు కనిపించవా? లేదంటే వారంటే భయమా? కుల వ్యవస్థలున్న హిందూ ధర్మంలో మహిళలను చిన్నచూపు చూస్తారని వితండ వాదం చేయడం వీరికి ఒక పరిపాటిగా మారింది. సనాతన ధర్మంలో కుల వ్యవస్థ గురించి మాట్లాడే వీరికి ఇతర మతాలలో కుల వ్యవస్థలు, సామాజిక భేదాలు లేవని చెప్పగలరా? అందులోని లోపాలను ఎత్తిచూపే సాహసం వీరు చేయగలరా? అసలు మావోయిస్టు పార్టీలోని అణచివేత మీద, లైంగిక వేధింపుల మీద ఆ శిబిరాల నుంచి బయట పడినవారు చెప్పిన మాటలకు వీరి వద్ద సమాధానం ఉందా? ఈ పార్టీలలో, సంస్థలలో స్త్రీలకు ఇచ్చిన స్థానం ఎక్కడ? హిందూ మతంలో అన్ని కులాలకు గౌరవం ఉంది. ఇతిహాసాలు మొదలు కొని అన్నింటా అన్ని కులాలకు ప్రాధాన్యత సనాతన ధర్మంలో దక్కిందనే నిజం వీరికి తెలియదా? ఎవరైనా నిజాలను ప్రశ్నిస్తే దాడి చేయబోయారంటూ బురద జల్లుతూ గ్లోబల్ ప్రచారం చేయడం వీరికి ఒక ఆనవాయితీగా మారింది. ఒక మతాన్ని వ్యతిరేకిస్తూ, ఇతర మతాలంటే భయపడే వీరు హేతువాదులు ఎలా అవుతారు?

ఇటీవల విజయవాడలో జరిగిన వీహెచ్‌పీ సమావేశంలో ప్రముఖ సినీ గేయ రచయిత అనంత శ్రీరామ్ చేసిన ఉపన్యాసం మంచి పరిణామం. గతంలో పలు వివాదాస్పద గేయాలు రాసిన ఈయన సినీ రంగంలో సనాతన ధర్మానికి వ్యతిరేకంగా కొన్ని దుష్టశక్తులు వ్యవహరిస్తున్నాయని బట్టబయలు చేశారు. గతంలో తాను కూడా ఇలాంటి పాటలే కొన్ని రాశానని చెప్పిన ఈయన క్షమాపణలు కూడా కోరారు. సనాతన ధర్మంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్న ఇతర సినీ ప్రముఖులు కూడా అనంత శ్రీరామ్ బాటలో నడిస్తే బాగుంటుంది.

– శ్రీపాద












# జన ఘన

**76**వ గణతంత్ర దినోత్సవానికి దేశరాజధాని ఢిల్లీలోని కర్తవ్యపథ్ జనవరి 26 ఆదివారం ప్రధాన వేదికగా అవతరించింది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, వేడుకకు ముఖ్య అతిథి అయిన ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంటో అనాదిగా వస్తున్న సంప్రదాయ బగ్గీలో కర్తవ్యపథ్‌కు చేరుకున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఇతర కేంద్ర మంత్రులు, విదేశీ రాయబారులు, వివిధ రంగాల ప్రముఖులతో కూడిన వేలాది మంది సమక్షంలో జాతీయ పతాకాన్ని రాష్ట్రపతి ఎగురవేశారు. అనంతరం రాష్ట్రపతి ముర్ము సైన్యం నుంచి 105 మి.మీ.ల లైట్ ఫీల్డ్ గన్స్‌తో గౌరవ వందన స్వీకరించారు. ఆ తర్వాత కనులపండువగా జరిగిన శకటాల ప్రదర్శన ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈసారి కవాతుకు స్వర్ణిమ్ భారత్, విరాసత్ ఔర్ వికాస్ అనే ఇతివృత్తాన్ని ఎంపిక చేశారు. గణతంత్ర దినోత్సవ కవాతు చరిత్రలో తొలిసారి అన్నట్టుగా 100 మంది మహిళలు సంప్రదాయ సంగీత వాయిద్యాలతో కవాతుకు నాంది పలికారు. 300 మంది కళాకారులతో కూడిన బృందం సారే జహాసే అచ్ఛా గీతాన్ని ఆలపించింది. భారత వైమానిక దళానికి చెందిన హెలికాప్టర్లు కవాతు జరుగుతున్న కర్తవ్యపథ్‌పై పూల వర్షం కురిపించాయి. ఇండోనేసియా జాతీయ సాయుధ బలగానికి చెందిన 300 మందికి పైగా సభ్యులు కవాతులో పాల్గొన్నారు. భారత్ అమ్ముల పొదిలోని ట్యాంక్–టీ90, బీఎంపీ–2 శరత్, బ్రహ్మోస్, నాగ క్షిపణులు, అగ్నిబాణ్, పినాక రాకెట్ లాంఛర్లు, ఆకాశ్, చేతక్, బజరంగ్, ఐరావత్ పేరిట ఆయుధాలు దేశ శక్తి, సామర్థ్యాలను ప్రపంచానికి చాటి చెప్పాయి. స్వశక్త్ ఔర్ సురక్షిత్ భారత్ ఇతివృత్తంగా త్రివిధ దళాలు ఉమ్మడిగా ప్రదర్శించిన శకటం అత్యంత ఆసక్తిదాయకంగా ముందుకు సాగింది. దేశం నలుమూలాల నుంచి వచ్చిన 5,000 మంది కళాకారులు 11 నిముషాల పాటు సాగిన జయతి జయ మహాభారతం అనే పాటకు కళాప్రదర్శన ఇచ్చారు. డెవిల్స్ డౌన్, ట్యాంక్‌టాప్, బుల్లెట్ సెల్యూట్, డబుల్ జిమ్మీ పేరిట మోటార్ సైకిళ్లపై డేర్‌డెవిల్స్ సాహసోపేతమైన విన్యాసాలు చేశారు. ఏఎన్–31, రాఫెల్, డోర్నియర్ 228, సుఖోయ్–30, సీ–17, జాగ్వార్, సీ–295, సీ–190 విమానాలు, ఎంఐ–హెలికాప్టర్లను కలుపుకొని ఏడు హెలికాప్టర్లు, 22 ఫైటర్ జెట్‌లు, 11 రవాణా విమానాలు గగనతలంలో చేసిన విన్యాసాలు ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తాయి. శకటాల





# తంత్రం

విషయానికి వస్తే కేంద్ర ప్రభుత్వ శాఖలు, రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 31 శకటాలు రాష్ట్రపతి భవన్ నుంచి ఎర్రకోట వరకు తొమ్మిది కి.మీ.ల మేర మార్గంలో కవాతు సాగించాయి. వేర్వేరు రాష్ట్రాల నుంచి మహిళా సాధికారతను ప్రతిబింబించే 26 శకటాలు కవాతులో పాల్గొన్నాయి. కేంద్రీయ రిజర్వు పోలీసు బలగం నుంచి 148 మంది మహిళలు, అలాగే భారతీయ వైమానిక దళానికి చెందిన 15 మంది మహిళా పైలెట్లు కవాతుకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. భద్రతకు సంబంధించి 70 వేల మంది పోలీసులు, 70 కంపెనీలకు పైగా పారామిలటరీ బలగాలతో పాటుగా 2,500కు పైగా సీసీటీవీ కెమెరాలు, రూఫ్‌టాప్ స్నైపర్లు, యాంటీ డ్రోన్ సిస్టమ్‌లను రంగంలోకి దించారు.

**ప్రధాని రాజస్థానీ తలపాగా**

కవాతుకు మునుపు ప్రధాని నరేంద్ర మోదీ ఇండియా గేట్ దగ్గర్లో జాతీయ యుద్ధస్మారకం వద్ద అమర జవాన్లకు నివాళులర్పించారు. ఎరుపు, పసుపు రంగుల్లో రాజస్థానీ శైలిలో తయారు చేసిన తలపాగాను ధరించిన ప్రధాని కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ప్రధాని పదవిని చేపట్టిన నాటి నుంచి ప్రతి యేటా గణతంత్ర దినం, స్వాతంత్ర్య దినం వేడుకలను పురస్కరించుకొని దేశంలో వేర్వేరు ప్రాంతాల సంస్కృతీ సంప్రదాయలను ప్రతిబింబించే తలపాగాలను ధరించడాన్ని నరేంద్ర మోదీ ఒక ఆనవాయితీగా చేసుకున్నారు. ★

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం పలు ప్రాజెక్టులు, నిధులు, ఆర్థిక సాయం అందిస్తోంది. రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల కాలంలోనే రూ. 3 లక్షల కోట్ల అభివృద్ధి పనులు, ప్రాజెక్టులు కేటాయించింది. జనవరిలో ప్రధాని నరేంద్రమోదీ విశాఖలో, హోంమంత్రి అమిత్‌షా విజయవాడలో పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అమరావతికి రూ.12,500 కోట్లు, సోలార్ విద్యుత్తు ప్లాంట్లు రూ.15,000 కోట్లు, విశాఖ ఉక్కుకు రూ. 11,440 కోట్లు ఆర్థికసాయం ప్రకటించిన విషయం తెలిసిందే. పలు రైల్వేలైన్లు, ఓడరేవులు, విమానాశ్రయాల అభివృద్ధి, రహదారులు, పాఠశాలలు, ఆసుపత్రులు, పంచాయతీ భవనాల నిర్మాణంతో పాటు మంచి నీటి సదుపాయం, డ్రెయినేజీల నిర్మాణం వంటి వాటికి నిధులు కేటాయించారు. పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి.



# రాష్ట్రంలో పథకాలు...

గత అయిదేళ్లలో మోదీ ప్రభుత్వం రాష్ట్రానికి కేటాయించిన నిధుల వివరాలు ఇలా ఉన్నాయి.

**హైవేల కోసం రూ.35 వేల కోట్లు**

ఆంధ్రప్రదేశ్ జాతీయ రహదారుల అభివృద్ధికి 2019-20 నుంచి 2023-24 మధ్య రూ.3 5,186 కోట్లు కేంద్ర ప్రభుత్వం ఖర్చు చేసింది. రాష్ట్రంలో 1,774 కిలోమీటర్ల పొడవైన రాష్ట్ర రహదారులు, గ్రీన్‌ఫీల్డ్ మార్గాలను జాతీయ రహదారులుగా ప్రకటించారు. రాష్ట్రంలో రూ. 35,584 కోట్ల విలువైన 33 గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు ప్రాజెక్టులు జరుగుతున్నాయి. 852 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారుల నిర్మాణం కోసం ఇప్పటివరకు రూ. 9,589 కోట్లు ఖర్చుచేశారు. ఇందులో చిలకలూరిపేట ఆరువరసల బైపాస్, చిన్న అవుటపల్లి నుంచి విజయవాడ బైపాస్, కోరలం- కంటకపల్లె 6 వరసల రహదారి పనులు మాత్రమే పూర్తయ్యాయి.

**అమృత్ కింద 226 ప్రాజెక్టులు**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అటల్ మిషన్ ఫర్ రిజువెనేషన్ అండ్ అర్బజన్ ట్రాన్స్ ఫర్మేషన్ (అమృత్ పథకం) కింద మొత్తం 226 ప్రాజెక్టులకు కేంద్రం సాయం అందిస్తున్నది. ఈ ప్రాజెక్ట్ కోసం రూ. 3,333.76 కోట్లు మంజూరైతే ఇందులో కేంద్రం సహాయం కింద రూ. 1,056.62 కోట్లు ఇచ్చింది. ఇందులో ఇప్పటికే రూ. 1,134.84 కోట్ల విలువైన 136 ప్రాజెక్టులు పూర్తికాగా, రూ. 2,198.92 కోట్ల విలువైన 90 ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయి.


**మౌలిక వసతులకు 878 గ్రామాల ఎంపిక**

గ్రామీణ గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతుల కొరతను తీర్చడానికి, ఆరోగ్యం, విద్య, అంగన్వాడీ సౌకర్యాలు, జీవనోపాధి అవకాశాలను మెరుగుపరచడానికి ప్రధాన్ మంత్రి ధర్తి ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ కింద రాష్ట్రంలో 878 గ్రామాలు ఎంపికయ్యాయి. అత్యధికంగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో 521 గ్రామాలు ఎంపికయ్యాయి. గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తూ జీవన ప్రమాణాలను పెంచడంలో కీలక పాత్ర పోషించే ఈ పథకం కింద, 500 మందికి పైగా జనాభా ఉన్న గ్రామాలు, అందులో కనీసం 50 శాతం గిరిజన జనాభా ఉండడం వంటి ప్రమాణాల ఆధారంగా గ్రామాలను ఎంపిక చేస్తారు. రాష్ట్రంలో ఈ పథకం కింద 25 రంగాలు ఉన్నాయి. వాటిలో పీఎంఏ వై-గ్రామీణ్ ద్వారా 20 లక్షల పక్కా ఇళ్లు, 25 వేల కిలోమీటర్ల అనుసంధాన రహదారులు నిర్మించాలని, జల్ జీవన్ మిషన్ ద్వారా అర్హతగల గ్రామానికి నీటి సరఫరా, ఆర్ఎఎస్ఎస్ శ్రీ ద్వారా ప్రతి విద్యుత్తు లేని కుటుంబానికి కనెక్షన్ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. 2022-23 కేంద్ర ప్రాయోజిత పథకం నవభారత సాక్షరత కార్యక్రమం (ఉల్లాస్) కింద ఆంధ్రప్రదేశ్‌లో 30,70,956 మంది నమోదయ్యారు.

**పీఎంశ్రీ కింద 855 పాఠశాలల ఎంపిక**

ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకం మొదటిదశ కింద రాష్ట్రంలో 855 పాఠశాలలను ఎంపిక కాగా, ఇందులో 35 ప్రాథమిక, 27 ప్రాథమికోన్నత, 658 మాధ్యమిక, 135 మాధ్యమికోన్నత పాఠశాలలున్నాయి.

2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలలో ఈ పాఠశాలలకు కేంద్ర, రాష్ట్ర వాటాలు కలిపి రూ. 1,056, 44 కోట్లు మంజూరయ్యాయి. కేంద్ర వాటా రూ. 633.88 కోట్లలో రూ. 293.66 కోట్లు



ఈ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన కోసం విడుదల చేసింది. ఎంపికైన వాటిలో అత్యధికంగా కర్నూలు జిల్లాలో 52. అతి తక్కువగా విశాఖపట్నం జిల్లాలో 5 ఉన్నాయి.

**పాలిటెక్నిక్ కాలేజీల అభివృద్ధికి రూ.77 కోట్లు**

సంకల్ప్ పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 77 కోట్లు మంజూరయ్యాయి. ఎంపిక చేసిన 27 పాలిటెక్నిక్ కాలేజీల్లో మహిళల హాస్టళ్ల నిర్మాణానికి రూ. 27 కోట్లు, 35 పాలిటెక్నిక్ అప్ గ్రేడేషన్‌కు రూ. 50.10 కోట్లు మంజూరు చేశారు. అలాగే 'కమ్యూనిటీ డెవలప్‌మెంట్ త్రూ పాలిటెక్నిక్' స్కీం కింద 29 పాలిటెక్నిక్‌కు 2024 మార్చి నుంచి 2026 మార్చి వరకు ఒక్కో దానికి ఏటా రూ. 19.72 లక్షలు ఇవ్వనున్నారు.

**8 కేంద్రీయ విద్యాలయాలు మంజూరు**

రాష్ట్రంలో 8 కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేస్తున్నట్లు కేంద్రప్రభుత్వం ప్రకటించింది. అనకాపల్లి, చిత్తూరు జిల్లాలోని వలసపల్లె, ఏలూరు జిల్లాలోని నూజివీడు, కృష్ణాజిల్లాలోని నందిగామ, గుంటూరు జిల్లాలోని తాడేపల్లి, పల్నాడు జిల్లాలోని తాళ్లపల్లి, రొంపిచర్ల, సత్యసాయిజిల్లాలోని పాలసముద్రం, నంద్యాలజిల్లా డోన్‌లోనూ వీటిని ఏర్పాటుచేస్తారు. రాష్ట్రంలో ఇప్పటికే 35 కేంద్రీయ విద్యాలయాలు ఉన్నాయి.

**భూసార పరీక్షా కేంద్రాలు**

ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాల్లో కలుపుకుని స్థిర భూసార పరీక్ష కేంద్రాలు 47, మొబైల్ భూసార పరీక్ష కేంద్రాలు 13, మినీ భూసార పరీక్ష కేంద్రాలు 1328 కొనసాగుతున్నాయి. గత ఐదేళ్ల కాలంలో ఈ భూసార పరీక్ష కేంద్రాల ద్వారా 4,76,519 మట్టి నమూనాలు పరీక్షించారు. జిల్లాల వారీగా







# . పెద్ద ఎత్తున నిధులు

ఎక్కువగా అనంతపురం జిల్లాలో 51,505 మట్టి నమూనా పరీక్షలు చేశారు.

**32.87 లక్షల మందికి పోషకాహారం పంపిణీ**

మిషన్ పోషణ్ 2.0 పథకం కింద, కేంద్రప్రభుత్వం పిల్లలకు (6 నెలల నుండి 6 సంవత్సరాల వరకు) సప్లిమెంటరీ న్యూట్రిషన్ అందిస్తుంది. జాతీయ ఆహార భద్రత చట్టంలోని షెడ్యూలు-2లో పొందుపరిచిన పౌష్టికాహార నిబంధనలకు అనుగుణంగా సప్లిమెంటరీ పౌష్టికాహారాన్ని అందిస్తున్నారు. రాష్ట్రానికి పీఎంజీకేఏవై కింద రూ.కోటి 32 లక్షల 87 వేల 564 మంది లబ్ధిదారులకు అందుతున్నాయి. రాష్ట్రంలో, ఏఎన్ఎం ఏపీ హెల్త్ యాప్ ఉపయోగించి 2023-24 ఆర్థిక సంవత్సరానికి స్క్రీనింగ్ డేటా ప్రకారం, గర్భిణులు, మహిళల్లో రక్తహీనత ప్రాబల్యం 37.05 శాతం నుంచి 42 శాతంగా ఉంది.

**88 పీహెచ్‌సీల మంజూరు**

రాష్ట్రంలోని 26 జిల్లాలకు 88 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మంజూరయ్యాయి. కర్నూలు జిల్లాకు 9, పల్నాడు-7. తూర్పుగోదావరి, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరులకు 6 చొప్పున, శ్రీకాకుళం, ప్రకాశం, అనంతపురం జిల్లాలకు 5 చొప్పున, కాకినాడ, పశ్చిమగోదావరి, ఏలూరు, గుంటూరు, నంద్యాల, శ్రీసత్యసాయి, చిత్తూరు జిల్లాలకు 4 చొప్పున, విజయనగరం, ఎన్టీఆర్, వైఎస్ఆర్ జిల్లాలకు 2 చొప్పున, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కృష్ణా, అన్నమయ్య జిల్లాలకు ఒక్కొక్కటి చొప్పున పీహెచ్‌సీలుమంజూరయ్యాయి.

**స్మార్ట్ సిటీలకు రూ.2,975 కోట్లు**

స్మార్ట్ సిటీలు అమరావతి, కాకినాడ, తిరుపతి, విశాఖపట్నంలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి రూ.3,472 కోట్లు విడుదల చేయగా, అందులో రూ.2,975 కోట్లు ఖర్చుచేశారు. ఇందులో అమరావతికి రూ.779 కోట్లు, కాకినాడకు రూ.783 కోట్లు, తిరుపతికి రూ. 574 కోట్లు, విశాఖపట్నానికి రూ.838 కోట్లు ఖర్చుచేశారు. ప్రస్తుతం ఈ 4 నగరాల్లో రూ.962 కోట్ల విలు వైన 47 ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయి.

**సమగ్ర శిక్ష అభియాన్ కింద రూ.11,950 కోట్లు**

ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాలలకు సమగ్ర శిక్ష అభియాన్ కింద 26 జిల్లాల్లోని పాఠశాలలకు కలిపి గత అయిదేళ్లలో రూ.11,944.99 కోట్లు కేటాయించారు. జూనియర్ కాలేజీలకు రూ.307.76 కోట్లు, ఉన్నత విద్యా సంస్థలకు రూ.553.25 కోట్లు కేటాయించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 44,400 ప్రాజెక్టులకు గాను 32,251 పాఠశాలల్లో నిర్మాణ పనులు ప్రతిపాదించగా అందులో 16,538 పాఠశాలల్లో పనులు జరుగుతున్నాయి. 475 జూనియర్ కళాశాలలకుగాను 447 కాలేజీల్లో పనులు ప్రతిపాదించగా, ప్రస్తుతం అన్నిచోట్లా అవి జరుగుతున్నాయి. 157 ఉన్నత విద్యాసంస్థల్లో 132 చోట్ల నిర్మాణ పనులు ప్రతిపాదించగా అందులో 98 చోట్ల అవి జరుగుతున్నాయి.

**నేషనల్ హెల్త్ మిషన్ కింద 2,737 ప్రాజెక్టులు**

నేషనల్ హెల్త్ మిషన్ కింద ఇచ్చిన 2,737 ప్రాజెక్టులు పూర్తయ్యాయి. 15వ ఆర్థిక సంఘం, ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ కింద మొత్తం 493 ప్రాజెక్టులు మంజూరయ్యాయి. 2021-26 మధ్యకాలంలో ఏపీకి ఆర్థిక సంఘం కింద రూ.2,600 కోట్లు, పీఎం ఆయుష్మాన్ భారత్ కింద రూ.1,271 కోట్ల మంజూరుకు ఆమోదముద్ర వేసింది.

**248 రైల్వే వంతెనలు**


2014-24 మధ్యకాలంలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.7,309 కోట్ల విలువైన 248 ఆర్వోబీ, ఆర్‌యూబీలు (రైల్వే వంతెనలు) మంజూరు చేశారు. ప్రస్తు తం నెల్లూరుజిల్లాకు 12 ఆర్ ఓబీ, ఆర్‌యూబీలు మంజూరు చేశారు.

**లక్ష పంపులు మంజూరు**


ఫీడర్ స్థాయి సోలారైజేషన్ విధానంకింద రాష్ట్రానికి లక్ష పంపులు మంజూరు చేశారు. ఈ పథకం కింద రైతులు తమ భూముల్లో 2 మెగావాట్ల వరకు సోలార్ విద్యుత్తు ప్లాంట్లు ఏర్పాటు చేసుకొని డిస్కంలకు విద్యుత్తును విక్రయించవచ్చు. పీఎం సూర్యఘర్ యోజన కింద 10 లక్షల ఇళ్లకు విద్యుత్తు సౌకర్యం కల్పించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

**ఇంక్యుబేషన్ సెంటర్ అభివృద్ధి**

విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం ఎకరం స్థలంలో ఇంక్యు బేషన్ సెంటర్‌ను అభివృద్ధి చేస్తోంది. ఇక్కడ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్‌ను నాలుగు అంతస్తుల భవనం నిర్మిస్తుంది. రూ.18.95 కోట్లతో ఈ పనులు చేస్తున్నారు. విశాఖలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ రిఫైనరీ ఆధునికీకరణ ప్రాజెక్టు అంచనాలను రూ.30,609 కోట్లకు పెంచింది. ప్రకాశం బ్యారేజి-హైదరాబాద్‌ల మధ్య ఆర్సీ ఎస్ ఉడాన్ స్కీం కింద సీప్లేన్ నడపడానికి స్పైస్ జెట్ సంస్థకు అనుమతులు ఇచ్చారు.



**తురగా నాగభూషణం**
సీనియర్ జర్నలిస్ట్




53

# నాటి రామాయణం – నేటి గ్రామాయణం

స్వరాజ్యాన్ని రామరాజ్యంగా మారుస్తామని మన నాయకులు చెపుతున్నారు. రామరాజ్యమంటే వీరికి తెలుసా?

లంకా విజయానంతరం రామచంద్రుడు అయోధ్యానగరాన్ని రాజధానిగా జేసికొని కోసల రాజ్యాన్ని సవ్యంగా భవ్యంగా పాలించాడు. ఆ మహా రాజు ధ్యేయం ప్రజల కష్టాలను పారద్రోలడం. రామ రాజ్యంలో ప్రజలందరూ ఆనంద సందోహనిష్యంద తుందిల హృదయారవిందులే. అందరూ ధర్మాత్ములే. రామునే దేవునిగా భావిస్తుండేవారే. నేటి గ్రామాయణములోవలె విద్రోహాలు, విద్వేషాలు నామమాత్రంగా నైనా రామాయణ కాలములోలేవు.

"సర్వం ముదితమే వాసీత్
సర్వో ధర్మపర్యోభవతే
రామమేవానుపశ్యన్తో
నాభ్యహింసన్ పరస్పరమ్"
(యుద్ధకాండ–181–102 శ్లో॥)

"ఆసన్ వర్షసహస్రాణి
తథాపుత్ర సహస్రిణ।
నిరామయా విశోకాశ్య
రామేరాజ్యం ప్రజాపతి
(యుద్ధకాండ–103 శ్లో॥)

రాముడు రాజ్యం చేస్తుంటే ప్రజలు వేయేండ్లు జీవించేవారట. బహుపుత్ర సంతానం పొందేవారట. రోగమన్నదే ఎరుగరట– అందరూ నిరోగులే; అందరూ అశోకులే.

మన గ్రామాయణ కాలములోనో! ఆకలి చావులు అద్భుతంగా వస్తుంటాయి. ఇక పిల్లల సంగతంటా రేమో దరిద్ర నారాయణులకు పిల్లలెందుకు! అందుకే మన ప్రభుత్వము వారు ఇద్దరు, ముగ్గురు చాలంటూ ముద్దుముద్దుగా హితోపదేశం చేయడానికి కోట్లకొలదీ ధనం ఖర్చుపెడుతున్నారు. ఇక రోగాల సంగతి ఆలోచిస్తే అవి అపూర్వాలు, అద్భుతాలు – ఏభిషగ్వరేణ్యునికి తెలియరానిది. ఆసుపత్రులలో పడకల సంఖ్య పెంచుతూనే ఉంది ప్రభుత్వం. మందులమాట మరచిపోవాలి . ఉన్నా అంతా కల్తీ. పూర్వం "వైద్యో నారాయణో హరిః' అన్నారు. హరిహరీ ఇప్పుడామాట స్మరించనేరాదు, కాని వారంతా హరిస్తూనే ఉన్నారు. ఇక ఆనాడు ప్రజలు అశోకులైతే ఈ గ్రామాయణ కాలములో సుశోకులౌ తున్నారు. అన్నమో రామచంద్రాయని అరుస్తూనే ఉన్నారు. ధరవరలను జూచి గగ్గోలు పెడుతున్నారు.

పట్టాభిషేకం నాడు తనకు ఇంద్రాదుల వలన లభించిన కానుకలను రాముడు తన మిత్రులకు, వీరాధివీరులకు పంచివేశాడు. ఇక మన నాయకులు మాత్రం ఊరుకొన్నారా? తనకు మంచి పదవి లభించగానే తన వారికే పదవులను, పారితోషికాలను పంచి పెడుతున్నారు..


రామాయణ కాలములో ప్రజలందరు ధర్మ నిరతులే, సత్యవ్రతులే, శుభలక్షణ సంపన్నులే, ధర్మపరాయణులే.

ఆసన్ ప్రజాధర్మరతా
రామేశానతి నావృతా।
సర్వేలక్షణ సంపన్నా
స్సర్వే ధర్మపరాయణాః॥

ఇక మన గ్రామాయణ కాలములోనే ధర్మం నాలుగు పాదాలతోగాదు– నలభై పాదాలతో నడుస్తుంది. దాని మార్గాలు– చీకటి బజారులు, పాన శాలలు, జూదగృహాలు. ఇక సత్యదేవతా? అదెక్కడ? పంచదార పర్మిటు కావలసి వస్తే పంచాయతీ ప్రెసిడెంటునో, మంత్రిగారి మనిషినో అసత్య మాడాలి. సత్యవ్రతం పూనినవాడు ఈ గ్రామాయణములో ఏదీ దొరకక చచ్చిపోతాడు. అందుకే మనం సత్యార్థం మానుకొన్నాము, మార్చుకొన్నాము. "కాలానుమతోధర్మః" అన్నారు గదా పెద్దలు. ఇక నేడు శుభలక్షణాల కేమి కొరత? హిప్పీలలాగా, హీరోలలాగా రకరకాల వేషాలు, రంగు రంగుల పూతలు.

నాటి రామాయణం కంటే, నేటి గ్రామాయణం అత్యద్భుతము, వర్ణనాతీతం. దీనిని రాయడానికి అపర వాల్మీకి జనించాలి.

**– వి.ఎల్.నాయుడు**
**జాగృతి, 9.9.1974**




# తీర్థయాత్ర వివరణ నిపుణుడు రోమశ మహర్షి

ఆధ్యాత్మికం

తీర్థయాత్రలకు హైందవ సంస్కృతిలో విశిష్ట స్థానం ఉంది. అవి జ్ఞానసముపార్జనకు, మనో నైర్మ ల్యానికి సహకరిస్తాయని భారతీయుల విశ్వాసం. ఆయా ప్రాంతాల సంస్కృతీ సంప్రదాయాలను పరిశీ లించేందుకు, నాగరికతను అవగతం చేసుకునేందుకు తీర్థయాత్రలు దోహదపడతాయి. తీర్థయాత్రల విశేషాలు, ప్రాశస్త్యాన్ని, పర్యటనల ఆవశ్యకతను వివరించిన మహర్షి రోమశుడు. బాల్యం నుంచే తపో నిష్ఠతో ఆత్మజ్ఞానం పొందిన ఆయన అన్ని తీర్థాలలో స్నానం ఆచరించారు. ఆయా ప్రాంతాల లోని వివిధ దేవతలు సందర్శించారు. ఊర్ధ్వ లోకాలకు వెళ్లగల శక్తిని ఆర్జించారు. కామ్యకవనంలో పాండవులు , ద్రౌపది, వారి వెంట గల బ్రాహ్మణులకు ఇంద్రుని సూచన మేరకు, తీర్థయాత్రా ఆవశ్యకత, విశిష్టతలను, ధర్మసూక్ష్మాలు వివరించారు. నైమిశం, అశ్వతీర్థం, గోమతి, ప్రయాగ, గంగా, యమున సంగమం తదితర తీర్థాల విశిష్టతను, తత్ఫలితాలను వివరించి వారితో స్వయంగా తీర్థయాత్రలు చేయించారు. ఆ సందర్భంగా హిరణ్య, గో దానాదులు చేయించారు. కేవలం తీర్థయాత్ర సందర్శనే కాదు...

# నామరూప భేదమే... వస్తుతత్త్వం సమం

53




గీతలో శ్రీకృష్ణుడు అర్జునునితో "పార్థా! అవినాశనుడైన పరబ్రహ్మకూ, అమృత, నిత్య, ధర్మ, అఖండ ఏక రసానందాలను ఆశ్రయ మైనవాడను నేనే. ఈ లోకాలన్నింటికీ కర్మఫల దాయకుడనూ, పోషకుడనూ, ప్రభువునూ, కర్మ సాక్షినీ, ప్రాణాధార శరణ్యుడనూ, మిత్రుడనూ, సృష్టి – స్థితి–లయకారకుడనూ, కాలాంతరమున ప్రాణులకు భోగదాయకమైన విధినీ, నాశ రహితమైన కారణబీజమునూ నేనే. ఆదిత్య రూపమైన తాపాన్ని నేనే. వర్షాన్ని నేనే ఆకర్షించి విడుస్తున్నాను. అమృత, మృత్యు స్వరూపాలు, సద సత్స్వరూపాలు సర్వస్వం నేనే. నాకంటే ఉత్కృష్టమైనదేదీ ఈ జగత్తులో లేదు. సూత్రం పూసలను ధరించునట్లు ఈ జగత్తునంతా నేనే ధరిస్తున్నాను. సర్వలోక ప్రభువుగా, ఆద్యంతాలు లేని వానినిగా నన్ను తెలుసుకోగలిగినవాడే మోహరహితుడై సర్వపాపదూరుడై ముక్తి పొందుతాడు" అని పలికాడు.

పై విషయాలను పరిశీలించి చూడ బ్రహ్మ, విష్ణు,మహేశ్వర–రామ,కృష్ణ శక్త్యాదులు అందరూ తత్త్వతః ఒక్కటే. ఈ వివేచనపై దృష్టిని ఉంచే ఉపాసకులందరూ ఏకైక సత్యవిజ్ఞానా నంద ఘనుడైన పరమాత్మను అంగీకరించి సత్య సిద్ధాంతంతో పురోగమిస్తున్నారు. నామ రూపభేదమే కాని వస్తుతత్త్వభేదం లేదు. లక్ష్యార్థం అందరిదీ ఒక్కటే. ఈ రీతిగా ఈశ్వరుని సర్వవ్యాపిగా, సర్వజ్ఞునిగా, సర్వశక్తిమంతునిగా, నిర్వికారునిగా, విజ్ఞానానందఘనునిగా గుర్తించి శాస్త్ర గ్రంథ, ఆచార్య వచనానుసారం ఏ నామరూపంతోనైనా ఆ మహాప్రభువును ఉపాసించవచ్చు. అది ఏకైక పరమాత్మ ఉపాసనమే అవుతుంది.

సర్వవ్యాపీ, విజ్ఞానానందఘనుడూ అయిన శివపరమాత్ముని ఉపర్యుక్త తత్త్వాన్ని గ్రహించలేక శివోపాసకులు కొందరు విష్ణునిందకు సాహసిస్తారు. వైష్ణవులు కొందరు శివనింద చేస్తుంటారు. నిందాప్రశంసలు చేయక మరి కొందరు ఉదాసీనులుగానే ఉండిపోతారు. వాస్తవానికి ఈ వ్యవహారం పూర్ణంగా అజ్ఞానమనే చెప్పాలి. అలా కాని నాడు ఏ కనిష్ఠమైన అనన్యోపాసనలో దోషం కలగవచ్చును అని అంటే అది సత్యం కాజాలదు.

ఎలా అంటే...పతివ్రత తన భర్తనే దైవంగా చూస్తూ అతని కనుసన్నలలో మెలుగుతూ సేవిస్తూ, అత్తమామలను, అతిథి అభ్యాగతులనూ, బంధు బాంధవులనూ ఆదరించిన నాడు ఏకనిష్ఠమైన తన పతివ్రతా ధర్మం నుండి పతనం కాబోదు సరికదా ఇతోధిక యశశ్శోభలనే పొందుతుంది.

వాస్తవం ఆలోచించి చూచినప్పుడు, పాపద్వేషభోగ బుద్ధులలో, శత్రుత్వ వ్యభిచారాలలోనే దోషముంది. పరమాత్మ నామ రూపములలో దేనినో ఒకదానిని స్వీకరించి దాని పట్ల అనన్యభక్తి కలిగి ఉన్నప్పటికీ ఇతరేతర దేవీ దేవతలను కూడా ఇష్టదేవాజ్ఞానుసారం యథా యోగ్యంగా సేవించాలి. ఉపర్యుక్త విషయానుసారం నిత్యవిజ్ఞానానందఘనుడైన పరబ్రహ్మ ఒక్కడే. ఆతనికి భిన్నమైన వస్తువేదీ లేదు.

ఏ ఒక్క నామరూపం పట్ల ద్వేష తిరస్కార, ఉపేక్ష, నిందాభావాలు కలిగి ఉండరాదు. అలా ఉండడమంటే ఆ పరమాత్మను ద్వేషించడమే అవుతుంది. త్రిమూర్తులలో ఎవరూ ఎక్కడా కూడా పరస్పర నిందలు చేసుకోలేదు. నిందాదులను నిషేధిస్తూ, ఆ ముగ్గురూ ఒక్కటేనన్న విషయాన్ని శాస్త్రాలన్నీ ప్రశంసించాయి. ఈ విషయమై 'హరిహర హిరణ్యగర్భులు ముగ్గురూ సర్వోత్పన్నులు, ధారణ, వృద్ధి ఆచరణలలో పరస్పర అనుకూలురై ఉంటారు. ఒకచో బ్రహ్మ, మరొకచో విష్ణువూ వేరొకచో ఈశ్వరుడూ ప్రశంసలు అందుకుంటుం టారు. వారి ఐశ్వర్యోత్కర్షాలు పరస్పరాధిక్యతను వ్యక్తీకరిస్తూ వారి అనేకత్వాన్ని తెలియజేస్తున్నాయి. ఫలానాదేవుడు గొప్పవాడు, ఫలానా దేవుడు చిన్నవాడూ అని భావించే సంశయాత్ములు భవిష్యజ్జన్మలలో రాక్షసిగానో, పిశాచిగానో జన్మించడం తప్పదు' అని విష్ణుపురాణం చెప్పింది.

– శ్రీపురాణపండ రాధాకృష్ణమూర్తి,
జాగృతి, 23.6–30.6.1961

---

మహర్షుల చరిత్రను వివరించారు. ధర్మరహస్యాలను బోధించారు. అనేకమందిని సమస్యల నుంచి విముక్తి గలిగించారు. ఉదాహరణకు, గంధర్వ కన్యల శాపం కారణంగా పిశాచ రూపం ధరించిన వేదనిధి అనే మునిని తీర్థయాత్ర ద్వారా శాప విముక్తిడిని చేసినట్లు కథనం. తనను వలచి, పెళ్లాడమని ఒత్తిడి తెచ్చిన గంధర్వ కన్యలపై ఆగ్రహించిన వేదనిధి వారిని పిశాచాలు కమ్మని శపించారు. వారూ అలాగే ప్రతి శాపం ఇచ్చారు. పుత్రుని జాడ కోసం వెదుకుతూ వచ్చిన వేదనిధి తల్లిదండ్రులు శాపవిమోచన మార్గం గురించి రోమశుని అర్థించారు. వారికి మాఘ స్నానం విశిష్టతను వివరించి, వారితో ప్రయాగలో మాఘ స్నానాలు చేయించి శాపవిముక్తులను చేశాడు. కుంభమేళకు ప్రసిద్ధమైన ప్రయాగ గురించి వివరించాడు. అక్కడి పాయను అసితతోయవేణి అంటారని, నరనారాయణులు ఆ తీర్థంలో స్నాన మాచరించారని, బ్రహ్మదేవుడు ఆ ప్రాంతంలో యజ్ఞం నిర్వహించాడని వివరించాడు. సంపూర్ణ విశ్వాసం, సంయమనంతో చేసే పర్యటనలు, తీర్థయాత్రలు ఆధ్యాత్మిక, జ్ఞానసముపార్జనకు, మేధో వికాసానికి దోహదపడతాయన్న వాయుపురాణ వాక్కును రోమశుడు నిజం చేశారు. ఉన్నచోట నుంచి కదలకుండా జ్ఞానార్జనతో ప్రయోజనంలేదని లేదని, తీర్థయాత్రలు, పర్యటనలతో ఆత్మజ్ఞానంతో పాటు ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుందని రోమశ మహర్షి బోధన సారాంశంగా చెబుతారు. భక్తిశ్రద్ధలతో తీర్థయాత్రలు చేసేవారికి ఆయన సాక్షాత్కారం లభిస్తుందని విశ్వాసం. ఆయన స్ఫూర్తితోనే ఆది శంకరా చార్యులు, రామానుజాచార్యులు ఆసేతు శీతాచల పర్యంతం పర్యటించి, తీర్థక్షేత్రాలలో ఆధ్యాత్మిక శక్తిని నిక్షిప్తం చేశారని ఆధ్యాత్మికవేత్తలు భావిస్తారు.

– రామచంద్ర రామానుజ

---

## వివేకానంద సూక్తిశతి

**You are infinite, deathless, birth less. Because you are infinite spirit, it does not befit you to be a slave... Arise! Awake!!**



అమరుడైన నీవె ఆ యనంతుడవీవె
బానిసవలె బతుక భావ్యమగునె?
లెమ్ము నిద్ర నుండి లేచి సాధించుము
వినుడి స్వామి సద్వివేక వాణి!!



బండిరాజుల శంకర్





**చాలా రోజులుగా సమీర నుంచి మెయిల్స్ రావటం లేదు. బహుశా ఆమె బిజీగా ఉందేమోననీ నేను కూడా ఆమెకు మెయిల్స్ పంపటం లేదు. శ్రీరామ్ చదువు పూర్తైఏదో కంపెనీలో చేరి సియాటెల్లో పనిచేస్తున్నడట. మధు అయితే తాత్కాలికంగా ఎక్కడో చేరాడట... ఇండియా వచ్చేద్దామనుకుంటున్నాడట. మొదటిసారి నేను సివిల్స్ రాద్దామనుకుంటున్న సమయంలో నాన్నగారికి ఒంట్లో బాగా లేకపోవడంతో రాయలేకపోయాను. ఈ సంవత్సరం ఎంటెక్‌లో ప్రాజెక్ట్ వల్ల రాయలేకపోయాను. రాను రాను నాకు సివిల్స్ మీద ఆసక్తి తగ్గిపోతోంది. సివిల్స్ రాయాలంటే మెదడు ప్రశాంతంగా ఉండాలి. సమస్యలేమీ ఉండకూడదు.**

ఒకరోజు భోజనం చేస్తున్న సమయంలో సమీరకు పెళ్లి కుదిరిందనీ ఆ అబ్బాయి అమెరికాలోనే పని చేస్తున్నాడనీ, మా మావ మాకెవ్వరికీ తెలియకుండా పెళ్లిఇ చేద్దామనీ అనుకుంటున్నాడనీ ఒకరోజు భోజనం చేస్తున్న సమయంలో మా అమ్మ చెప్పింది.

బహుశా అందుకే సమీర మెయిల్స్ చెయ్యటం లేదేమో అనిపించింది. అయినా సమీరను ఆమె తండ్రి అమెరికాకు ఎమ్ఎస్ చదువు కోసం పంపిస్తున్నప్పుడే ఆమెకు అక్కడే ఎవరితోనో పెళ్లి చేస్తాడనిపించింది. ఇక్కడుంటే సమీర నాతో తిరిగి తన మాట వినకుండా నన్ను చేసుకుంటుందేమోననీ మా మావ భయం. మా నాన్న గారు చనిపోయినపుడు పరామర్శకు వచ్చాడు మా మావ. ఆ తరువాత వాళెవ్వరూ రాలేదు. కొడుకు హైదరాబాద్‌లో ఉంటున్నాడు కాబట్టి అక్కడికి కుటుంబంతో వెళ్లిపోదామన్న ఆలోచనలో ఉన్నాడు మా మావ.

అందుకే పొలాన్ని రైతుకు అమర్చేసాడు. మావకి కూడా ఈ మధ్యన ఒంట్లో బాగుండటం లేదనీ, ప్రతీవారం డాక్టరు దగ్గరకు వెళ్లే అవసరం ఉందనీ, అందుకు హైదరాబాద్ వెళ్లిపోతున్నారనీ మా రైతు చెప్పాడు.



గన్నవరపు నరసింహామూర్తి

నేను అమెరికా వస్తున్నట్లు శ్రీరామ్‌కు పంపాను. ఫోన్ కూడా చేసాను. సమీరకు పెళ్లి కుదిరింది కాబట్టి ఆమెకు నేను అమెరికా వస్తున్నట్లు చెప్పలేదు.. ఆ విషయం మామావకి తెలిస్తే గొడవలు జరిగే ప్రమాదం ఉంది... అందుకే చెప్పలేదు.

వారం రోజుల తరువాత నాకు వీసా వచ్చింది. మా యూనివర్సిటీ లెటర్ ఉండటంతో నాకు వీసా త్వరగా మంజూరైంది. అమ్మని జాగ్రత్తగా చూసుకొమ్మని మా రైతు సన్యాసికి చెప్పాను. నాది 20 రోజుల షెడ్యూల్. సెమినార్ వారం రోజులే.. కాకపోతే అది అమెరికాలో ప్రసిద్ధి చెందిన విశ్వ విద్యాలయం కాబట్టి ఆ సెమినార్‌కు అంతటి ప్రాధాన్యత. స్టాన్ఫోర్డు, మెస్సా చూసెట్స్ విశ్వవిద్యా లయాల్ని చూడాలన్న కోర్కె ఎప్పట్నుంచో ఉండటం వల్ల అమెరికా వెళ్లడానికి సిద్ధపడ్డాను.

రెండు రోజుల తరువాత నేను విశాఖపట్నం నుంచి ముంబయి ఫ్లైట్‌లో చేరుకొని అక్కడ నుంచి అమెరికా బయలుదేరాను. బొంబాయి నుంచి 20 గంటల ప్రయాణం. మధ్యలో సౌదీ అరేబియాలో నాలుగు గంటల హాల్టు.

ఎలాగైతేనేం రెండు రోజుల తరువాత అమెరికాలో కాలు మోపాను.

అమెరికా... ప్రపంచంలో చాలా గొప్ప అభివృద్ధి చెందిన దేశం... ఇది విస్తీర్ణంలో ప్రపంచ దేశాల్లో రష్యా, కెనడాల తరువాత మూడవ స్థానం. ఆ తరువాత చైనాది. వైశాల్యంలో మనదేశం కన్నా సుమారు మూడు రెట్లు పెద్దది.. జనాభాలో మనకంటె మూడు రెట్లు చిన్నది.

ఇది నార్త్ అమెరికా ఖండంలో ఉంది. దీంతో పాటు అదే ఖండంలో కెనడా కూడా ఉంది. ఇందులో 50 రాష్ట్రాలున్నాయి. మనలా కాకుండా రాష్ట్రాలు స్వయం ప్రతిపత్తి కలిగినవి. దీనికి ఉత్తరంలో కెనడా, దక్షిణంలో బ్రెజిల్ ఉన్నాయి. జనాభా 34 కోట్లు. దీని ముఖ్యపట్నం వాషింగ్టన్ డీసీ అయినా జనాభాపరంగా పెద్దది, ఆర్థిక రాజధాని మాత్రం న్యూయార్క్ సిటీ. ఇక్కడ 61 శాతం తెల్లవారు, 12 శాతం బ్లాక్స్ అంటే నల్లజాతీయులు, 6 శాతం ఆసియా వారు ఉన్నారు. నేటివ్ అమెరికన్స్ మాత్రం ఒక్క శాతమే ఉన్నారు. 1776లో ఈ దేశానికి బ్రిటిష్ దేశం నుంచి స్వాతంత్ర్యం వచ్చింది. 1900 సంవత్సరం నుంచి ప్రపంచంలో ఆర్థికంగా పెద్ద దేశంగా తయారైంది.

ప్రపంచ జీడీపీలో పావు శాతం దీనిదే... ప్రస్తుతం 45 లక్షల భారతీయులు అమెరికాలో ఉంటున్నారనీ ఒక అంచనా.

1990 ప్రాంతం నుంచీ అమెరికాకి వలసలు బాగా పెరిగాయి. సాఫ్ట్‌వేర్ రంగం అమెరికాలో బాగా అభివృద్ధి చెందటంతో ఇక్కడికి మనదేశం నుంచి చాలా మంది ఉద్యోగాల నిమిత్తం వస్తున్నారు.



అటువంటి అమెరికాలో నేను మొదటి సారిగా అడుగు పెట్టాను. నేను వెళ్లబోయే మెస్స చూసెట్స్ విశ్వవిద్యాలయం కేంబ్రిడ్జిలో ఉంది కాబట్టి నేను మరో విమానంలో కేంబ్రిడ్జి చేరాను. అక్కడ యూనివర్సిటీ గెస్ట్ హౌస్‌లో నాకు ఎకామడేషన్ ఇచ్చారు.


యూనివర్సిటీ కాంపస్ 161 ఎకరాల్లో విశాలంగా వ్యాపించి ఉంది.. దీని 1861లో స్థాపించారు. అమెరికాలోని మూడు ప్రైవేట్ లేండ్ గ్రాంట్ యూనివర్సిటీల్లో ఒకటి. ఈ విశ్వవిద్యాలయం ఛార్లెస్ నది ఒడ్డున ఉంది. ఈ విశ్వవిద్యాలయం నుంచి ఇప్పటి దాకా 98 మంది నోబెల్ బహుమతి గ్రహీతలున్నారు.

కాంపస్ అంతా పచ్చటి చెట్లతో అందంగా ఉంది. చాలా మంది అక్కడ సైకిల్ వాడటం నాకు ఆశ్చర్యం కలిగించింది. గెస్ట్‌హౌస్‌లో దిగి ఆ రోజంతా కేంబ్రిడ్జి నగరంలో తిరిగాను. ఆ మహానగరాన్ని

చూస్తుంటే మన నగరాలకు దానికి తేడా బాగా తెలిసింది. విశాలమైన వీధులు, పరిశుభ్రమైన పరిసరాలతో, ఆకాశ హర్మ్యాలతో నగరం చాలా బాగుంది.

ఆ మర్నాడు మా సెమినార్ ప్రారంభమైంది. పెద్ద సెమినార్ హాల్. రెండు వేలమంది ప్రతినిధులు అన్ని దేశాల నుంచీ వచ్చారు. ఆ రోజంతా పరిచయాలు, ప్రసంగాలతో గడిచి పోయింది.

మధ్యాహ్నం ఇద్దరు ప్రొఫెసర్లు భూకంపాలు, ప్రాజెక్టులపై వాటి ప్రభావం అన్న పేపరుని ప్రవేశపెట్టి, వాటి గురించి వివరంగా చెప్పారు. ఆ పేపరు ప్రెజెంటేషన్ చాలా అద్భుతంగా ఉంది.



ఆ రాత్రి నాతో మధు మాట్లాడేదు. తను న్యూయార్కులో పనిచేస్తున్నట్లు, పెళ్లి కుదిరినట్లు చెప్పాడు. ఆ అమ్మాయి కూడా ఇక్కడే ఎమ్మెఎస్ చదివి ఓ ప్రముఖ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నట్లు చెప్పాడు. ఆ మర్నాడు నన్ను చూడటానికి శ్రీరామ్ సియాటెల్ నుంచి వచ్చాడు. అతనికి క్రితం సంవత్స రమే హైదరాబాద్‌లో పెళ్లైంది. ఆ సమయంలో నాన్నగారు చనిపోవడంతో నేను వాడి పెళ్లికి వెళ్లలేకపోయాను. ఆ అమ్మాయిది హైదరాబాద్. ఇద్దరూ అమెరికాలో ఒకే యూనివర్సిటీలో ఎమ్మెస్ చదువుతున్నప్పుడు పరిచయం అయి పెళ్లికి దారి తీసిందనీ చెప్పాడు..

ఆ రాత్రి మేము డిన్నర్‌కు వెళ్లినపుడు నాకు వాడు కొన్ని ఆశ్చర్యకరమైన విషయాలు చెప్పాడు.

'వంశీ! ఇక్కడ నేను ఎంఎస్‌లో చేరిన తరువాత నాకు సులోచన అనే అమ్మాయి పరిచయం అయింది. ఆమె కూడా నాతో పాటే ఎమ్మెస్ చేసేది. ఆ పరిచయం ప్రేమగా మారి పెళ్లికి దారితీసింది. వాళ్ల నాన్నగారు హైదరాబాదులో సెక్రెటేరియట్లో పనిచేస్తుంటాడు. అతనికి సులోచన ఒక్కర్తే కూతురు. మా అమ్మానాన్నలను చూడవలసిన బాధ్యత నా మీద ఉందనీ పెళ్లికి ముందే ఆమెకు, ఆమె తల్లితండ్రులకు చెబితే ఒప్పుకున్నారు. అలా మా పెళ్లి హైదరా బాదులో జరిగింది. పెళ్లికి 20 తులాల బంగారం పెట్టమనీ వాళ్లు చెప్పడంతో అప్పు చేసి పెట్టాము. పెళ్లైన ఆరునెలల దాకా ఆమె బాగానే ఉంది. ఆ తరువాత ఆమె ప్రవర్తనలో మార్పు వచ్చింది. సంక్రాంతి పండుగకు నేను మా ఊరు వెళదామనీ చెబితే ఆమె రాలేదు. హైదరాబాదులో దిగి పుట్టింటికి వెళ్లిపోయింది.

తరువాత నుంచి మా ఇంటికి నన్ను వెళ్లకుండా ఆంక్షలు పెట్టింది. మా పొలం అమ్మి అమెరికాలో ఇల్లు కొనమనీ చెప్పింది. నేను దానికి ఒప్పుకోక పోవడంతో ప్రతీ నెలా మా నాన్నకు డబ్బు పంపించడానికి వీల్లేదనీ గొడవ పెట్టింది. అలా మా ఇద్దరికీ గొడవలు పెద్దవై అమెరికాలో పోలీస్ స్టేషన్ల దాకా వెళ్లింది. పోలీసులు ఇద్దరికీ కౌన్సెలింగ్ ఇచ్చి పంపించేశారు. ఆమె హైదరాబాద్ వెళ్లి నా మీద గృహ హింస కేసు పెట్టింది. పోలీసులు మా అమ్మా నాన్నల్ని స్టేషన్‌కు తీసికెళ్లి నానా హింసలు పెట్టారు. ఇప్పుడు నేను ఇండియా వెళితే అరెస్ట్ చేస్తారట. అందుకోసం నేను లాయర్తో మాట్లాడితే అతను నా తరపున పిటిషన్ వేసి ముందస్తు బెయిల్ తీసుకున్నాడు. అమ్మ నాన్నలు అమెరికాలో మా దగ్గర లేకపోవడంతో మా అమ్మ నాన్నల్ని వదిలేసారు.

(సశేషం)



# ఏమిటీ 'ఎనిమీ

**దేశ విభజన ఒకనాటి ఘటన కావచ్చు. అది జరిగి 77 ఏళ్లు పూర్తయింది కూడా. కానీ దాని ప్రభావం వర్తమాన కాలం మీద కూడా ఉంది. చరిత్రలో జరిగిన పెద్ద ఘటన ప్రభావం అక్కడితో ఆగిపోదు. విభజన ఆటుపోట్లు నేటి తరం కూడా చవి చూడవలసి వస్తున్నది. లియాఖత్ అలీ-నెహ్రూ ఒప్పందం ప్రకారం ఇక్కడి ముస్లింలను అక్కడికి, అక్కడి హిందువులను ఇక్కడికి తరలించాలి. అక్కడి హిందువులు చాలావరకు ఇక్కడికి వచ్చారు. ఇక్కడి ముస్లింలు వెళ్లలేదు. కానీ పాక్ వెళ్లిపోయిన వారి ఆస్తులు ఒక పెద్ద సమస్యగా మిగిలాయి. 'శత్రువు ఆస్తి' వివాదం ఇదే. బాలివుడ్ నటుడు సైఫ్ అలీఖాన్ ఆస్తుల స్వాధీనంపై మధ్యప్రదేశ్ హైకోర్టు స్టే ఎత్తివేసిన తరువాత, దాదాపు రూ. 15,000 కోట్ల విలువైన ఆస్తులు సైఫ్ చేతి నుంచి జారిపోతాయని వార్తలు వచ్చిన నేపథ్యంలో ఆ అంశం మళ్లీ తెర మీదకు వచ్చింది. ఇదే ఎనిమీ ప్రాపర్టీ వివాదం. ఎనిమీ ప్రాపర్టీ చట్టం 1968 అందుకు సంబంధించినదే. ఈ చట్టమే దేశ విభజనానంతర పరిణామం ఎనిమీ ప్రాపర్టీ గురించి చాలా విషయాలు చెబుతుంది.**

ఇటీవలే కత్తిపోట్లకు కూడా గురై వార్తలకు ఎక్కిన సైఫ్ ఆస్తులు విశేషంగా ఉన్నాయని, అవన్నీ ఇప్పుడు ప్రభుత్వపరం కానున్నాయని వార్తలు వెలువడడంతో దేశంలో దీని మీద చర్చకు అవకాశం ఏర్పడింది. నిజానికి ఇవన్నీ భోపాల్ నవాబునకు సంబంధించినవి. భారత్ సమాఖ్యలో చేరడానికి నిరాకరించిన, మొండికేసిన సంస్థానాధీశులలో భోపాల్ నవాబు కూడా ఉన్నాడు. వాయిదాలు వేసి, మడత పేచీలు పెట్టినా చివరికి తన సంస్థానాన్ని అప్పగించక తప్పలేదు.

భోపాల్ నవాబు ఆస్తులను ఎనిమీ ప్రాపర్టీ విభాగం కింద స్వాధీనం చేసుకోవడం గురించి ఇచ్చిన ఆదేశాల గురించి సంప్రతించడానికి ఆ ఆస్తులకు రక్షకునిగా (కస్టోడియన్) ఉన్న నటుడు సైఫ్ అలీఖాన్ అధికారులను కలుసుకోవాలని మధ్యప్రదేశ్ హైకోర్టు ఆదేశించింది. నవాబు పటౌడీ ఆస్తులు 'శత్రువు ఆస్తులు'గా భారత ప్రభుత్వం పరిగణిస్తున్నదని ఆ కుటుంబానికి ఆదేశాలు అందాయి. ఈ ఆదేశాల మీదనే సైఫ్, ఆయన తల్లి, సినీ నటి షర్మిలా టాగోర్ (పటౌడీ) హైకోర్టుకు వెళ్లారు. ప్రభుత్వం జారీ ఆదేశానికి మూలం ఏమిటి? భోపాల్ నవాబు మహమ్మద్ హమీదుల్లా ఖాన్ పెద్ద కుమార్తె అబిదా సుల్తాన్ బేగం విభజన తరువాత పాకిస్తాన్ వెళ్లిపోయారు. కాబట్టి ఆమెవిగా చెప్పే ఆస్తులన్నీ శత్రువు ఆస్తులుగానే పరిగణిస్తారని తన ఆదేశాలలో ప్రభుత్వం పేర్కొన్నది.

కత్తిపోట్లకు గురై ఆసుపత్రిలో చేరిన తరుణంలోనే సైఫ్ అలీకి చెందిన వేలాది కోట్ల రూపాయల ఆస్తి ప్రభుత్వ పరం కానున్నదన్న వార్తలు కూడా వచ్చాయి. దీనితో ఈ తాజా పరిణామం మీద, గతానికి సంబంధించిన అంశం మీద కూడా మరింత చర్చ జరిగింది. శత్రువు ఆస్తి అన్న అంశం సైఫ్‌తోనే ఆరంభమైనది కాదు. దీనికీ, స్వరాజ్యానికీ, సంస్థానాల విలీనానికీ అవినాభావ సంబంధం ఉంది. కచ్చితంగా చెప్పాలంటే దేశ విభజనే దీనికి మూలం. ఇందుకు సంబంధించిన ఎనిమీ ప్రాపర్టీ చట్టం తరువాత ఎన్నో మార్పులకు కూడా లోనైంది. స్వతంత్రం వచ్చిన తరువాత భోపాల్ నవాబు ఆస్తులకు వారసులుగా ఉన్న సైఫ్ కుటుంబం ఇప్పుడు దాదాపు రూ. 15,000 కోట్ల రూపాయల ఆస్తులను వదులుకోవలసి ఉంటుందని అంచనా. వీటిని లెక్కించడానికే దాదాపు ఎనిమిదేళ్లు పట్టింది. 1968 నాటి శత్రువు





సైఫ్ ఆస్తుల

ఆస్తుల చట్టం మేరకు ఈ ఆస్తులను కేంద్రం స్వాధీనం చేసుకోకుండా మధ్యప్రదేశ్ హైకోర్టు విధించిన స్టే ఎత్తివేయడంతో ఈ పరిణామం చోటు చేసుకుంది. 1947 తరువాత దేశం విడిచిపోయిన వారి ఆస్తులను, 1962, 1965 యుద్ధాల తరువాత పాకిస్తాన్, చైనాలకు వెళ్లిపోయిన వారి ఆస్తులను స్వాధీనం చేసుకునే హక్కు కేంద్రానికి దఖలు పరించింది. ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని భావిస్తున్న వాటిలో సైఫ్ బాల్యమంతా గడిచిన ఫ్లాగ్ స్టాఫ్ హౌస్ కూడా ఉంది. ఇంకా నూర్ ఆజ్ సభా భవనం, దారుస్ సలామ్, అహమ్మదాబాద్ భవనం, కోహెఫిజా, మరికొన్ని ఆస్తులు ఉన్నాయి. ప్రధానిగా నరేంద్ర మోదీ పదవి స్వీకరించిన కొద్దికాలంలోనే శత్రు ఆస్తుల సంగతి తీవ్రమైన అంశంగా పరిగణించారు. యథాప్రకారం బుజ్జగింపు కోసం కాంగ్రెస్ వ్యతిరేకించింది. దేశంలో ఎన్నో ఉన్నప్పటికి 2018లో దాదాపు 9,400 శత్రు ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని మోదీ ప్రభుత్వం నిర్ణయించింది.

పాకిస్తాన్, చైనాలతో శత్రుత్వం తారస్థాయిలో ఉన్న సమయంలో ఈ చట్టం వచ్చింది కాబట్టి, దీనికి ఎనిమీ ప్రోపర్టీ చట్టం అని పేరు వచ్చి ఉంటుంది.

# ప్రాపర్టీ?'

ఒకప్పుడు భారతదేశవాసులైనప్పటికీ యుద్ధాల తరువాత, ఇతర కారణాలతో పాకిస్తాన్, చైనాల పౌరసత్వం తీసుకున్నవారికి ఇక్కడ మిగిలిన ఆస్తులనే ఎనిమీ ప్రాపర్టీ అని చెబుతారు. 1965 నాటి పాకిస్తాన్ యుద్ధం తరువాత ఈ చట్టం అమలులోకి వచ్చింది. చైనా యుద్ధం (అక్టోబర్ 20,1962) తరువాత ఆ దేశం వెళ్లి పౌరసత్వం తీసుకున్న వారి ఇక్కడి ఆస్తులకు కూడా దీనిని వర్తింపచేశారు. దీని ప్రకారం ఇలాంటి ఆస్తులన్నీ కస్టోడియన్ ఫర్ ఎనిమీ ప్రాపర్టీ ఇన్ ఇండియా అనే కేంద్ర ప్రభుత్వ స్వాధీనంలో ఉంటాయి. 2017లో ఈ చట్టానికి కొన్ని సవరణలు చేశారు. ఈ సవరణ ప్రకారం



విభజన తరువాత యుద్ధాల తరువాత దేశం విడిచి చైనా పాకిస్తాన్‌లలో స్థిరపడిన వారి ఆస్తులు వారి వారసులకు చెందవు. శత్రువుకు చెందిన వారి సంస్థ, ఆస్తి స్వాధీనంలో ఉంచుకోవడం, నిర్వహించడం కుదరదు. ఆ హక్కు ఇక్కడ వారసులుగా ఉన్నవారమని చెప్పుకునే వారికి ఉండదు. ఇలాంటి శత్రువు ఆస్తులు దేశంలో వేలల్లో ఉన్నాయి. వీటి విలువ దాదాపు రూ. లక్ష కోట్లు. వీటి విక్రయం లేదా వేలం మొదలయింది. దేశం వీడి వెళ్లిన వారి ఆస్తులను వారి వారసులు లేదా సంబంధీకుల నుంచి స్వాధీనం చేసుకునే హక్కు భారత్‌కు ఎక్కడిదని వాదించే అవకాశం లేకుండా చేసినది పాకిస్తాన్. ఎందుకంటే 1971 యుద్ధం తరువాత అక్కడ మిగిలిన హిందువుల ఆస్తులను వారి వారసుల నుంచి తప్పించి దాయాది దేశం పాకిస్తాన్ అమ్మేసింది.

భారత ప్రభుత్వం ప్రకటించిన మేరకు దేశంలో శత్రువు స్థిరాస్తులు దాదాపు 12,426. వీటి విలువ లక్ష కోట్ల రూపాయలు. వారికే చెందిన 302 సంస్థలు కూడా ప్రస్తుతం కస్టోడియన్ ఆఫ్ ఎనిమీ ప్రాపర్టీ స్వాధీనంలో ఉన్నాయి. అత్యధికంగా శత్రువు ఆస్తులు ఉన్న రాష్ట్రం ఉత్తరప్రదేశ్ (5,936). తరువాతి స్థానాలలో పశ్చిమ బెంగాల్ (4301), ఢిల్లీ (659), గోవా (295) ఉన్నాయి. ఇంకా త్రిపుర (500), మహారాష్ట్ర (430), తెలంగాణ (234), మధ్యప్రదేశ్ (148), గుజరాత్ (127), బిహార్ (94), ఇతరత్రా (531) ఆస్తులు కూడా దేశంలో ఉన్నాయి. 23 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలలో ఆ ఆస్తులు విస్తరించి ఉన్నాయి. 2018లో వెల్లడైన వివరాల ప్రకారం భారత్ విడిచి పాకిస్తాన్ వెళ్లి స్థిరపడిన వారి మొత్తం ఆస్తుల సంఖ్య 9,280. చైనా వెళ్లిన వారి ఆస్తులు 126.

సంపాదించిన ఆస్తులన్నీ ఒక దేశంలో మదుపు చేసుకోవడం, చివరికి దేశం విడిచి వెళ్లిపోవడం వంటి పరిణామాల వెనుక ఆసక్తికరమైన కథలు చాలా ఉన్నాయి. ఈ పరిణామాలలో నష్టపోయిన వారు తీవ్రమైన క్షోభనే అనుభవించి ఉండాలి కూడా. తరువాతి పరిణామాలకు, కస్టోడియన్ వ్యవస్థకు, చట్టాలకు భారత్ పాక్ యుద్ధం 1965, గోవా విమోచనోద్యమం 1962 కూడా నేపథ్యంగా ఉన్నాయి.

సాధారణ శకం 1800 నాటికే బ్రిటిష్ జాతి కన్ను కరాచీ మీద పడింది. ఈ రేవు పట్టణాన్ని అతి పెద్ద వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దాలని ఊహించారు. ఫలితంగా చాలా మంది గోవా వారు ఇక్కడికి చేరుకున్నారు. అక్కడ పోర్చుగీసు వారి నియంతృత్వం కూడా ఇందుకు ప్రోత్సాహం కల్పించి ఉండవచ్చు. కరాచీ చేరిన గోవా వారు ఆఫ్రికా, ఆసియాలలోని పలు దేశాలకు వాణిజ్యం కోసం యాత్రలు చేసేవారు. సంపాదించినందతా పట్టుకు వచ్చి భావి జీవితం కోసం కరాచీలో పెట్టుబడుల రూపంలో లేదా మదుపు పెట్టేవారు. ఈ దేశాన్ని ముస్లింలీగ్, ఆంగ్లేయులు కలసి చీలుస్తారని వారు ఊహించలేదు పాపం. ప్రపంచ పరిణామాలలో భాగంగా పాకిస్తాన్ 1965లో పశ్చిమ సరిహద్దుల నుంచి భారత్‌ను ఎదుర్కొనవలసి వచ్చింది. 1962లో చైనాతో యుద్ధం తరువాత భారత్ బలహీన పడిందన్న పిచ్చి ఊహతో పాకిస్తాన్ భారత్ మీద దాడి చేసిన ఫలితం మాత్రమే అది. యుద్ధంలో భారత్ గెలిచినా ఐక్య రాజ్యసమితిలో శాంతి ఒప్పందం జరిగింది. భారత్‌కు ఒరిగిందేమీ లేదు. ఆ తరువాత కొందరు భారత్‌లోని తమ స్థిరచరాస్తులు సహా శాశ్వతంగా పాకిస్తాన్‌కు వెళ్లిపోవాలని అనుకున్నారు. అప్పటిదాకా అవి ఎవాక్యూ ప్రాపర్టీ చట్టం 1950 మేరకు కస్టోడియన్ చేతిలో ఉండేవి. వీరిని భారత ప్రభుత్వమే నియమించేది. వీటినే ఎవాక్యూ ప్రాపర్టీ




ఉత్తర ప్రదేశ్‌లో

అనేవారు. గోవాకు చెందిన ఇలాంటి వారి ఆస్తులు గోవా, డామన్ దయ్యూ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ ఎవాక్యూ ప్రాపర్టీ చట్టం 1964 కింద ఉండేవి. అయితే భారత్ నుంచి పాకిస్తాన్ వెళ్లి, అక్కడి పౌరసత్వం స్వీకరించిన వారికి 1965లో చేదు అనుభవం ఎదురైంది. కారణం ఎనిమీ ప్రాపర్టీ విధానం. చైనాతో యుద్ధం సమయంలోను డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్ 1962 ప్రకారం చైనా పౌరసత్వం స్వీకరించిన ఒకనాటి భారతీయుల ఆస్తులు ప్రభుత్వం అధీనంలోకి వచ్చాయి. 1968 చట్టాన్ని మరింత భారతీయ అనుకూలం చేస్తూ 2015, 2018,2019, 2020లలో కేంద్ర ఆదేశాలు జారీ చేసింది. వీటి ప్రకారం శత్రు దేశానికి వెళ్లిపోయిన వారి ఆస్తి మీద ప్రభుత్వానిదే అజమాయిషీ. నిరుడు సెప్టెంబర్‌లో ఇందుకు సంబంధించిన ఒక వార్త కూడా వచ్చింది. ఉత్తర ప్రదేశ్‌లోని కోటానా బంగార్ అనే గ్రామంలో 13 బిఘాల భూమిని శత్రువు ఆస్తి కింద వేలానికి పెట్టింది. ఈ గ్రామం బాగ్‌పట్ జిల్లాలో ఉన్నది. ఆ ఆస్తి పాకిస్తాన్ సర్వసైన్యాధ్యక్షునిగా, తరువాత దేశాధ్యక్షునిగా పనిచేసిన పర్వేజ్ ముషారఫ్‌దే. అదే సమయంలో దేశంలోని 55 శత్రు ఆస్తులను (ఒక్కొక్కటి రూ కోటి విలువ చేస్తుంది) కూడా వేలానికి పెట్టారు.

ఇలాంటి వేలానికి, లేదా ఈ ఆస్తులను దేశంలోని వారికే చెందే విధంగా చేయాలనుకోవడానికి చాలా కారణాలు ఉన్నాయి.

ఇందులో భద్రత కోణం ప్రధానంగా చూస్తున్నారు. ఇక్కడ ఆస్తులు ఉన్నాయన్న పేరుతో శత్రుదేశం ప్రవేశించి, కార్యకలాపాలు చేపట్టకుండా ఇదొక చర్య.

వీటిని అమ్మడం వల్ల భారత ఆర్థిక వ్యవస్థకు లాభం చేకూరుతుంది. ఆర్థిక వ్యవస్థ పురోగతికి అవి వినియోగంలోకి వస్తాయి.

శత్రుదేశంలో ఉన్నవాళ్లు ఈ దేశంలో ఆస్తులు కలిగి ఉండడం దౌత్య సంబంధాలకు ఇబ్బందికర పరిస్థితులను కల్పిస్తాయి. ప్రధానంగా ఇరుగు పొరుగు దేశాలతో ఈ సమస్య ఎక్కువ.

**– జాగృతి డెస్క్**

# జానపద వీరగాథల పరిశోధకు

"నేను పూర్వజన్మలో కడప జిల్లా ప్రొద్దుటూరు తాలూకా రాజుపాలెం దగ్గర ఉన్న అయ్యవారిపల్లె గ్రామంలో శ్రీ గజ్జల వెంకట్రామయ్య గారి కుటుంబానికి చెందిన ఒక యాదవుణ్ణి అని 15.03.1966 నాడు అదే గ్రామంలో నాకు కలిగిన ఒక ఆత్మ ప్రబోధం వలన తెలుసుకున్నాను. ఆ జన్మలో నేను ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గారిని, బుడ్డా వెంగళరెడ్డి గారిని చూసి వుంటాను. లేకపోతే ఎక్కడో పశ్చిమ గోదావరి జిల్లాలో గోదావరి తీరంలో పుట్టిన నేను ఈ కుందేరు తీరంలోని ఈ ఇద్దరు మహాత్ముల గురించి మొట్టమొదటిసారిగా ఎలా చెప్పగలిగాను? నేను ఈ జన్మలో కాటమరాజు కథల గురించి అపూర్వమైన పరిశోధనలు చేయడం కూడా పూర్వజన్మల సంస్కారం వల్లనే అని భావిస్తున్నాను".

"ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గారు యుద్ధ వీరుడు, బుడ్డా వెంగళరెడ్డి గారు దానవీరుడు. ఒకరు రేనాటి సూర్యుడు, మరొకరు రేనాటి చంద్రుడు. ఈ రేనాటి సూర్యచంద్రుల గురించి 1965–66లో నేను చేసిన పరిశోధన, సేకరించిన సమాచారాన్ని కలిపి ఈ గ్రంథరూపంలో ఇవ్వడమైనది."


ఇవి ఆ ఇద్దరు చరిత్ర పురుషుల సమకాలికుడు ఎవరో రాశారని అనుకుంటే పొరపాటు. తెలుగువారి వీరగాథల మీద రాసిన పరిశోధకుని అంతరంగమిది. ఆయన పేరే ఆచార్య తంగిరాల వేంకటసుబ్బారావు. తన 'రేనాటి సూర్యచంద్రులు' పరిశోధనాత్మక గ్రంథం ముందు మాటలు ఇవి. చరిత్ర మేధస్సుకు సంబంధించినది. సాహిత్యం దానికి ఛాయ. చరిత్ర ఆత్మ సాహిత్యంలోనే సాక్షాత్కరిస్తుంది. జానపద వీరగాథలు చదివితే ఈ సంగతి బాగా అర్థమవుతుంది. డాక్టర్ తంగిరాల సాహితీ సేద్యం ఆ పంథాలో సాగిన ప్రత్యేక స్రవంతి.


ఆచార్య తంగిరాల వెంకట సుబ్బారావు (మార్చి 30,1935–జనవరి 25, 2025) గొప్ప పరిశోధకుడు. జానపద సాహిత్యంపై మక్కువతో పల్లె జనం పాటల్లో నిలిచిపోయిన ధీరోదాత్తుల జీవిత చరిత్రలను సేకరించేందుకు ఆయన అవిశ్రాంతంగా శ్రమించారు. వీరి స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లా, తణుకు తాలూకా కాకుల ఇల్లిందలపర్రు. తిరుపతి శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.ఎ. తెలుగు పూర్తి చేశాక ఆచార్య పింగళి లక్ష్మీకాంతం, ఆచార్య జి.ఎన్.రెడ్డి పర్యవేక్షణలో "తెలుగు వీరగాథా కవిత్వం" అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ తీసుకున్నారు. ఆ పరిశోధన కోసం సుమారు 1000 జానపద వీరగాథలను సేకరించారు.

డాక్టరేట్ పట్టా తీసుకున్నాక 1969లో బెంగళూర్ యూనివర్శిటీలో కన్నడ శాఖలో తెలుగు ఉపన్యాసకునిగా సేవలందించారు. అదే యూనివర్శిటీలో తెలుగు శాఖను ఏర్పాటు చేయాలన్న తపనతో నాటి ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రి పి.వి. నరసింహారావుకి లేఖ రాయగా ఆయన స్పందించి రూ. 3 లక్షలు మంజూరు చేశారు. అలా 1974లో బెంగళూర్ యూనివర్శిటీలో తెలుగు శాఖ మొదలయింది. 1992లో అదే విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధిపతిగా ఆచార్య తంగిరాల పదవీ విరమణ చేశారు.

ఉద్యోగ విరమణానంతరం ఏప్రిల్ 11, 1994లో శ్రీకృష్ణదేవరాయ రస సమాఖ్య అనే సాహితీ సంస్థను స్థాపించి ప్రతినెల ఒక కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగు ప్రాచీన సాహిత్యం గురించి, ఆధునిక సాహిత్యం గురించి, జానపద సాహిత్యం గురించి ప్రముఖుల చేత ఉపన్యాసాలు ఇప్పించి తెలుగుభాషా వికాసానికి ఎనలేని సేవ చేశారు.

జానపద సాహిత్యాన్ని అన్వేషిస్తూ ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమ, తెలంగాణాలోని అనేక పల్లెల్లో కాలినడకన తిరిగి అనేక తాళపత్ర గ్రంథాలను సేకరించారు. ఆయన సేకరించిన వాటిలో పల్నాటి వీరగాథలు 25, కాటమరాజు కథలు 32 ఉన్నాయి. వీటిపై 1975లో మొదటి ప్రపంచ తెలుగు సభల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సంగీత నాటక అకాడమీ మోనోగ్రాఫ్‌గా ప్రచురించింది. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ కాటమరాజు కథలను రెండు



సంపుటాలుగా ముద్రించింది.

'రేనాటి సూర్యచంద్రులు'లో ఉయ్యాలవాడ నరసింహారెడ్డిది వీరగాథ (విప్లవకాలం). బుడ్డా వెంగళరెడ్డి కరువుకాలంలో ప్రజలకు తిండిపెట్టి కాపాడి ప్రాణ భిక్ష పెట్టాడు. డా. తంగిరాల సృజనాత్మక రచనల్లో 'హంసపదిక' ప్రణయ కావ్యం. వనదేవత బుర్రకథ, గుండె పూచిన గులాబీ ఇతర రచనలు.

తంగిరాల ఉమ్మడి ఆంధ్రరాష్ట్రం నలుమూలలా తిరిగి వివిధ జానపద కళారూపాలను సేకరించారు. చాలా ప్రదేశాల్లో కళాకారులు పాడుతూ ఉంటే వాటిని తాను అక్షరబద్ధం చేసి వర్గీకరించారు. వీటిల్లో జంగం కథలు, బుర్ర కథలు, గొల్ల సుద్దులు, జముకుల కథ, తందాన తానా పాటలు, బతకమ్మ పాటలు, కోలాటం పాటలు, స్త్రీల పాటలు మొదలైనవి ఉన్నాయి. 1905లో నందిరాజు చలపతిరావు రచించిన స్త్రీల పాటలను సమగ్ర సంపుటిగా 120 సంవత్సరాల తరువాత, అంటే అక్టోబరు 2024లో ప్రచురించారు. తంగిరాల సాహిత్య సేవకు గుర్తింపుగా అజో–విభో కందాళం ఫౌండేషన్ ప్రతిభామూర్తి పురస్కారాన్ని ప్రకటించింది.

'అమృతం కురిసిన రాత్రి' కవి దేవరకొండ బాలగంగాధర తిలక్‌కు ప్రియశిష్యుడు తంగిరాల. డిగ్రీ పూర్తి అయ్యాక ఆరు సంవత్సరాలు తపాలా శాఖలో పని చేశారు. ఆయన కోరిక మేరకే "మైడియర్ సుబ్బారావు కనిపించడం మానేశావు" అంటూ తిలక్ తపాలా బంట్రోతు ఇతివృత్తంగా చాలా చక్కని కవిత రాశారు. గురువుగారి మీద గౌరవంతో తంగిరాల

# డు - తంగిరాల

'రస గంగాధర తిలకం' పేరుతో కవితలు రాశారు.

తంగిరాల గొప్ప జాతీయవాది. నరసింహారెడ్డి గారి స్వాతంత్ర్య పోరాటాన్ని శంకించే కొందరు పెద్దలకు సమాధానం ఇలా చెప్పారు.

'బ్రిటిష్ కాలంలో జరిగిన ప్రతీ తిరుగుబాటులోనూ స్వాతంత్ర్యేచ్ఛ ఉన్నదన్న సత్యాన్ని మరచి పోకూడదు. ప్రతీ విప్లవకారుడుకీ ఆనాడు వేలాదిగా ప్రజల అండదండలున్న విషయాన్ని కూడా మనం విస్మరించకూడదు. నరసింహారెడ్డి వెనుక 9000 మంది సైనికులు ప్రాణాలకు తెగించి ఎలా నిలబడినారు? మన భారతీయులకు భారతీయ చరిత్రకారులు రాసిన చరిత్ర లేదు. వలస చరిత్ర కారులు రాసిన చరిత్ర మాత్రమే ఉంది. దానినే మనం నమ్ముతున్నాం. సమస్త చరిత్రను కార్ల్‌మార్క్స్ సిద్ధాంతం కళ్లద్దాలతోనే చూస్తారు. వారికి అందరూ దోపిడీదారులు, బూర్జువాలుగానే కనిపిస్తారు. అది వాళ్లు ధరించిన కళ్లద్దాల లోపం' అన్నారు తంగిరాల.

నరసింహారెడ్డి సైన్యంలో సమాజంలో వెనుకబడిన వర్గాలు గిరిజనులు వడ్డేవాళ్లు, యానాదులు, బోయలు, చెంచులు, పట్ర కులంవారు అగ్రకులాలవారు కూడా చేరారు. దీనిని బట్టి నరసింహారెడ్డి పలుకుబడిని అంచనా వేయవచ్చును. వీరందరిపైన పరిశోధనలు జరగాలని తంగిరాల అభిప్రాయపడేవారు.

> 'బ్రిటిష్ కాలంలో జరిగిన ప్రతీ తిరుగుబాటు లోనూ స్వాతంత్ర్యేచ్ఛ ఉన్నదన్న సత్యాన్ని మరచి పోకూడదు. ప్రతీ విప్లవకారుడుకీ ఆనాడు వేలాదిగా ప్రజల అండదండలున్న విషయాన్ని కూడా మనం విస్మరించకూడదు. నరసింహారెడ్డి వెనుక 9000 మంది సైనికులు ప్రాణాలకు తెగించి ఎలా నిలబడినారు? మన భారతీయులకు భారతీయ చరిత్రకారులు రాసిన చరిత్ర లేదు. వలస చరిత్ర కారులు రాసిన చరిత్ర మాత్రమే ఉంది. దానినే మనం నమ్ముతున్నాం.

బుడ్డా వెంగళరెడ్డి రేనాటి చంద్రుడు. ఆయన దాతృత్వం గురించి

"శతేషు జాయతే శూర సహస్రేష పండిత

వక్తా శత సహస్రేసు దాతా భవతి నానవా" అంటారు. అంటే కొన్ని వందల మందిలో ఒక శూరుడు ఉంటాడు. కొన్నివేల మందిలో ఒక పండితుడు ఉంటాడు, కొన్ని లక్షల మందిలో ఒక వక్త ఉంటాడు, కాని కొన్ని లక్షలమందిలో ఒక దాత ఉంటాడో ఉండడో చెప్పలేం. బుడ్డా వెంగళరెడ్డి కొన్ని లక్షల మందిలో అపురూపంగా కనబడే మహాదాత అన్నారు తంగిరాల.

*"రాజు మరణించె - నొక తార రాలిపోయే ..*
*కవియు మరణించె - ఒక తార గగన మెక్కె..*

*రాజు జీవించెరాతి విగ్రహములందు..*
*సుకవి జీవించె ప్రజల నాలుకల యందు"*
**- జాషువ**

**సంప్రదించిన గ్రంథాలు:**

1. రేనాటి సూర్యచంద్రులు, తంగిరాల వెంకట సుబ్బారావు
2. Brief History of Madanapalli F.A. Coleridge (P-23)
3. A Manual of the Kurnool District by Narahari Gopala Krishna Seetty




**డా. కాశింశెట్టి సత్యనారాయణ**
విశ్రాంత ఆచార్యుడు


**తొలి అడుగు**

అనేకానేక చర్చలు, సంప్రతింపులు, సలహాల స్వీకరణ తరువాత, వాయిదాలు పడిన తరువాత ఉత్తరాఖండ్ రాష్ట్రంలో జనవరి 27 నుంచి ఉమ్మడి పౌరస్మృతి అమలులోకి వచ్చింది. ఈ చట్టాన్ని అమలులోకి తెస్తూ, ఇందుకోసం ఒక ప్రత్యేక పోర్టల్‌ను కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్‌సింగ్ ధామి ప్రారంభించారు. బీజేపీ పాలిత ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి అమలులోకి రావడం ఇంకొన్ని రాష్ట్రాలలో కూడా రావడానికి మొదటిమెట్టుగా కనిపిస్తున్నది. ఉమ్మడి పౌరస్మృతి వేరే ఏ మత విశ్వాసానికి వ్యతిరేకం కాదని, మహిళా సాధికారతకు తొలి మెట్టు అని ముఖ్యమంత్రి ధామి వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం ఏ వర్గానికి వ్యతిరేకం కాదని, రాష్ట్రంలో అందరినీ సమదృష్టితోనే చూస్తామని కూడా చెప్పారు. తాము మొదటిసారిగా ఉమ్మడి పౌరస్మృతిని



## ఉత్తరాఖండ్‌లో ఉమ్మడి పౌరస్మృతి

అమలులోకి తెచ్చి చరిత్ర సృష్టించామని మిగిలిన రాష్ట్రాలు కూడా దీనిని అనుసరిస్తాయని ఆశిస్తున్నామని అన్నారు. ఉత్తరాఖండ్ నిర్ణయం మీద అప్పుడే సణుగుడు ఆరంభమైంది. షరియాను కాదనే ఏ చట్టాన్నీ తాము గౌరవించబోమని కొందరు ముస్లిం ప్రముఖులు అప్పుడే వ్యాఖ్యానించారు. ఉత్తరాఖండ్ నిర్ణయాన్ని కోర్టులో సవాలు చేసే ప్రయత్నాలు కూడా మొదలయ్యాయి.అయితే ఉమ్మడి పౌరస్మృతి నిర్ణయం రాత్రికి రాత్రికి తీసుకుని అమలు చేస్తున్నది కాదని, 2.5 లక్షల మంది పౌరుల సలహా సంప్రతింపులు ఇందులో ఉన్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. బహు భార్యాత్వం, బహు భర్తృత్వం, హలాల్, ఇద్దత్,తలాక్ వంటి విపరిణామాలకు అడ్డుకట్ట వేయడానికే ఈ చట్టం ఉపయోగపడుతుందని అన్నారు. అలాగే ఆస్తిహక్కులో స్త్రీపురుషులకు సమాన అవకాశాలు ఇస్తుందని చెప్పారు. మొదటి నుంచి అనుకున్నట్టే ఆదివాసులను దీని నుంచి మినహాయించినట్టు కూడా చెప్పారు.

మీకు తెలుసో తెలియదో, ఉత్తరప్రదేశ్‌లో కూడా ఉమ్మడి పౌరస్మృతి ఇప్పటికే అమలులో ఉన్నదని తాజాగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మహా కుంభమేళా సందర్భంగా ఒక న్యూస్ చానల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పడం విశేషం. మీ రాష్ట్రంలో ఉమ్మడి పౌరస్మృతి ఎప్పటి నుంచి అమలులోకి రాబోతున్నదని విలేకరి అడిగిన ప్రశ్నకు యోగి ఆ విధంగా స్పందించారు.

కాగా మరొక బీజేపీ పాలిత రాష్ట్రం అస్సాం అంతా సిద్ధం చేసుకున్నప్పటికి కేంద్రం చేయబోయే ఉమ్మడి పౌరస్మృతిచట్టం కోసం ఎదురు చూస్తున్నది. ఒక వేళ కేంద్రం ఆ చట్టం తీసుకువస్తే రాష్ట్రాలు తెచ్చే చట్టాలన్నీ వాటికవే రద్దయిపోతాయి. ఉత్తరాఖండ్ ఇవాళ ఉమ్మడి పౌరస్మృతి తెచ్చిందని, రేపు దేశమంతా ఇలాంటి అమలు అవుతుందని, అప్పుడు అస్సాం కూడా తీసుకు వస్తుందని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మ వ్యాఖ్యానించారు. ★

'సనాతన నర్తనం' అనగానే, వినగానే మెదిలే పేరు ఆమెదే.

'భారతీయ నృత్యఝరి'ని వేదికమీద ప్రత్యక్షం చేసిందీ ఆమే.

సంప్రదాయ విధానాల జీవనాడి కూచిపూడి
గురు సంప్రదాయ సముదాత్తం భరతనాట్యం
పదవేగ విన్యాస పతాక కథక్
ఆలయ ఆచార ఘనకీర్తి ఒడిస్సీ
తాండవ పద్ధతుల మాధురి మణిపురి
విశేష ఆహార్యాల ఘట్టం మోహినీ యాట్టం
నాలుగు యుగాల నృత్య రూపాంతర ప్రదర్శన.

సాంస్కృతికత, కళానిపుణత వెల్లివిరిసేలా చేసే ప్రాభవ వైభవం.

భరతుని నాట్యశాస్త్ర విస్తృతిని దేశ విదేశాల్లో ప్రత్యక్ష అనుభూతిగా నిలిపే ప్రవీణత.

భావ, రాగ, తాళ సమన్విత భరిత థాటి, మేటి వ్యక్తీకరణ.రూప మేళవింపు, కథన పోహళింపులను గుదిగుచ్చి అందించే ఓర్పూ నేర్పూ. శిల్ప విలక్షణతకు ప్రతీకగా, అభినయ దక్షతకు గుర్తుగా వ్యవస్థాపన రీతి.

కదలికల రూపేణా ఆధ్యాత్మికతకు పట్టం కట్టే నిరుపమాన చాతురి.

రసభంగిమల, లయ విన్యాసాల క్రోడీకరణగా నిలిచే శాస్త్రీయతా పటిమ.

వీటన్నింటి ప్రాచుర్యాన్నీ జీవన సరళిగా మార్చుకుని, తాను నేర్చిన విద్య మొత్తాన్ని శిష్యులకు తేటతెల్లం చేయడమే పనిగా మలుచుకున్న తత్వరూపం.

ఈ అంశాలను ఎవరు ఎప్పుడు ప్రస్తావించినా వినమ్రతనే సమాధానంగా అందించడం నిర్మలా విశ్వేశ్వరరావు సహజ స్వభావం.

'నాట్య శిరోమణి' అనిపించుకుని ఫిబ్రవరి తొలి వారం నాటికి సరిగ్గా రెండు దశాబ్దాలు. నృత్య ప్రదర్శనలిచ్చిన విదేశాల సంఖ్య కూడా ఇరవైకి పైమాటే!




# సనాతన నర్తన

వేదకాలాలు ఎన్నో మనకు తెలుసు.

సనాతనత్వ ప్రాధాన్యమూ తరతరాలుగా విదితమే. మరి అటువంటప్పుడు – ఏది వేద ధర్మం? ఎటువంటిది సనాతన తత్వం? చిన్నప్పటి నుంచీ నిర్మలలో ఇవే ప్రశ్నలు. వేదాలు ఎంత ప్రాచీనాలో సనాతన ధర్మాలూ అంతే. వ్యక్తికీ సమాజానికీ అవే ఆవశ్యకాలు, ఎన్నటికీ, ఎప్పటికీ ప్రామాణికాలు అన్నదే బాల్యం నుంచీ తనలో స్థిరపడిపోయింది.

ఆమె తల్లిదండ్రుల పేర్లలో సీతారాములున్నారు. బడి వయసులో గురువు పేరులోనూ రాములవారే! చదువుతోపాటు కళలమీదా ఆసక్తి మొదటి నుంచీ ఉండేది నిర్మలకు, ఆ అభిరుచిని పెంచి పోషించినవారు ఎందరెందరో.

ఇంటి వాతావరణం, పాఠశాల విద్యాబుద్ధులు కాలక్రమంలో తనను మరింత ఉత్సాహపరిచాయి. ప్రత్యేకించి, భర్త విశ్వేశ్వరరావు అందిస్తూ వచ్చిన ప్రోత్సాహం ఆమె పయనాన్ని నిరవధికంగా ముందుకు తీసుకెళ్లింది.

సంగీత, సాహిత్యాది కళారూపాల సమాహారం నృత్యం కనుక తన చూపులన్నీ అటువైపే కేంద్రీకృతమయ్యాయి. పెళ్లి అయిన తర్వాతే విశ్వవిద్యాలయ చదువులను పూర్తి చేసుకున్నారు. ఆంధ్రా, కేంద్రీయ, తెలుగువర్సిటీలతో విస్తృత అనుబంధాలు కొనసాగాయి. ఇప్పటికీ సాగుతూ వస్తున్నాయి.

'మీ తొలి ప్రదర్శన వేదికమీద ఎప్పుడు, ఏ వయసులో' అని అడిగితే 'పదేళ్ల లోపునే' అని బదులిస్తారు నవ్వుతూ. ఆ వయసుల్లో మొదలైన కళారాధన పలు రూపాలు సంతరించుకుని, ఇప్పుడు యాభై ఐదేళ్ల ప్రాయానా నిత్యనూతనంగా వెల్లి విరుస్తుంటే అదీ ఆమె భాగ్య విశేషం.

పదీ పన్నెండేళ్ల వయస్సులోనే పురస్కృతులు సొంతం చేసుకున్న నిర్మలను పలు అవకాశాలు ఏరికోరి వరించాయి. పతకాలన్నింటినో తెచ్చిపెట్టి, బంగరు భవితకు మేటిబాటలు వేశాయి. గానసభలు, కళాభవన్‌లు, లలితకళల తోరణాలు, విజ్ఞాన వికాస కేంద్రాలు, ఇంకెన్నెన్నో వేదికలు సంభావించాయి.

ఆమెతో మాట్లాడుతుంటే, సంప్రదాయం, ఆధ్యాత్మికం, తరంగాలు, జావళీలు, పదాలు, పదవర్ణాలు, కీర్తనలు, శ్లోకాల వంటివెన్నెన్నో జాలువారు తుంటాయి. తిల్లానాలు, జతిస్వరాలు, అభినయ దర్పణాలు. నృత్య అంశాలనేకం వివరణాత్మకంగా వినవస్తుంటాయి.

గురువులను నిరంతరం గుర్తుచేసుకుంటూ ఉంటారామె. 'నా నాట్య ప్రదర్శనలు, నేను నిర్వర్తిస్తున్న కార్యక్రమాలు, నాకు లభించిన పురస్కారాలు, వచ్చి చేరిన బిరుదులు.... వీటన్నింటి నేపథ్యం గురుబోధనే' అంటారు వినయ పూర్వకంగా. ప్రధానంగా కూచిపూడి గురూత్తములు రామమూర్తి, రామ లింగశాస్త్రి. 'అక్కడి నుంచి నేర్చుకున్న ప్రమాణాలు, విలువలనే ఈనాటికీ అనుసరిస్తూ వస్తున్నాను. బోధించడంలో, అంతకుముందుగానే సమగ్ర అధ్యయనం చేయడంలో ఎంతో సంతోషాన్ని పొందు తున్నాను' అని చెబుతారు.

భాగ్యనగరంలో ఉంటున్న నిర్మలా విశ్వేశ్వరరావు, భారతీయతను విశ్వవ్యాప్తం చేసేందుకు సాగిస్తున్న



# ...మణి నిర్మల

కృషికి– నాట్య ప్రభంజని, కళాకౌముది, విద్వన్మణి అంటూ శ్లాఘిస్తుంటారు.

నర్తన రంగాన సమ్మిళిత రూపాలు ఎన్ని లేవు...? అన్నమయ్య, త్యాగరాజ కీర్తనలు, అష్ట పదులు, శివస్తుతులు... ప్రస్ఫుటంగా విశదీకరించా లంటే – వివిధ పాత్ర పోషణలు. లక్ష్మి, పార్వతి, దుర్గ, సీత. రాధగా, ప్రకృతి మాతగా, శకుంతలగా, రాణిగా, మోహినిగా, ఆనంద తాండవం, శశిరేఖా పరిణయం, శ్రీరామకథాసారం, రామదాసు చరితం, దశావతారం, శ్రీకృష్ణ విలాసం, మరీ విభిన్న రీతిన విష్ణు రూపనర్తనం. ఇలా ప్రదర్శనాంశాలు అసంఖ్యాకం. ఏ రూపధారణ చేసినా – హావ భావ ప్రకటనలో, నృత్యదక్షతలో తనకు మాత్రమే సొంతమైన చక్కని పరిణితి ఆమెది.

తమిళనాడు, ఒడిశా, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, దేశ రాజధాని ఢిల్లీ మహానగరంలో ఉత్సవాల్లో మన సంస్కృతీ పతాకను చేతపట్టి నిలిచారామె. శ్రీలంక, సింగపూర్, దుబాయి, మలేసియా, టర్కీ– ఏ దేశానికి వెళ్లినా, ఎక్కడ ఏ కార్యక్రమాన్ని సమర్పించినా, ఆసాంతమూ భారతీయతే.

**గంగాతరంగమై పొంగె నా హృదయమ్ము**
**అవధరింపుము ప్రభూ! అమృతాభిషేకమ్ము**
**మనసు అరవిందమై, మమత మకరందమై**
**విరిసినది నీ ముందు – వేగగొనుమీ విందు.**
**అందాల నటరాజ! అందుకో నా పూజ!**

అనేలా ఆ సన్నివేశమే సాకారమయ్యేలా ఉంటుందా నాట్యప్రభ.

వాగ్గేయకార మహోత్సవ వేదికలైనా, యువకళా ప్రదర్శక ప్రాంగణాలైనా తనకు ఆరాధ్యనీయాలు. పలు రాష్ట్రాలలోని, ఇతర దేశాలలోని తెలుగు సంస్థలూ, సంఘాలు ఆహ్వానించిన సందర్భాలన్నింటి లోనూ సనాతన నర్తన సంప్రదాయానికీ పట్టాభిషేకం చేయడం ఆమె ఘనత.

ప్రాంతీయతకు ప్రాముఖ్యతనిస్తూ ఇంకా ఇంకా ప్రదర్శనలిచ్చారు. శిష్యులతో చేయిస్తున్నారు. ప్రతిష్ఠాత్మక పోటీల బహుమతి నిర్ణేతగానూ వ్యవహరిస్తున్నారు.

మెరుపుల, మైమరపుల రసావిష్కరణలో మేటి. సమయ సందర్భాల అనుసారంగా జానపద నృత్య ప్రక్రియలోనూ ఆమె ధాటి.

గోదావరి ప్రాంతాన పుట్టి పెరిగిన నిర్మల నర్తన 'నికేతనం' ఎంతెంతో ప్రాచుర్యాన్ని అందుకుంది. ఆ సంస్థ నుంచీ అనేక వసంతాలుగా ఎందరెందరో శిక్షణ పొంది, పేరు ప్రఖ్యాతులను తమవిగా చేసుకున్నారు. తాను అధ్యయనం చేస్తూ మరెందరి చేతనో చదివింపచేస్తూ, ప్రదర్శనలిస్తూ కొత్తవారినీ ప్రవేశింపచేస్తూ, తీరికలేని పనుల్లో ఉంటారు నిర్మలామణి. ఆ నర్తన ఎంత ప్రతిభావంతమో, ఆమె మనోభావనా అంత నిర్దుష్టం.


– ఎంత నేర్చితే, నేర్పిస్తే అంతగా విస్తరిస్తుంది కళ.

– మానసిక ఆనందం, సామాజిక ప్రయోజనం – రెండూ ప్రధానమే.

నృత్య అంశం సత్యసనాతనం. బాల్యం నుంచే మొగ్గ తొడిగి పరిమళించాలి. ప్రదర్శన ఇస్తేనే నాట్యం సార్థకమవుతుంది. ఇంటా బయటా లభించే ఉత్సాహ ప్రోత్సాహాలే కళాకారిణిని సమున్నత స్థాయికి చేరుస్తాయి. సాధన, బోధన... పరస్పర ఆధారితాలు. మనస్సు, శరీరం ఆరోగ్యంగా ఉంటేనే నృత్యసుమంలో గుబాళింపు. ఆ పరిమళ విస్తరణలే దృఢసంస్కృతిని స్థాపిస్తాయి. ఈ రంగంలో ఎదగాలనుకొనేవారికి సహనమే శక్తి. సంసిద్ధతను పదిలపరచుకుంటూ, అవకాశాలను వినియోగం చేసుకుంటూ, ముందడుగు వేయాలి. నర్తకీమణులు, సాంస్కృతిక రాయబారులు కావాలి. సనాతన సంప్రదాయాలను కంటి రెప్పల్లా పరిరక్షించాలి. ఈ భావాలకు అనుగుణంగా కళారంగ ప్రస్థానం సాగిస్తున్నారు నృత్యకారిణి నిర్మల. అంతరంగం అక్షర రూపం ధరిస్తే ఏమంటుందో తెలుసా మరి.

నా మానసం నవ సరోవరంలా మారుతోంది
భావనం సహస్ర పత్ర కమలంలా తేలుతోంది
అనురాగం సుకుమార సుగంధంలా ప్రసరిస్తోంది
ఆనందం మధుర మకరందంగా ప్రవహిస్తోంది!
పొంగి పొరలిన లావణ్యం అలలా
నింగిలోని నక్షత్రాల పంక్తి మాలికలా
మనసు సరోవరం, భావం స్వచ్ఛ సమన్వితం.

కూచిపూడి నాట్యకళారాణి శోభానాయుడును ఎంతగానో ఆరాధిస్తారు నిర్మలా విశ్వేశ్వరరావు. గురుదైవంగా భావించి, ఆ నృత్యరీతిని అనంతంగా ప్రేమిస్తుంటారు. శిక్షణనివ్వడంలోని నిబద్ధతను ఆదర్శంగా స్వీకరించి, తనూ అదే మార్గాన పయనిస్తున్నారు. 'ప్రాచీన చరిత్ర, కళలు' గురించి గట్టిపట్టు ఉన్న అలేఖ్యా పుంజాల నృత్య బోధకత్వాన్ని మార్గదర్శకంగా తీసుకున్నారు నిర్మల.



**జంధ్యాల శరత్‌బాబు**
**సీనియర్ జర్నలిస్ట్**

# ఆర్ఎస్ఎస్ శాఖకు

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ – ఆర్ఎస్ఎస్ అంటే డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌కు ఒక సంపూర్ణమైన అవగాహన ఉంది. ఓ జాతీయ సంస్థగా ఆర్ఎస్ఎస్ హిందువుల ఐక్యత కోసం అహర్నిశలు పనిచేస్తోందని కూడా ఆయనకు తెలుసు. నిజానికి, మహారాష్ట్రలోని కరాడ్‌లో ఆర్ఎస్ఎస్ శాఖను సందర్శించినప్పుడు ఇది మనది అనే భావనను ఆయన వ్యక్తం చేశారు. అంబేద్కర్ ఆర్ఎస్ఎస్ శాఖను సందర్శించింది 1940లో. ప్రస్తుతం ఆర్ఎస్ఎస్ తన వందవ ఏట అడుగుపెట్టింది. ఈ ఏడాది విజయదశమి నాటికి ఆర్ఎస్ఎస్ ఆవిర్భవించి 100 సంవత్సరాలు పూర్తవుతాయి. కాలం గడుస్తున్న కొద్దీ ఆర్ఎస్ఎస్ అనేక సవాళ్లను, అభియోగాలను ఎదుర్కొంది. కానీ ఈ అభియోగాలన్నీ నిరాధారమైన వని ప్రపంచానికి చాటి చెప్పింది ఆర్ఎస్ఎస్. అదే సమయంలో సమాజానికి తన వల్ల ఒనగూరే ప్రయోజనాన్ని ప్రదర్శించింది. ఆర్ఎస్ఎస్ వేర్వేరు కారణాల్లో మూడు పర్యాయాలు నిషేధానికి గురైంది. అయినప్పటికీ ప్రతిసారీ కూడా నిష్కల్మషంగా అవతరించింది. బ్రాహ్మణులు కేంద్రంగా పనిచేసే ఆర్ఎస్ఎస్‌లో అస్పృశ్యులకు చోటు లేదు అంటూ వచ్చిన ఆరోపణ ప్రస్తుతానికి ఓ అపోహగా మిగిలిపోయింది.





**అస్పృశ్యత నివారణ**

1934లో వార్ధాలో ఆర్ఎస్ఎస్ ఏర్పాటు చేసిన శిబిరాన్ని గాంధీ సందర్శించారు. శిబిరంలో వాలంటీర్లు వేర్వేరు కులాలు, మతాలకు చెందిన వారుగా ఆయన గుర్తించారు. అదే సమయంలో ఏ ఒక్క వాలంటీరులో కూడా ఇతరుల కులమేమిటో తెలుసుకోవాలనే ఆసక్తి లేకపోవడాన్ని గమనించారు. వారందరిలో ఉన్న ఏకైక భావన వారు పంచుకున్న హిందూ సారూప్యత. ఈ ఏకతా భావన వారిని కలిసి జీవించేలా, కలిసి భుజించేలా, కలిసి పనిచేసేలా ప్రేరేపించింది. ఇది చూసి గాంధీ ఎంతగానో ఆశ్చర్యపోయారు. మరుసటిరోజు ఆయన అప్పటి ఆర్ఎస్ఎస్ సర్‌సంఘ్‌చాలక్ పూజనీయ డాక్టర్ హెడ్గేవార్‌ను కలుసుకున్నారు. అస్పృశ్యతా నివారణ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నా రంటూ డాక్టర్ హెడ్గేవార్‌ను ఆయన అభినందిం చారు. ఇందుకు పూజనీయ హెడ్గేవార్ సమాధాన మిస్తూ "అస్పృశ్యతను నివారించడానికని ఆర్ఎస్ఎస్ ఎలాంటి నిర్దేశిత కార్యక్రమాలను నిర్వహించడంలేదు. మేం చేస్తున్నదల్లా మనమంతా హిందువులం అనే సందేశాన్ని ప్రతి ఒక్కరికీ చేరవేయడం. ఏకతా భావన కుల భేదాలు లేదా అస్పృశ్యతను అసంగతమైనదిగా చేస్తుంది. మనం హిందువులమనే విశ్వాసం ప్రతి ఒక్కరిలోనూ మిగిలిపోతుంది" అని అన్నారు.

అంతేకాకుండా ఆర్ఎస్ఎస్ జాతీయ పతాకాన్ని గౌరవించదని, ఆగస్టు 15 లేదా జనవరి 26న ఆర్ఎస్ఎస్ జాతీయ పతాకాన్ని ఎగురవేయదనే ఆరోపణలు ఉండేవి. అయితే ఈ ఆరోపణలు కూడా నిరాధారమైనవని తేలింది. ఆర్ఎస్ఎస్ స్వయంసేవ కులు స్వరాజ్య ఉద్యమంలో పాల్గొనలేదన్న వితండవాదాన్ని సైతం ఖండించడం జరిగింది.

**బాబా సాహెబ్ చిరస్మరణీయమైన ఉపన్యాసం**

ఆర్ఎస్ఎస్ దళితులకు వ్యతిరేకమని, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌కు ఆర్ఎస్ఎస్ పట్ల సదభిప్రాయం లేదని ఆరోపణలు కూడా నిలువలేక పోయాయి. ఇటీవల వెలికివచ్చిన ఓ డాక్యుమెంటు డాక్టర్ అంబేద్కర్‌కు, ఆర్ఎస్ఎస్‌కు మధ్య ఉన్న అనుబంధాన్ని మరింత ప్రస్ఫుటం చేసింది.

నిజానికి, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 1940, జనవరి 2న కరాడ్‌లో ఆర్ఎస్ఎస్ శాఖను సందర్శించి స్వయంసేవకుల ముంగిట ఉపన్యాసం ఇచ్చారు. "కొన్ని విషయాల్లో మన మధ్య విభేదాలు ఉన్నప్పటికీ నేను ఈ సంస్థను మనది అనే భావనతో చూస్తున్నాను " అని ఆయన అన్నారు.

దినపత్రికలో వచ్చిన కథనంలో దీనికి సంబం ధించిన ప్రస్తావన ఇలా ఉంది.. "జనవరి 2న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ కరాడ్‌ను సందర్శించారు. ఆ సందర్భంగా మునిసిపల్ కార్పొరేషన్ ఆమోదం కోరుతూ ఒక లేఖను సమర్పించే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఆయన ఆర్ఎస్ఎస్ శాఖను ఉద్దేశించి ప్రసంగించారు. "కొన్ని విషయాల్లో మన మధ్య విభేదాలు ఉన్నప్పటికీ నేను ఈ సంస్థను మనది అనే భావనతో చూస్తున్నాను" అని డాక్టర్ అంబేద్కర్ అన్నారు" అని వార్తా కథనం పేర్కొంది.


ఆర్ఎస్ఎస్ గడచిన 99 సంవత్సరాలుగా కుల వివక్ష, అసమానతలకు తావులేని ఓ హిందూ సమాజాన్ని నిర్మించడానికి పని చేస్తోంది. కుల గోడలకు ఆవల ఏకతా సమాజం నిర్మాణంపై దృష్టి పెడుతోంది. మనది అనే భావనతో ఆర్ఎస్ఎస్‌ను చూస్తున్నానంటూ డాక్టర్ అంబేద్కర్ చేసిన ప్రకటన ఈ దిశగా ఆర్ఎస్ఎస్ చిత్తశుద్ధితో చేస్తున్న ప్రయత్నాలకు ఓ ప్రమాణంగా నిలుస్తోంది. 1974లో ఆర్ఎస్ఎస్ తృతీయ సర్‌సంఘ్‌చాలక్ పూజనీయ బాలసాహెబ్ దేవరస్ పుణేలో ఉపన్యాసాల మాలలో భాగంగా సామాజిక సమానత, హిందూ ఏకత అనే అంశంపై ప్రసంగించారు. ఆయన ఆ ఉపన్యాసంలో అత్యంత పురోగతితో కూడుకున్న వైఖరిని ప్రదర్శించారు. ఆయన మాట్లా డుతూ " కులాంతర వివాహాలు సర్వసాధారణంగా జరగాలి. అస్పృశ్యత అనేది ఓ దురాచరం. దానిని భూస్థాపితం చేయాలి. అది నామరూపాల్లేకుండా పోవాలి. అస్పృశ్యత సరైంది అయితే ప్రపంచంలో ఏదీ కూడా తప్పు కాదు. కుల వ్యవస్థ అక్రమమైంది వక్రమైంది కూడాను. దానిని సమూలంగా నిర్మూలించాల్సిన అవసరం ఉంది. దానిని ఎలా నిర్మూలించాలనే దానిపై మనం దృష్టి పెట్టాలి. మనం అస్పృశ్యత, కుల వివక్షను పాటించే వారిలో మార్పును తీసుకురావడానికి పనిచేయాలి. మనం వారితో పోరాడటానికి బదులుగా మనం వారి దగ్గరకు వెళ్లాలి. వారితో సమావేశం కావాలి. మన అభిప్రాయాలను వారికి వివరించాలి. ఇది కూడా ఒక విధమైన పనే. ఎందుకంటే ఈ సోదరులు మనలో

# డాక్టర్ అంబేడ్కర్

ఓ భాగం. మన లక్ష్యం వారి ఆలోచనాధోరణిలో మార్పు తీసుకురావడం” అని అన్నారు. ఈ అభిప్రాయాలు ఆర్ఎస్ఎస్ సామాజిక సామరస్యానికి కట్టుబడిన తీరును స్పష్టంగా చూపుతున్నాయి.

అయితే ఆర్ఎస్ఎస్ అంటే పడనివారు సంస్థపై దురభిప్రాయాలను ప్రచారం చేశారు. ఇలాంటి ఓ తార్కాణం నిజాయతీతో కూడుకున్న ఆర్ఎస్ఎస్ వైఖరిని తేటతెల్లం చేస్తోంది. డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశించిన సామాజిక సంస్కరణలు మరీ ముఖ్యంగా అస్పృశ్యత, కుల వివక్షకు సంబంధించిన సామాజిక సంస్కరణలను ఆర్ఎస్ఎస్ తాను ఆవిర్భవించిన 1925 నాటి నుంచే చేపట్టింది. ఆర్ఎస్ఎస్ అనుసరించే విధానం వేరైనప్పటికీ సామాజిక ఏకత, సంస్కరణ అనే లక్ష్యాన్ని నిత్యం ముందు ఉంచుతూనే వచ్చింది.

దత్తోపంత్ ఠేంగ్డీ రచించిన ‘డాక్టర్ అంబేడ్కర్ ఔర్ సామాజిక్ క్రాంతి కీ






యాత్ర’ అనే పుస్తకంలో డాక్టర్ అంబేడ్కర్‌కు ఆర్ఎస్ఎస్‌కు మధ్య సంబంధాన్ని మరింత లోతుగా పరిశీలించారు. పుస్తకంలో ‘డాక్టర్ అంబేడ్కర్ ఔర్ రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్’ పేరుతో ఉన్న ఎనిమిదవ అధ్యాయంలో డాక్టర్ అంబేడ్కర్‌కు ఆర్ఎస్ఎస్ కార్యకలాపాలపై పూర్తి అవగాహన ఉందని, ఆయన స్వయంసేవకులతో క్రమం తప్పకుండా చర్చలు సాగిస్తుండేవారని దత్తోపంత్ పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ హిందువుల ఏకత కోసం పనిచేస్తున్న ఓ జాతీయ సంస్థ అని ఆయనకు తెలుసు. అంతేకాకుండా ఆర్ఎస్ఎస్‌కు, ఇతర జాతీయ స్థాయిలోని హిందూ సంస్థలకు మధ్య తేడాలను కూడా ఆయన గుర్తించారు. డాక్టర్ అంబేడ్కర్ డాక్టర్ హెడ్గేవార్ తరహాలో ఏకత, సామరస్యంతో కూడుకున్న ఓ సమాజాన్ని నిర్మించడం ద్వారా మాత్రమే సామాజిక సమానత్వం సాధ్యమౌతుందని విశ్వసించారు.

కరాడ్‌లో ఆర్ఎస్ఎస్ శాఖను డాక్టర్ అంబేడ్కర్ సందర్శించడం ద్వారా ఏకత, సౌభ్రాతృత్వం తాలూకు సందేశం ప్రపంచానికి అందివచ్చింది. ఈ ఘటనకు గుర్తుగా సామాజిక సామరస్యాన్ని పాదుగొల్పే ఉద్దేశంతో 2025, జనవరి 2న లోక్ కల్యాణ్ మండల్ ట్రస్టు కరాడ్‌లో సౌభ్రాతృత్వ సదస్సును నిర్వహించింది. అఖండ భారత్ ఆవిర్భావం కోసం చేపట్టిన ఈ ప్రయత్నానికి మనమందరం మద్దతుగా నిలబడాలి.

– ‘ఆర్గనైజర్’ నుంచి




# విశ్వమేళా


ప్రయాగ ఇప్పుడు మూడు నదుల సంగమం మాత్రమే కాదు, ఎన్నో సంస్కృతుల వారిని, సిద్ధాంతాల వారిని కూడా ఏకం చేయగలిగే శక్తి కలిగినదిగా కనిపిస్తున్నది. ముస్లిం, క్రైస్తవ దేశాల వారు, సుదూర దేశాల వారు కూడా ఈ మహోత్సవం పట్ల ఎంతో ఆసక్తిని ప్రదర్శిస్తున్నారు. అందుకే ఈ కుంభమేళా ఒక అంతర్జాతీయ ఆధ్యాత్మిక కేంద్రంగా అవతరించబోతున్నదని చెబుతున్నారు. 73 దేశాల రాయబారులు తాము ప్రయాగలో పవిత్ర స్నానాలు ఆచరించాలని కోరుకుంటున్నామని వర్తమానం ఇవ్వడమే ఇందుకు నిదర్శనం. ప్రస్తుతం యుద్ధంలో మునిగి ఉన్న రష్యా, ఉక్రెయిన్ రాయబారులు కూడా వీరిలో ఉన్నారు. ఈ విషయాన్ని మహాకుంభమేళా ప్రత్యేక అధికారి విజయ్ కిరణ్ ఆనంద్ వెల్లడించారు. అమెరికా, బాంగ్లాదేశ్ రావాలని ఆసక్తితో ఉన్నారు. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నాయకత్వంలో జరుగుతున్న కుంభమేళా ఇప్పటికే ప్రపంచ వార్తగా మారుమోగుతున్నది. కుంభమేళ నిర్వహణ పట్ల ఆయన చూపుతున్న శ్రద్ధాసక్తులు ఎన్నో దేశాల వారి ప్రశంసలకు నోచుకున్నాయి. జపాన్, జర్మనీ, అర్మేనియా, స్లొవేనియా, హంగేరి, బెలారస్, సెహెచల్స్, మంగోలియా, కజకస్తాన్, ఆస్ట్రియా, పెరు, గౌటెమాలా, మెక్సికో, అల్జీరియా, దక్షిణాఫ్రికా, ఎల్‌సాల్వెడార్, చెక్ రిపబ్లిక్, బల్గేరియా, జోర్డాన్, జమైకా, ఎరిత్రియా, ఫిన్లాండ్, టునీసియా, ఫ్రాన్స్, ఎస్తోనియా, బ్రెజిల్, సూరినామ్, జింబాబ్వే, మలేసియా, మాల్టా, భూటాన్, లెసోథో, స్లోవాకియా, న్యూజిలాండ్, కంబోడియా, కిర్గిస్తాన్, చిలీ, సైప్రస్, క్యూబా, నేపాల్, రొమేనియా, వెనుజులా, అంగోలా, గయానా, ఫిజీ, కొలంబియా, సిరియా, గినియా, మైన్మార్, సోమాలియా, ఇటలీ, బోట్స్‌వానా, పరాగ్వే, ఐస్‌ల్యాండ్, లాట్వియా, నెదర్లాండ్స్, కామెరున్, కెనడా, స్విట్జర్లాండ్, స్వీడన్, థాయ్‌లాండ్, పోలండ్, బొలీవియా దేశాల రాయబారులు కుంభమేళాకు వస్తామని తెలియచేశారు. వీరంతా నావలలో వెళ్లి స్నానాలు చేసి బడే హనుమాన్, అక్షయవాత్ ఆలయాలను సందర్శిస్తారు. అక్కడ ఏర్పాటు చేసిన ఇతర ప్రదర్శనలను కూడా తిలకిస్తారు.

# విశ్వాసానికి

## చరిత్ర గమనాన్ని కుంభమే

**దక్షిణాఫ్రికా నుండి భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాత, మహాత్మా గాంధీ హరిద్వార్ కుంభమేళాలో రాజకీయ అరంగేట్రం చేశారు. 1915లో శాంతినికేతన్‌లో కొద్దిసేపు గడిపిన తర్వాత అదే ఆయన మొదటి కీలక ప్రజా ప్రదర్శన. దీర్ఘకాలం రచించిన పటిష్ట ప్రణాళికతో నిర్వహించే ఇతర కార్యక్రమాలతో పోలిస్తే, కుంభమేళా ప్రత్యేకంగా నిలుస్తుంది. చాలా కార్యక్రమాల మాదిరిగా దీనిని క్రమబద్ధీక రించడం సాధ్యం కాదు. అయినా ప్రతి 12 సంవత్సరాలకు ఒకసారి నిరాఘాటంగా జరుగుతుంది.**


దయానంద


గాంధీ

కుంభమేళా 12 సంవత్సరాల కాలచక్రాన్ని బట్టి నిర్ణయిస్తారు. సూర్యుడు, చంద్రుడు, బృహస్పతి జ్యోతిష స్థానాలను బట్టి ప్రత్యేకమైన అమరిక ద్వారా ఈ మహోత్సవానికి మార్గనిర్దేశం చేస్తారు. పురాణాలలోని అమృత మథన జ్ఞాపకాలను రేకెత్తించే ఈ గొప్ప సంఘటన నాలుగు పవిత్ర ప్రదేశాలలో తిరుగుతుంది: అవి– గంగ ఒడ్డున హరిద్వార్, శిప్రా తీరం ఉజ్జయిని, గోదావరి పుట్టుక స్థానం నాసిక్, గంగా, యమునా, సరస్వతి నదుల సంగమం ప్రయాగ్‌రాజ్.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న సన్యాసుల, హిందువుల పవిత్ర సమాజం కుంభమేళా తాత్వికతతో అనేక కోణాల నుంచి ముడిపడి ఉంది. ఇది లోతైన చారిత్రక, సాంస్కృతిక, నాగరికత, సామాజిక, రాజకీయ ప్రాముఖ్యం కలిగి ఉంది. మతపరమైన, ఆధ్యాత్మిక కోణాలు విస్తృతంగా గుర్తించినప్పటికీ, దీనికి ఇంకొన్ని సహజంగా చేకూరిన కీలక అంశాలు ఉన్నాయి. ఇవి అరుదుగా చర్చకు వస్తాయి. 2025 జనవరి–ఫిబ్రవరిలో మహా కుంభ్ ఘనంగా మొదలయింది. కాబట్టి, ఈ పవిత్ర సంగమం గురించి అంతగా చర్చకు రాని అంశాలను, ముఖ్యంగా దాని చారిత్రక, రాజకీయ ఔచిత్యాన్ని లోతుగా పరిశీలించడం మరింత ప్రయోజనం కలిగిస్తుంది.


**చరిత్రలో కుంభమేళా**

కాలానుగుణమైన నాగరికతకు సంబంధించి కుంభమేళా మూలాలను పురాతన కాలం నాటివిగా గుర్తించారు. మౌర్య, గుప్తుల కాలంలో దాని తొలి చారిత్రక జాడలు కనుగొన్నారు. ఆ జాడలు దాదాపు క్రీస్తుపూర్వం 4వ శతాబ్దం నుండి క్రీస్తుపూర్వం 6వ శతాబ్దం వరకు విస్తరించి ఉన్నాయి. కాలక్రమేణా, మహా కుంభమేళా మధ్యయుగ యుగంలో ఒక గొప్ప ఘట్టంగా పరిణామం చెందింది, రాజపోషణ, సాంస్కృతిక సంప్రదాయాల అభివృద్ధితో సుసంపన్నమైంది. ముఖ్యంగా దక్షిణాదిలో, చోళ, విజయనగర రాజవంశాలు ఈ పవిత్ర సంగమాన్ని విస్తరించి, మద్దతుగా నిలిచాయి.

వలసరాజ్యాల యుగం కుంభమేళాకు కొత్త కోణాన్ని తెచ్చింది, యూరోపియన్ పరిశీలకులు దాని గొప్పతనాన్ని నమోదు చేసి, ప్రత్యేకమైన చారిత్రక దృక్పథాలను అందించారు. తీర్థయాత్ర స్థాయి, వైవిధ్యంతో ఆకర్షితులైన బ్రిటిష్ వారు, మహా కుంభ మేళా పరిణామంపై అమూల్యమైన అంతర్దృష్టులను అందించే వివరణాత్మక వ్యాఖ్యలను అందించారు. వారిలో బ్రిటిష్ ఉద్యోగి జేమ్స్ ప్రిన్సెప్ ఒకరు. 19వ శతాబ్దంలో జరిగిన సంఘటనను నిశితంగా వివరించాడు. అక్కడ పాటించే ఆచారాలు, నిర్వహించే సమ్మేళనాలను, సంగమాన్ని నిర్వచించిన సంక్లిష్టమైన సామాజిక–మత గతిశీలతను స్పష్టంగా వివరించాడు.

కుంభమేళాతో సన్నిహిత సంబంధం ఉన్నది ప్రయాగ్వాల్ సమాజం. ఇది 1857 ప్రథమ స్వాతంత్ర్య సమరంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా ప్రతిఘటనను నిర్మించడంలో, దానిని కొనసాగించడంలో గణనీయమైన పాత్ర పోషించిందని వలసరాజ్యాల పురావస్తు శాఖ పత్రాలు వెల్లడిస్తున్నాయి. క్రైస్తవ మిషనరీలకు వలస ప్రభుత్వం మద్దతు ఇవ్వడాన్ని, హిందూ యాత్రికులను "అజ్ఞాన సహ–మతస్థులు"గా వారు ఈసడించడాన్ని ప్రయాగ్వాల్‌లు తీక్షణంగా వ్యతిరేకించారు. హిందూ యాత్రికులను క్రైస్తవ మతంలోకి మార్చడానికి జరిగిన దూకుడు ప్రయత్నాలకు వ్యతిరేకంగా కూడా వారు ప్రచారం చేశారు. తిరుగుబాటు సమయంలో, కల్నల్ నీల్ ప్రత్యేకంగా కుంభమేళా స్థలాన్ని లక్ష్యంగా చేసుకుని, ప్రయాగ్వాల్‌లు నివసించే ప్రాంతంపై కాల్పులు జరిపాడు. దీనిని చరిత్రకారుడు మాక్లీన్ "అలహాబాద్ లోని క్రూరమైన శాంతి"గా అభివర్ణించాడు.

1857 ఘటనకు సంబంధించిన ప్రణాళికలు మేళా వేళ చర్చించారని చారిత్రక రికార్డులు సూచిస్తున్నాయి. రాణి లక్ష్మీబాయి ప్రయాగలోని ఒక ప్రయాగ్వాల్‌తో కలిసి ఉన్నట్లు తెలుస్తోంది. తిరుగుబాటు సమయంలో కొత్వాలి సమీపంలోని ఒక చర్చిలోని పెద్ద ఇత్తడి గంటను ప్రయాగ్వాల్ పగలగొట్టడం ఒక ముఖ్య ఘటన. దీనితోనే అతడిని తరువాత బ్రిటిష్ వారు ఉరితీశారు. తరువాత చాలా



**జె.నందకుమార్**
ప్రజా ప్రవాహ జాతీయ కన్వీనర్

# అతీతంగా..

## ళా ఎలా పునర్నిర్మిస్తున్నది?



మాలవీయ

మంది ప్రయాగ్వాల్‌లను స్వాతంత్ర్య సమర యోధులుగా గుర్తించారు. వారి పేర్లు అధికారిక రికార్డులలో చేర్చారు కూడా. అంతేకాకుండా, ప్రయాగ్‌లోని మాఘ్, కుంభమేళాల వద్ద ఉన్న విస్తారమైన సమాజాలు బ్రిటిష్ అధికారులను నిరంతరం కలవరపెట్టేవి. ఎందుకంటే ఈ సమావేశాలు సామూహిక తిరుగుబాటును ప్రేరేపించేవి.

నియంత్రణను తిరిగి పొందిన తర్వాత, బ్రిటిష్ ప్రభుత్వం ప్రయాగ్వాల్‌లను తీవ్ర హింసకు గురిచేసింది. కొంతమందిని ఉరితీయగా, తగినన్ని ఆధారాలు లేకపోవడంతో, మరికొందరిని నిరంతరం వేధించారు. గంగా-యమున సంగమం సమీపంలోని కుంభమేళా భూములలో ఎక్కువ భాగాన్ని జప్తు చేసి ప్రభుత్వ కంటోన్మెంట్లలో చేర్చారు. తిరుగుబాటు తర్వాతి సంవత్సరాల్లో, ప్రయాగ్వాల్‌లు, కుంభమేళా యాత్రికులు ప్రతిఘటనను, వారు ఎదుర్కొన్న జాత్యహంకారపూరిత అన్యాయాలను సూచించే జెండాలను మోసుకెళ్లారు. బ్రిటిష్ మీడియా నివేదికలు తదుపరి కుంభమేళాలలో ఈ యాత్రికుల సమావేశాలనే శత్రుత్వంతో పోల్చాయి. వారిది 'అవిశ్వాసం'గా పరిగణించాయి. పాల్గొనేవారిలో కనిపించిన శాశ్వత ప్రతిఘటన స్ఫూర్తిని ప్రధానంగా వర్ణించాయి.

1857 సంగ్రామ నిర్వహణ గురించి మహర్షి దయానంద సరస్వతి జీవిత చరిత్రలు వాటిలో ఆయన కీలక పాత్రను స్పష్టంగా వివరిస్తాయి. 1855లో జరిగిన హరిద్వార్ కుంభమేళా నేపథ్యంలో ముఖ్యమైన సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. పిండిదాస్ జ్ఞాని రాసిన "1857కే స్వాతంత్ర్య సంగ్రామ్ మే స్వరాజ్య ప్రవర్తక్ మహర్షి దయానంద సరస్వతి కా క్రియాత్మక యోగదాన్" అనే రచన, కుంభమేళా సమయంలో దయానంద తిరుగుబాటు నాయకులను ఎలా కలిశారు? వారితో తిరుగుబాటుకు ఎలా ప్రణాళికలు రచించారో వివరణాత్మకంగా అందిస్తుంది. ఈ కారణంగా, 1857 స్వాతంత్ర్య సమరానికి ప్రధాన రూపశిల్పిగా మహర్షి దయానంద సరస్వతిని భావిస్తారు.

కుంభమేళాతో ముడిపడి ఉన్న మరో ముఖ్యమైన, పెద్దగా ప్రాచుర్యానికి నోచుకోని సంఘటన భారత దేశంలో మహాత్మా గాంధీ రాజకీయ అరంగేట్రం. జనవరి 1915లో ఆయన భారతదేశానికి తిరిగి వచ్చేశారు. శాంతినికేతన్‌ను సందర్శించిన తర్వాత ప్రజా బాహుళ్యంతో కలసి గాంధీ కనిపించిన మొదటి కార్యక్రమం హరిద్వార్ కుంభమేళా. తన ఆత్మకథలో హరిద్వార్ కుంభమేళాలో తన అనుభవాలను వివరించడానికి గాంధీజీ ఒక అధ్యాయాన్ని కేటాయించారు.

దక్షిణాఫ్రికాలో ఆయన చేసిన పని భారతదేశం అంతటా సాధారణ ప్రజలపై చూపిన తీవ్ర ప్రభావాన్ని ఆయన ఇక్కడే మొదటిసారి గ్రహించారు. "నా పని ఎక్కువ సేపు గుడారంలో కూర్చుని, నన్ను చూసేందుకు వచ్చిన అనేక మంది యాత్రికులను కలుసుకుని మతపరమైన, ఇతర చర్చలు జరపడం. ఇది నాకు నా స్వంతం అని చెప్పుకోగలిగే ఒక్క నిమిషం కూడా మిగిల్చలేదు. ఈ దర్శనార్థులు స్నానపు ఘాట్ వరకు కూడా నన్ను అనుసరించారు. నేను భోజనం చేస్తున్నప్పుడు నన్ను ఒంటరిగా వదిలి పెట్టలేదు. అందువల్ల దక్షిణాఫ్రికాలో నా వినయపూర్వకమైన సేవలు మొత్తం భారతదేశం అంతటా ఎంత లోతైన ముద్ర వేశాయో హరిద్వార్‌లోనే నేను గ్రహించాను" అని గాంధీజీ "ది స్టోరీ ఆఫ్ మై ఎక్స్‌పెరిమెంట్స్ విత్ ట్రూత్"లో రాశారు.

ఆసక్తికరంగా, గాంధీజీ హరిద్వార్ పర్యటన, ఆయన స్వాతంత్ర్యోద్యమ ప్రవేశంతో పాటు



**సెప్టెంబర్ 14, 1964, జాగృతి ముఖచిత్రం.. విశ్వహిందూ పరిషత్ ఆవిర్భావం సందర్భంగా హాజరైన ఎస్ఎస్ ఆప్టే, తారాసింగ్, స్వామి చిన్మయానంద, పరమ పూజనీయ గురూజీ, సంత్ తుక్‌డోజీ మహరాజ్, స్వామి శంకరానంద సరస్వతి.**

కుంభమేళాలో జరిగిన మరో చారిత్రాత్మక సంఘటన– అఖిల భారత హిందూ మహాసభ ఏర్పాటు. ఏప్రిల్ 1915న హరిద్వార్ కుంభమేళా సందర్భంగా జరిగిన సర్వదేశక్ (అఖిల భారత) హిందూ సభ ప్రారంభ సమావేశంలో గాంధీ, స్వామి శ్రద్ధానంద్, పండిట్ మదన్ మోహన్ మాలవీయ ఇతరులతో కలిసి పాల్గొన్నారు.

అదేవిధంగా, 1906లో ప్రయాగ్ కుంభమేళాలో సనాతన ధర్మ సభ సమావేశమై, పండిట్ మదన్ మోహన్ మాలవీయ నాయకత్వంలో బనారస్ హిందూ విశ్వవిద్యాలయాన్ని స్థాపించాలని నిర్ణయించడం గమనార్హం.

ప్రజలను ఉద్యుక్తులను చేయడంలో కుంభమేళాకు ఉన్న లోతైన ప్రభావాన్ని గాంధీజీ గుర్తించారు. 1918లో ప్రయాగ్ కుంభమేళాకు హాజరయ్యారు. ప్రాంతీయ రాష్ట్ర పురావస్తు శాఖ భద్రపరిచిన రికార్డులను బట్టి బ్రిటిష్ అధికారులు తమ నిఘా



నివేదికలలో ఈ కార్యక్రమంలో ఆయన ఉనికిని నమోదు చేశాయి. తన పర్యటన సందర్భంగా, గాంధీజీ అసంఖ్యాకంగా వ్యక్తులతో పాల్గొన్నారు, సంగమ సంప్రదాయాలను ఆచరించారు.

తరువాత సహాయ నిరాకరణ ఉద్యమం సమయంలో, ఫిబ్రవరి 10, 1921న ఫైజాబాద్‌లో జరిగిన బహిరంగ సభలో, గాంధీ తన కుంభమేళా సందర్శన గురించి ఆలోచించారు. తాను మొదట్లో అయోధ్య యాత్రకు ప్రణాళిక వేసినప్పటికీ, ప్రయాగ్ మేళాకు హాజరు కావడం ప్రాధాన్యం సంతరించు కుందని ఆయన వివరించారు. భారతదేశంలో బ్రిటిష్ పాలనను సవాలు చేయడంలో సహాయ నిరాకరణ ఉద్యమం కీలకమైనందున ప్రసంగంలో కుంభమేళా గురించి ఆయన ప్రస్తావించిన సందర్భాలు అంత ప్రమాదకరమైనవి కావు.

1947 వరకు భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో కుంభమేళా ఒక ముఖ్యమైన ఉత్ప్రేరకంగా కొనసాగింది. హిందుత్వ విప్లవకారుల సమావేశ స్థలంగా అవి పని చేశాయి. ఫిబ్రవరి 2, 1920 నాటి డైరెక్టర్ ఆఫ్ సెంట్రల్ ఇంటెలిజెన్స్ నుండి బ్రిటిష్ కాలం నాటి ఒక సమాచారం ఈ కీలక అంశాన్ని ప్రధానంగా వెలుగులోకి తెచ్చింది. అలహాబాద్ మ్యూజియంలోని ఒక పురావస్తు పత్రాల ప్రదర్శనలో ఉంచిన ఈ పత్రం, స్వాతంత్ర్య పోరాటానికి మేళా చేసిన సాయం గురించి కీలక సహకారాన్ని స్పష్టంగా వెల్లడించింది. 1918లో కుంభమేళా సందర్భంగా అలహాబాద్‌లో జరిగిన సమావేశంలో ఆమోదించిన ఒక స్మారక చిహ్నం గురించి ఇది మాట్లాడుతుంది, "ఈ స్మారక చిహ్నం కాంగ్రెస్, లీగ్ రాజకీయ సంస్కరణల పథకానికి మద్దతు ఇచ్చింది. ఈ డిమాండ్లు చేసింది:

గ్రామాల్లో రూ. 500 వరకు సివిల్ కేసులు, అన్ని నాన్–కాగ్నిజబుల్ క్రిమినల్ కేసులను పరిష్కరించ డానికి పంచాయతీలను వెంటనే ఏర్పాటు చేయాలి. పూర్తి బదిలీ చేయగల, వారసత్వ హక్కులతో శాశ్వత పరిష్కారం ప్రవేశపెట్టాలి. ఆదాయం, అద్దెను పెంచడం ఇంపీరియల్ కౌన్సిల్ అమలుకు లోబడి ఉంటుంది. జమీందార్ల ప్రత్యేక హక్కును తగ్గించడం, అద్దె చెల్లించనందుకు బహిష్కరణ చట్టాన్ని సవరించడం" అని ఫిబ్రవరి 17, 1918 నాటి రహస్య లేఖ పేర్కొంది.

"1918లో అలహాబాద్‌లో జరిగిన కుంభమేళా సందర్భంగా 300 మంది ప్రతినిధులు, 2,000 మంది సందర్శకుల సమావేశం ద్వారా ఈ స్మారక చిహ్నాన్ని స్వాగతించారు. దీనిని రైతులు ఎక్కువగా సందర్శిస్తారు. ఈ సమావేశం మధ్య పరగణాలు (నేటి ఉత్తరప్రదేశ్) రైతు సంఘం స్థాపనపై కూడా ఒక అంగీకారానికి వచ్చింది. ఇది ఇతర లక్ష్యాలతో పాటు, జమీందార్లు, కౌలుదారుల మధ్య పెరుగుతున్న వైరుధ్యాన్ని అరికట్టడానికి; పాలకులు పాలితుల మధ్య పరస్పర విశ్వాసం స్నేహాన్ని మరింతగా పెంపొం దించడానికి ప్రతిపాదించింది."

"...ఈ సంస్థకు మద్దతుగా, నిధుల కోసం విజ్ఞాపనలు చేశారు. డబ్బు వసూలు చేశారు. ఈ పని కలకత్తాలో జరిగిందని ఆ పత్రాలు చెబుతు న్నాయి. "జూన్ 1919లో మదన్ మోహన్ మాలవీయ చేసిన అటువంటి విజ్ఞప్తిలో, పంజాబ్, యునైటెడ్ ప్రావిన్స్‌లు, బిహార్, ఒరిస్సాలోని వివిధ గ్రామాలు, తహసీల్‌లలో అసోసియేషన్‌కు 450 శాఖలు 3,500 మంది సభ్యులు ఉన్నారని పేర్కొన్నారు. 1919 అంతా, యునైటెడ్ ప్రావిన్స్‌ల లోని అనేక జిల్లాల సమావేశాలు జరిగాయి. నిర్వాహకుల స్ఫూర్తిని వివరించడానికి ఈ నివేదికలను ఉదహరించవచ్చు" అని సారాంశం జోడించింది.

**స్వతంత్ర భారత్‌లో**

స్వాతంత్ర్యం తర్వాత కూడా, కుంభమేళా హిందుత్వ ఉద్యమాలకు కేంద్రంగా ఉన్న పవిత్ర సంగమంగా దాని ప్రాముఖ్యం నిలుపుకుంది. 1964లో, హరిద్వార్ కుంభమేళాలోనే విశ్వ హిందూ పరిషత్ ఆవిర్భవించింది.

భారతదేశంలో రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్యాన్ని రూపొందించడంలో కుంభమేళాలది కీలక పాత్ర. ఇందిరాగాంధీ విధించిన అత్యవసర పరిస్థితికి దాని ప్రతిస్పందన చాలా గొప్పది. ఇది స్వాతంత్ర్యానంతర భారత రాజకీయాలను ప్రభావితం చేయడంలో ఇది కీలక పరిణామం. సార్వత్రిక ఎన్నికలకు కొన్ని వారాల ముందు జరిగిన 1977 ప్రయాగ్ కుంభ్ రాజకీయ దృశ్యాన్ని గణనీయంగా ప్రభావితం చేసింది. ఈ సమావేశం కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా మద్దతును సమర్థవంతంగా పెంచింది. అత్యవసర పరిస్థితి నాటి అణచివేత రోజులకు ముగింపు పలికింది. సాధు సమాజ్ స్పష్టమైన మద్దతుతో బలోపేతం అయిన 1977 కుంభ్‌లో జేపీ ఉద్యమం గణనీయమైన ఎన్నికల ఊపును సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో ధర్మ సంసద్ (మత పార్లమెంట్) వివిధ సాధు సమ్మేళనాలు ఇందిరా గాంధీని భారత్‌కు శత్రువుగా బహిరంగంగా ప్రకటించాయి. హిందీ మాట్లాడే భూభాగం అంతటా జనతా పార్టీ మద్దతును స్థిరపరిచాయి.

కుంభమేళాను విస్తృతంగా డాక్యుమెంట్ చేసిన ప్రఖ్యాత జర్నలిస్ట్ మార్క్ టుల్లీ, 1989 కుంభమేళాను రామ జన్మభూమి ఉద్యమానికి ఒక నిర్ణయాత్మక క్షణంగా హైలైట్ చేశారు. తన అనుభవాన్ని ప్రతిబింబిస్తూ, టుల్లీ ఇలా రాశాడు: "నేను ఇంత ప్రశాంతమైన జనసమూహంలో ఎప్పుడూ లేను. అక్కడ ఎటువంటి ఉన్మాదం లేదు, కేవలం విశ్వాసం, ప్రశాంతమైన నిశ్చయం చేయవలసినది చేసుకోవడం మాత్రమే ఉంది."

కుంభమేళా భారత్‌పై తన ప్రత్యేక ప్రభావాన్ని చూపుతూనే ఉంది, దాని సామాజిక–రాజకీయ, సాంస్కృతిక ప్రకృతి దృశ్యాన్ని లోతైన శాశ్వత మార్గాల్లో నిర్వచిస్తుంది. మతపరమైన సమాజం కంటే, ఇది భారతదేశ చారిత్రక, సాంస్కృతిక రాజకీయ పథాన్ని నిరంతరం రూపొందించిన నాగరికత దృగ్విషయం. ప్రయాగ్‌రాజ్ మరొక మహా కుంభమేళాను స్వాగతిస్తున్నప్పుడు, ఈ కాలాతీత సంప్రదాయం స్థితిస్థాపకత, విశ్వాసం సాంస్కృతిక కొనసాగింపునకు నిదర్శనంగా నిలుస్తుంది. ఇది దేశ గతంపై దాని శాశ్వత ప్రభావాన్ని, ఆధునిక భారతదేశాన్ని రూపొందించడంలో దాని నిరంతర పాత్రను బలమైన జ్ఞాపకంగా నిలుపుతుంది.

అను: బీఎస్ శర్మ




# దావోస్‌లో భారత్ భేష్

**దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో ప్రపంచంలోని అగ్రశ్రేణి కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ఉత్సాహం ప్రదర్శించాయి. మన దేశం నుంచి వెళ్లిన రాష్ట్రాలు అద్భుతమైన విజయం సాధించాయి. సమష్టిగా సుమారు రూ.20 లక్షల కోట్ల పెట్టుబడుల కోసం ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. ఇందులో మహారాష్ట్ర ఏకంగా రూ.15.70 లక్షల కోట్ల విలువైన ఒప్పందాలు కుదుర్చుకుంది. తెలంగాణ రూ.1.78 లక్షల పెట్టుబడుల కోసం అవగాహన కుదుర్చుకోగా, ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ప్రమోషన్‌కు ప్రాధాన్యత ఇచ్చింది. ఈ సదస్సులో భారత్ ప్రదర్శన చాలా అద్భుతమన్నారు కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్. ప్రధాని మోదీ నేతృత్వంలో సాధిస్తున్న ప్రగతిని దావోస్ వేదికగా చాటి చెప్పారు.**

స్విట్జర్లాండ్‌లోని చిన్న పట్టణం దావోస్. ప్రతి ఏటా ప్రపంచ రాజకీయ నాయకులు, ఆర్థికవేత్తలు, పారిశ్రామిక దిగ్గజాలు, సామాజికవేత్తలు ఇక్కడికి వస్తారు. వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ఏటా జనవరి చివరి వారంలో నిర్వహించే సమావేశాల్లో వేర్వేరు ప్రభుత్వాల అధినేతలు పాల్గొని పెట్టుబడిదారుల నుంచి పెద్దమొత్తంలో పెట్టుబడుల్ని ఆకర్షిస్తుంటారు. ఈసారి జనవరి 20 నుంచి 24 వరకు కొలాబ్రేషన్ ఫర్ ది ఇంటిలిజెన్స్ ఏజ్ అనే థీమ్‌తో వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ 55వ వార్షిక సమావేశాలు జరిగాయి.

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, జర్మన్ ఛాన్సలర్ ఒలాఫ్ స్కోల్జ్, వర్చువల్‌గా ఈ సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న దాదాపు 60మందికి పైగా అగ్రశ్రేణి రాజకీయ నాయకులు సదస్సుకు తరలి వచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా 2500 మంది ప్రముఖులు సమావేశాల్లో పాల్గొన్నారు. 2025లో ప్రపంచం ఎదుర్కోబోయే ఆర్థిక సవాళ్ల కోసం అవసరమైన సూత్రాలు, విధానాలు, భాగస్వామ్యాలను రూపొందించడానికి, నమ్మకాన్ని పునర్నిర్మించడానికి కలిసి పని చేయడం దావోస్ ప్రపంచ ఆర్థిక ఫోరమ్ లక్ష్యం అని పేర్కొన్నారు నిర్వాహకులు. భారత్ నుంచి ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సుకు ఐదుగురు కేంద్రమంత్రులు, మూడు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజరయ్యారు. వీరిలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్, ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు నాయుడు, తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రులు అశ్విని వైష్ణవ్, సీఆర్ పాటిల్, రామ్మోహన్ నాయుడు, చిరాగ్ పాశ్వాన్, జయంత్ చౌదరి, ఏపీ మంత్రి నారా లోకేష్, తెలంగాణ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఇతర రాష్ట్రాలకు చెందిన మంత్రులు, 100 మందికి పైగా భారతీయ సంస్థల సీఈఓలు ఉన్నారు. మహారాష్ట్ర, తెలంగాణ, ఉత్తరప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలు దావోస్‌కు వచ్చాయి.


మన తెలుగు రాష్ట్రాలు దావోస్‌లో సందడి చేశాయి. చంద్రబాబు "బ్రాండ్ ఏపీ", రేవంత్ రెడ్డి "రైజింగ్ తెలంగాణ"లతో మెరిపించారు. పెట్టుబడుల సాధనే లక్ష్యంగా వరుసగా సమావేశాలు, చర్చలు, వ్యక్తిగత భేటీలు జరిగాయి. ప్రపంచ స్థాయి కంపెనీలు, సీఈవోలు, ముఖ్య అధికారులు, నాయకులతో అటు ఏపీ సీఎం చంద్రబాబు, ఇటు తెలంగాణ సీఎం రేవంత్ సమావేశమయ్యారు. తమ రాష్ట్రాల్లో పెట్టుబడులకు ఉన్న సానుకూలతను వివరించారు.

**తెలంగాణకు పెట్టుబడుల వెల్లువ**

దావోస్‌లో రూ. 1,78,950 కోట్ల పెట్టుబడులపై వివిధ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. గత పర్యటనలో రూ. 40,232 కోట్ల పెట్టుబడులు రాగా, ఈసారి నాలుగు రెట్లు పెరిగాయి. తాజా పెట్టుబడులతో దాదాపుగా 50వేల ఉద్యోగాలు రానున్నాయి. మొత్తం 20 సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. వీటి ద్వారా రాష్ట్రంలో 49,500కి పైగా ఉద్యోగావకాశాలు లభించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది.

తెలంగాణ ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకున్న 20 కంపెనీల్లో సన్ పెట్రో కెమికల్స్, అమెజాన్ వెబ్ సర్వీసెస్, కంట్రోల్ ఎస్, జేఎస్‌డబ్ల్యూ, స్కైరూట్ ఏరో స్పేస్, మేఘా ఇంజినీరింగ్, హెచ్‌సీఎల్, విప్రో, ఇన్ఫోసిస్, యునిలీవర్, టిల్మాన్ గ్లోబల్ హోల్డింగ్స్, ఉర్సా క్లస్టర్స్, బ్లాక్ స్టోన్, అక్షత్ గ్రీన్ టెక్, ఎక్లాట్ హెల్త్ సొల్యూషన్స్, సుహానా మసాలా, అజిలిటి, సిఫీ టెక్నాలజీస్, ఫీనిక్స్, రాంకీ గ్రూప్ ఉన్నాయి.

దావోస్ సమ్మిట్‌లో హైదరాబాద్‌లో ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యమివ్వడం, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆర్ఆర్ఆర్ నిర్మాణం, మెట్రో విస్తరణ ప్రణాళికలు ప్రపంచ దిగ్గజ పారిశ్రామికవేత్తలను అమితంగా ఆకట్టుకున్నాయి. ప్రభుత్వ 'తెలంగాణ రైజింగ్ 2050 విజన్' పెట్టుబడిదారులను ఆకర్షించడంలో కీలకంగా వ్యవహరించింది. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సరళతర పారిశ్రామిక విధానంతోపాటు ఇటీవల ప్రకటించిన క్లీన్ అండ్ గ్రీన్ పాలసీ ప్రపంచ పారిశ్రామికవేత్తల దృష్టిని ఆకర్షించింది. ఫలితంగా ఐటీ, ఏఐ, ఇంధన రంగాల్లో అంచనాలకు మించి నట్లుగా భారీ పెట్టుబడులను సాధించింది. అన్ని రంగాలకు అనుకూల వాతావరణమున్న హైదరాబాద్



**క్రాంతిదేవ్ మిత్ర**
సీనియర్ జర్నలిస్ట్

మహా నగరాన్ని పెట్టుబడులకు గమ్యస్థానంగా మరోసారి ప్రపంచానికి చాటిచెప్పింది.

**ఆంధ్రప్రదేశ్ బ్రాండ్ ప్రచారానికి ప్రాధాన్యత**

పెట్టుబడుల వేటకు దావోస్ వెళ్లిన ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్ ఏపీ బ్రాండ్ ప్రపంచానికి తెలిసేలా ప్రయత్నాలు చేశారు. ప్రపంచ పెట్టుబడుల సదస్సులో పాల్గొన్న ఆయన ప్రముఖ సంస్థల సీఈవోలు, అధిపతులు, పలు దేశాల ప్రతినిధులతో చర్చలు జరిపారు. వివిధ రంగాలకు చెందిన సుమారు 15 అత్యున్నత వాణిజ్య సంస్థల ప్రతినిధులతో సమావేశమయ్యారు. రాష్ట్రంలోని అవకాశాలను వారికి వివరించారు. కొత్త పారిశ్రామిక విధానాల్లోని సౌలభ్యాలను ప్రస్తావించి పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానించారు. రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలు.. పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాల గురించి ఈ సదస్సులో పారిశ్రామికవేత్తలకు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు వచ్చి ఇక్కడి అనుకూల పరిస్థితులను స్వయంగా వచ్చి పరిశీలించాలని పెట్టుబడిదారులను ఆహ్వానించారు.

**మహారాష్ట్రకు పెట్టుబడుల వెల్లువ**

దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో మహారాష్ట్ర ప్రభుత్వం రూ.




15.70 లక్షల కోట్ల విలువైన 61 అవగాహన ఒప్పందాల కోసం సంతకం చేసింది . మొత్తం పెట్టుబడిలో 98% విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల రూపంలో వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది.

**ఒకే వేదికపై చంద్రబాబు, రేవంత్, ఫడ్నవీస్**

దావోస్‌లో జరిగిన కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్ సమావేశంలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ పాల్గొన్నారు. దేశం ఒక యూనిట్‌గా పెట్టుబడులు రాబట్టేలా కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఎనర్జీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-ఏఐ, రక్షణ రంగంలో పెట్టుబడులకు సంబంధించిన కీలక అంశాలు చర్చకు వచ్చాయి. అంతర్జాతీయ కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టడం, వాటిపై రాష్ట్రాల ఆకాంక్షలు ఏ విధంగా ఉన్నాయి అనే అంశాలపై వారంతా చర్చించారు.

**ఈసారి కర్ణాటక గైర్హాజరు**

దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సుకు ప్రతి ఏటా వెళ్లే రాష్ట్రాల్లో కర్ణాటక ముందుంటుంది. అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలకు నెలవైన కర్ణాటక ప్రతి ఏటా కనీసం రూ.50 వేల కోట్లకు తగ్గకుండా పెట్టుబడులను సాధించుకునే ప్రయత్నం చేస్తుంటుంది. కానీ ఈసారి కర్ణాటక దావోస్ సదస్సుకు వెళ్లక పోవటం చర్చనీయాంశంగా మారింది. అయితే దావోస్ ఆర్థిక సదస్సు కంటే తమకు ఫిబ్రవరి 11న ప్రారంభించే ప్రపంచ పెట్టుబడిదారుల సమావేశమే కీలకమని ఆ రాష్ట్ర వాణిజ్య శాఖ స్పష్టం చేసింది. ★




# బుజ్జగింపుల

మతోన్మాదంతో ఉగ్రవాదానికి పాల్పడుతున్న వారు ఎవరో ప్రపంచ వ్యాప్తంగా ఉగ్రవాదానికి పాల్పడుతున్నదెవరో తెలిసినా, బాహాటంగా చెప్పే ధైర్యం సెక్యులరిస్టులకీ, ఉదారవాదులకీ లేదు. దానిని కప్పిపుచ్చి హిందువులకు ఆ మరక అంటించడానికి చిరకాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. కాషాయ ఉగ్రవాదమన్నాడో మూర్ఖ కాంగ్రెస్ హోం మంత్రి. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే అన్యమతస్తులను హిందూ పేర్లతో ప్రచారం చేసి హిందువులు ఉగ్రవాదులని, అసాంఘిక శక్తులని చూపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. పనికిమాలిన మీడియా అందుకు సహకరిస్తోంది. దేశాన్ని కుదిపేసిన 26/11 ముంబై ఉగ్రదాడులు, తాజాగా బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడిలో నిందితులను హిందువుగా చూపేందుకు సామాజిక మాధ్యమాలు ప్రయత్నం చేశాయి. కానీ వారు విదేశీయులనీ, అందునా ముస్లింలని వెల్లడయింది.

**సైఫ్‌పై దాడి ఎవరిది?**

బాలీవుడ్ స్టార్ హీరో సైఫ్ అలీఖాన్‌పై ఆగస్ట 16న అర్ధరాత్రి ఆగంతకుడు కత్తితో దాడి చేశాడు. నగరంలోని లీలావతి ఆసుపత్రికి తరలించి వైద్య సేవలందించడంతో అతడికి ప్రాణాపాయం తప్పింది. 12వ అంతస్తులో సీసీ కెమెరాల నిఘాలో భారీ భద్రత మధ్య ఉండే సినీనటుడిపై జరిగిన దాడిని రాజకీయంగా వాడుకునేందుకు మహారాష్ట్రలోని విపక్షాలు ప్రయత్నించాయి. నటుడిపై దాడి ఒక సంచలనం కావడమే ఇందుకు కారణం. నిందితుడిని ముంబై పోలీసులు వెంటనే అరెస్టు చేశారు. నిందితుడు విజయ్‌దాస్ అంటూ మొదట ఒకమాట వచ్చింది. పోలీసుల విచారణలో విజయ్‌దాస్ పెట్టుడు పేరని, అసలు పేరు మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షాజాద్ అని వెల్లడైంది. పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చినట్లు చెబుతున్నా, బాంగ్లాదేశీయుడని జోన్-1 డిప్యూటీ పోలీస్ కమిషనర్ దీక్షిత్ గెడమ్ చెప్పారు. షెహజాద్ 4 నెలల క్రితమే ముంబై వచ్చాడని, నగరం పరిసర ప్రాంతాల్లోనే నివసిస్తూ చిన్నచిన్న ఉద్యోగాలు చేస్తున్నాడని చెప్పారు. అతను ఓ రెస్టారెంట్‌లో వెయిటర్‌గా పని చేస్తున్నాడన్నారు. నిందితుడు తొలుత తాను కోల్‌కతా వాసినని చెప్పి దర్యాప్తు అధికారులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించాడు. అతని మొబైల్ ఫోన్‌లో బాంగ్లాదేశ్‌కు చెందిన అతని సోదరుడి నుండి అతని స్కూల్ లీవింగ్ సర్టిఫికేట్‌ను గుర్తించినట్లు పోలీసు అధికారి తెలిపారు.



సైఫ్ అలీఖాన్



మహ్మద్ షరీఫుల్

# బురదలో విపక్షాలు, ఆ మీడియా



**ఆర్‌ఎస్‌ఎస్‌పై దుష్ప్రచారం**

బాలీవుడ్ నటుడిపై దాడిని హిందువులపై రుద్దేందుకు సోషల్ మీడియాలో ప్రయత్నించారు. దుండగుడు రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్‌తో సంబంధం కలిగి ఉన్నాడన్న ప్రచారం సాగింది. 'ముస్లిం బాలీవుడ్ నటుడు, సైఫ్‌అలీఖాన్‌ను ఆర్ఎస్ఎస్ సభ్యుడు 6 సార్లు కత్తితో పొడిచాడు. అతను ఆసుపత్రిలో చేరాడు. భారతదేశంలో ముస్లింల పరిస్థితి!' అంటూ ఫేస్‌బుక్‌లో పోస్టు చేశారు. ఈ పోస్టును సైఫ్ అలీఖాన్ ఫోటోతో పాటు కొందరు వ్యక్తులు కుంకుమ పువ్వు ధరించి, కత్తులు పట్టుకుని ఉన్న చిత్రంతో షేర్ చేశారు. ఫ్యాక్ట్ చెక్‌లో ఇది అవాస్తవమని వెల్లడైంది.

**ముంబై దాడుల్లో పాకిస్తానీ**

హిందువులను ఉగ్రవాదులుగా చిత్రించే ప్రయత్నం ఇప్పటిది కాదు. 2008 నాటి ముంబై దాడులను హిందూ ఉగ్రదాడిగా చిత్రీకరించేందుకు లష్కరే తొయిబా కుట్ర పన్నిందని ముంబై మాజీ పోలీసు కమిషనర్ రాకేశ్ మరియా వెల్లడించారు. 26/11 ఉగ్రదాడిని హిందూ ఉగ్రవాద చర్యగా అభివర్ణించేందుకు పాకిస్తాన్ గూఢచార సంస్థ ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్ (ఐఎస్ఐ) కుట్రను తన 'లెట్ మీ సే ఇట్ నౌ' అనే పుస్తకంలో పొందుపర్చారు. ఇందుకు లష్కరే తొయిబా సాయం కూడా ఉంది. పాకిస్తాన్‌కు చెందిన మహ్మద్ అజ్మల్ అమీర్ కసబ్‌కు బెంగళూరులోని ఓ కళాశాల విద్యార్థి అంటూ ఓ గుర్తింపు కార్డు సృష్టించారు. బెంగళూరుకు చెందిన దినేష్ చౌదరి కుమారుడు సమీర్ చౌదరిగా గుర్తింపు కార్డుల్లో పేర్కొన్నారు. ముంబై పేలుళ్ల తర్వాత భుజాన బ్యాగ్‌తో తుపాకీ పట్టుకున్న కసబ్ చేతికి ఎర్రదారం కనిపించేలా ఉన్న ఒక ఫొటో వెలుగులోకి తెచ్చారు. లష్కరే తోయిబా పథకం సఫలమై ఉంటే, కసబ్‌ను హిందువుగా పేర్కొంటూ మీడియా బురద జల్లేదని ఆ పోలీస్ అధికారి పేర్కొన్నారు. కసబ్, తోటి రిక్రూట్ ఇస్మాయిల్‌ఖాన్‌తో కలిసి ముంబై దాడుల్లో 72 మందిని హతమార్చాడు. కసబ్ సజీవంగా దొరకడంతో అసలు విషయాలు వెలుగు చూసినట్టుగా ఆయన చెప్పారు.



కసబ్

కసబ్ ఉదంతంలో ఓ వాస్తవం వెల్లడైంది. భారతదేశంలో ముస్లింలకు నమాజ్ చేయడానికి అనుమతి లేదన్న ప్రచారాన్ని కసబ్ నమ్మాడు. భారత్‌లో మసీదులకు అధికారులు తాళాలు వేశారని భావనలో ఉన్నాడు. అదే విషయాన్ని నాటి ముంబై పోలీసు కమిషనర్ రాకేశ్ మరియాతో చెప్పాడు. దీంతో కసబ్‌ను సమీపంలోని మసీదుకు తీసుకెళ్లమని విచారణ అధికారి రమేష్ మహాలేకు చెప్పారు. ఆ మసీదులో కసబ్ నమాజ్ కూడా చేశాడు.

**కాంగ్రెస్ దుష్ప్రచారం**

తొలినుంచి హిందూ వ్యతిరేక విధానంతో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రతి అంశాన్నీ అందుకు వాడుకోవాలని ప్రయత్నించింది. ఆగస్టు 25, 2010 న నిర్వహించిన డీజీపీలు, ఐజీపీల వార్షిక సదస్సులో నాటి కేంద్ర హోంమంత్రి చిదంబరం మాట్లాడుతూ 'కాషాయ ఉగ్రవాదం' పదాన్ని వాడారు. గతంలో జరిగిన అనేక బాంబు పేలుళ్లలో 'కాషాయ ఉగ్రవాదం' ప్రమేయం ఉందన్నారు. దీనిపై పార్లమెంట్‌లో శివసేన నాయకుడు మనోహర్ జోషి నిలదీశారు. చిదంబరం తర్వాత కేంద్ర హోంమంత్రిగా బాధ్యతలు చేపట్టిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సుశీల్ కుమార్ షిండే 'కాషాయ ఉగ్రవాదం' అంటూ కూశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు 'కాషాయ ఉగ్రవాదాన్ని' వ్యాప్తి చేయ డానికి 'ఉగ్రవాద శిక్షణ' శిబిరాలను నిర్వహిస్తున్నాయని ఆరోపించాడు. దీనిపై దేశవ్యాప్తంగా హిందువుల నుంచి ఆగ్రహం వ్యక్తమవడంతో చివరికి క్షమాపణ చెప్పాడు. హిందువుల ఆగ్రహాన్ని గుర్తించిన కాంగ్రెస్ పార్టీ వివరణ ఇచ్చే ప్రయత్నం చేసింది. చిదంబరం, షిండేల వ్యాఖ్యలు పార్టీకి సంబంధం లేవని చెప్పుకు నేందుకు తంటాలు పడింది.

కాషాయరంగు స్వాతంత్ర్యోద్యమంతో ముడిపడి ఉందని, ఉగ్రవాదానికి రంగుతో సంబంధం లేదని నాటి కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, మీడియా సెల్ హెడ్ జనార్దన్ ద్వివేది వివరణ ఇచ్చుకున్నారు. నాటి కాంగ్రెస్ నేతల 'కాషాయ ఉగ్రవాదం'పై నేటికీ ప్రధాని మోదీ, ఇతర బీజేపీ నేతలు సందర్భం వచ్చిన ప్రతిసారీ విమర్శలు చేస్తూనే ఉన్నారు. హిందూద్వేషం వెళ్లగక్కడంలో కమ్యూనిస్టులూ తక్కువేం కాదు. కేరళలోని అయ్యప్పస్వామి ఆలయంలో బలవంతంగా మహిళలను పంపే ప్రయత్నాన్ని వ్యతిరేకిస్తూ హిందువులు ఆందోళన చేశారు. అధిక సంఖ్యలో మహిళలు ప్రదర్శనలు చేశారు. ఈ సందర్భంగా నాటి కేరళ మంత్రి, సీపీఎం నాయకుడు థామస్ ఐజాక్ అయ్యప్ప భక్తులందరినీ ఉగ్ర వాదులుగా అభివర్ణిస్తూ ట్వీట్ చేశాడు.

**మీడియాదీ అదే ధోరణి..**

నటుడు సైఫ్‌పై దాడి చేసిన వాడు బాంగ్లా దేశీయుడని, అతని పేరు మహ్మద్ షరీఫుల్ ఇస్లాం షాజాద్ అని పోలీసు అధికారులు స్పష్టంచేసిన తర్వాత కూడా, విజయ్‌దాస్‌గా వామపక్ష పత్రికల్లో వార్తల్లో కనిపిస్తోంది. బాంగ్లాదేశీయుడిగా గుర్తించామన్న మాటే ఆ వార్తల్లో లేకపోవడం వారి దృష్టి లోపానికి నిదర్శనం. సైఫ్‌పై దాడికి పాల్పడిన వ్యక్తి తరపున వాదించడానికి వచ్చిన న్యాయవాదుల వ్యవహారం పైనా నేషనల్ మీడియాలో వచ్చిన వార్తలు ఆసక్తి కరంగా ఉన్నాయి. అతడి తరపున వాదించ డానికి ఇద్దరు లాయర్లు పోటీపడడం విచిత్రం. తాను వాదిస్తానని ఒక లాయర్ చెబితే, వకల్తానామా తాను తీసుకుంటానంటూ మరో లాయర్ వచ్చాడు. నిరు పేదలకు ఉచిత న్యాయ సాయం అందించేందుకు ఓ ప్రక్రియ ఉంది. కానీ, బాంద్రా మేజిస్ట్రేట్ ఇద్దరికీ అవకాశమిచ్చినట్లు హిందూస్థాన్ టైమ్స్ పేర్కొంది. కాగా, దాడికి పాల్పడిన షాజాద్ బాంగ్లాదేశ్‌లో జాతీయ స్థాయి రెజ్లర్ పోటీల్లో పాల్గొన్నట్లు పోలీసుల మాట!



**హేమచందర్ కొలిపాక**

సీనియర్ జర్నలిస్ట్, 94400 21108



# ఏడడుగుల కండల బాబా

కుంభమేళాలో ఏడడుగుల ఎత్తుండి వస్తాదు తరహాలో కండలను కలిగి ఉన్న ఆత్మప్రేమగిరి మహరాజ్ అక్కడకు వచ్చినవారందరి దృష్టిని ఇట్టే ఆకర్షిస్తున్నారు. కాంతిమంతమైన ముఖవర్చస్సుతో, మహర్షితత్త్వం మూర్తీభవించినట్టుగా పొడువాటి కేశాలు, గడ్డం, నుదుటున నిలువెత్తు తిలకం, మెడ, భుజాలు, మణికట్టుకు అల్లుకున్న రుద్రాక్ష మాలలు, దేహాన్ని కప్పి ఉంచిన కాషాయ వస్త్రాలతో చిరునవ్వే ఆభరణంగా కనిపిస్తున్న ఆ సాధువును చూస్తుంటే ఆయనకు జన్మను ఇచ్చిన దేశం రష్యా అంటే ఓ పట్టాన నమ్మబుద్ధి కాదు. ఆత్మప్రేమగిరి మహరాజ్ అసలు పేరు ఎలెస్కి గార్సిన్. రష్యాలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుండేవారు. విదేశాల్లో పర్యటిస్తూ భారతదేశానికి వచ్చారు. సనాతనమైన హిందూ ధర్మం పట్ల ఆకర్షితులయ్యారు. అదే తన ధర్మమని స్వీకరించారు. నేపాల్‌లోని ఓ గుహలో 30 ఏళ్ల పాటు తపస్సు చేశారు. దాంతో ఎలెస్కి గార్సిన్ కాస్త ఆత్మప్రేమగిరి మహరాజ్‌గా రూపాంతరం చెందారు. ఈ స్వామీజీని శ్రీమహావిష్ణువు దశావతారాల్లో ఒకటైన పరుశురాముని కలియుగ అవతారమని పేర్కొంటూ ఆయన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆత్మప్రేమగిరి మహరాజ్ ఒక్కసారిగా ప్రపంచం దృష్టిలో పడ్డారు. కొందరైతే ఆయన దేహదారుఢ్యాన్ని చూసి కండలబాబా అని కూడా పిలుస్తున్నారు. హిందూ ధర్మ ప్రచారానికి తన జీవితాన్ని అంకితం చేసిన ఆత్మప్రేమగిరి మహరాజ్ జునా అఖాడాలో సభ్యులు. ప్రస్తుతం నేపాల్‌లో ఉంటున్నారు. ఎక్కడైనా కుంభమేళా జరుగుతుంటే ఆ పవిత్ర కార్యక్రమంలో పాల్గొని నేపాల్‌కు తిరుగుముఖం పడుతుంటారు. జపతపాదులతో పాటుగా దేహదారుఢ్యాన్ని కాపాడుకోవడానికి కసరత్తు చేయడం ఆయన నిత్యకృత్యంలో ఓ భాగం.


# నాగా సాధువు కావాలంటే..

ఓ మామూలు మనిషి నాగా సాధువు కావడమంటే అంత ఆషామాషీ వ్యవహారం కాదు. ముఖ్యంగా కుంభమేళా సమయంలో ఆసక్తి కలిగిన వారు నాగ సాధువులుగా మారడానికి దీక్ష చేపడుతుంటారు. ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళా వద్ద కూడా అనేకమంది నాగా సాధువులుగా దీక్ష తీసుకొని కనిపించారు. నాగా సాధువులుగా మారడానికి సామాన్యులు చేసుకునే దరఖాస్తులను మూడు స్థాయిల్లో పరిశీలిస్తారు. ఇదే విషయమై నిరంజన్ అఖాడా మహంత్ రవీంద్ర పూరి మాట్లాడుతూ మొత్తం 13 అఖాడాల్లో ఏడు శైవ అఖాడాలని వాటిలో ఆరు అఖాడాలు నాగా సాధువు దీక్షను అందిస్తాయని తెలిపారు. దరఖాస్తుల ద్వారా ఎంపికైనవారికి నిరంజని, ఆనంద్, మహానిర్వాణి, అటల్, జునా, ఆవాహన్ అఖాడాల్లో నాగా సాధువు దీక్షను సమకూరుస్తారు. అగ్ని అఖాడాలో కేవలం బ్రహ్మచారులు మాత్రమే ఉంటారు. అక్కడ నాగా సాధువు దీక్ష వసతి ఉండదు. మొదటి దశలో 300 నుంచి 400 మంది అపేక్షితులకు నిరంజని అఖాడాలో నాగా సన్యాసులుగా దీక్షను ఒసంగడం జరుగుతుందని మహంత్ రవీంద్ర పూరి తెలిపారు. ఆది గురువు శంకరాచార్యులవారు సన్యాసి అఖాడాల్లో నాగ సాధువులను తీర్చిదిద్దే సంప్రదాయానికి నాంది పలికారని జునా అఖాడాకు చెందిన హరిగిరిమహరాజ్ చెప్పారు. అయితే జునా అఖాడాలో దరఖాస్తుదారులు నాగా సాధువు దీక్షను చేపట్టడానికి కావలసినంత స్థలం లేదని తెలిపారు. అందుకని వారు పలు దశల్లో నాగా సాధుదీక్షను చేపడతారు. అయినప్పటికీ దీక్ష చేపట్టడానికి వేల సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. మహానిర్వాణి అఖాడా మహంత్ యమునపురి మహారాజ్ మాట్లాడుతూ తమ అఖాడాలో 300 నుంచి 350 మందికి దీక్షను ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.

సనాతన ధర్మం కోసం సర్వం త్యజించాలని ఆకాంక్షించేవారు మాత్రమే నాగా సాధువు కాగలరని అఖాడా పరిషత్ అధ్యక్షులు మహంత్ రవీంద్ర పూరి తెలిపారు. నమోదు ప్రక్రియ మొదలైందని, చీటీలు జారీ చేశామని, దరఖాస్తుదారుల ఇంటర్వ్యూలు కూడా జరుగుతున్నాయని ఆవాహన్ అఖాడాకు చెందిన ఒకానొక మహామండలేశ్వర్ చెప్పారు. ఎవరైతే నిర్దేశిత అర్హతలను కలిగి ఉంటారో వారికి మాత్రమే నాగ సాధువు దీక్షను అందిస్తారు. ఈ సన్యాసులు దీనికి సంబంధించిన క్రతువులు అంటే



# ఆధ్యాత్మిక యువత లక్ష్యంగా డిజిటల్ బాబా



ఓ చేతిలో స్మార్ట్ ఫోన్, మరో చేతిలో ట్రైపాడ్, మైక్‌లతో అత్యంత చురుగ్గా కుంభమేళాలో కనిపిస్తున్న ఓ యువబాబాతో సెల్ఫీ దిగడానికి, ఆధ్యాత్మికతకు సంబంధించి ఆయన చెప్పే మాటలు వినడానికి చిన్న పిల్లల నుంచి పెద్దల దాకా అందరూ పోటీపడుతున్నారు. ఆయనే డిజిటల్ బాబా. ఆధ్యాత్మిక గురువుగా స్వామి రామ్ శంకర్ దాస్. సోషల్ మీడియాలో ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తుంటారు. నెటిజన్ల సందేహాలను తీరుస్తుంటారు. డిజిటల్ బాబాకు ఫేస్‌బుక్‌లో దాదాపు 3.5 లక్షలు, యూట్యూబ్‌లో 30 వేలు, ఇన్‌స్టాగ్రామ్‌లో 14 వేలు, ఎక్స్‌లో 3,000 మంది ఫాలోవర్లు ఉన్నారు. బాబా అసలు పేరు రామ్ శంకర్ భట్. తన 19వ ఏట గోరఖ్‌పూర్ విశ్వవిద్యాలయంలో బీకామ్ డిగ్రీ మూడో సంవత్సరం చదువుతుండగా ఆధ్యాత్మిక బాట పట్టాలని, సాధువుగా మారాలని ఆయన నిర్ణయించుకున్నారు. 2008లో అయోధ్యలోని లోమేష్ రిషి ఆశ్రమ్‌లో స్వామి శశివచరణ్ దాస్ మహరాజ్ సమక్షంలో సన్యాసదీక్షను పొందారు. అనంతరం స్వామి రామ్‌చరణ్ దాస్‌గా అవతరించారు. గుజరాత్, హరియాణా, మహారాష్ట్ర, బీహార్, హిమాచల్ ప్రదేశ్, తదితర రాష్ట్రాల్లోని అనేక గురుకులాలు, ఆశ్రమాల్లో ఉపనిషత్తులు, శ్రీమద్ రామాయణం, భగవద్గీత లాంటి ఆధ్యాత్మిక గ్రంథాలను ఔపోసన పట్టారు. చివరకు హిమాచల్‌ప్రదేశ్‌లోని కంగ్రా జిల్లాలో సముద్రమట్టానికి 6 వేల అడుగుల ఎత్తున్న బైజ్‌నాథ్‌లో నాగేశ్వర్ మహరాజ్ దేవస్థానాన్ని తన ఆధ్యాత్మిక మార్గానికి గమ్యస్థానంగా ఎంచుకున్నారు. అక్కడే స్థిరపడిపోయారు. సనాతన ధర్మం, ఆధ్యాత్మికత గొప్పదనాన్ని యువతకు తెలియజేయాలని తాను లక్ష్యంగా పెట్టుకున్నట్టు డిజిటల్ బాబా తెలిపారు. అయితే సత్సంగాలకు చాలా కొద్ది మంది యువతీ యువకులు మాత్రమే హాజరవుతుండేవారని చెప్పారు. అయితే యువత ఎక్కువగా సోషల్ మీడియాలో ఉన్నారనే సంగతి తనకు చాలా ఆలస్యంగా తెలిసిందని తెలిపారు. అలా తెలిసినప్పటి నుంచి సోషల్ మీడియా ద్వారా తన ఆధ్యాత్మిక సందేశాలను వీడియోల రూపంలో, ఆడియోల రూపంలో యువతకు చేరవేస్తున్నట్టు చెప్పారు. ఈ క్రమంలో ఎలాంటి సిబ్బంది లేకున్నప్పటికీ వీడియోలను సొంతంగా చేసుకుంటున్నట్టు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ఎవరికి వారు ఆధ్యాత్మిక మార్గంలో తమను తాము తెలుసుకోవాలని, తద్వారా ఎలాంటి ఆకర్షణలకు లోను కాని స్థితికి చేరుకుంటారని, అలాగే జనన, మరణ చక్రానికి అతీతంగా జీవించ గలుగుతారని డిజిటల్ బాబా తెలిపారు. యువత ధర్మ సంస్కారానికి లోబడి జీవితాన్ని కొనసాగించాలని చెప్పారు.

శిరోముండనం, సొంత పిండదానంను గంగా నదీ తీరాన నిర్వహిస్తారని, అనంతరం పారిమార్థిక ప్రపంచంతో తమకెలాంటి సంబంధం లేదని వారు ప్రకటిస్తారని ఆయన తెలిపారు. దీక్ష చేపట్టినవారు మౌని అమావాస్యనాడు అమృత్ స్నాన్ చేయడంతో నాగ సాధువుగా అవతరించే ప్రక్రియ సంపూర్ణమౌతుంది. అంతకుమునుపు అర్హులైనవారు ఒక ధార్మిక పతాకం నీడన దిగంబరంగా నిలబడి ఉండగా ఆచార్య మహామండలేశ్వర్ వారు నాగా సాధువులుగా మారడానికి ఉపకరించే ప్రక్రియను చేపడతారు. అఖాడాకు సంబంధించిన సభాపతి అఖాడా నియమ నిబంధనలను వారికి తెలియపరుస్తారు. దీక్ష చేపట్టినవారంతా సదరు నియమ నిబంధనలను పాటిస్తామనే ప్రతినబూనుతారు. ఈ ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రతి ఒక్కరిని అమృత్ స్నాన్‌కు పంపిస్తారు. అయితే దరఖాస్తు చేసుకున్నవారందరూ నాగా సాధువులు కాలేరని, దరఖాస్తులను పరిశీలించేటప్పుడు వారిలో చాలా మంది అనర్హులుగా తేలుతారని మరో అఖాడాకు చెందిన మహంత్ తెలిపారు. మూడు దశల్లో జరిగే దరఖాస్తుల ప్రక్రియ ఆరు నెలల క్రితమే మొదలైందని చెప్పారు. అఖాడాకు చెందిన థానపతి అభ్యర్థుల నేపథ్యం, కార్యకలాపాల గురించి ఆరా తీస్తారు. అనంతరం ఆచార్య మహామండలేశ్వర్‌కు ఒక నివేదికను అందిస్తారని తెలిపారు. నివేదికను అందుకున్న అనంతరం మరోసారి పరిశీలించాల్సిందిగా అఖాడాకు చెందిన పంచాలను ఆచార్య మహామండలేశ్వర్ కోరుతారు. అభ్యర్థుల సమగ్ర పరిశీలన తర్వాత మాత్రమే వారిని నాగా సాధువులుగా మార్చే ప్రక్రియ మొదలౌతుంది. ప్రస్తుత కుంభమేళాలో 8,000 మంది నాగా సాధు దీక్షను చేపట్టారు.

# ఈ బాబాకు ముళ్లే పానుపు

కుంభమేళాలో కాంటేవాలే బాబా (ముళ్లతో కూడిన బాబా) అని పేరొందిన రమేష్ కుమార్ మాంఝీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ముళ్లపై పవళించిన ఈ బాబా భక్తులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేస్తున్నారు. తాను గురువును సేవిస్తుంటానని, గురువు తనకు జ్ఞానాన్ని, సంపూర్ణ శక్తిని ప్రసాదిస్తారని బాబా తెలిపారు. దైవకృపతో గడచిన 50 ఏళ్లుగా ప్రతి యేటా తాను ఇలా ముళ్లపై పడుకునే పని చేస్తున్నట్టు చెప్పారు. అలా చేయడం వల్ల తనకు ఎలాంటి గాయాలు కాలేదు సరికదా దేహానికి ఎంతో ప్రయోజనం చేకూరిందని తెలిపారు. తనకు వచ్చే దక్షిణలో సగ భాగాన్ని దానం చేసి మిగిలింది సొంత ఖర్చులకు వాడుకుంటానని కాంటేవాలేబాబా చెప్పారు.





# 45 రోజుల్లో 12 లక్షల మందికి ఉపాధి

ప్రయాగ్ రాజ్‌లో 45 రోజుల కుంభమేళా ద్వారా తాత్కాలికంగా 12 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతోంది. 8 లక్షల మందికి పైగా కార్మికులకు లబ్ధి చేకూరుతోంది. ఈ మేరకు ఎన్ఎల్‌బీ సర్వీసెస్ అనే ఓ గ్లోబల్ అండ్ డిజిటల్ టాలెంట్ సొల్యూషన్స్ ప్రొవైడర్ ఓ నివేదిక విడుదల చేసింది. సదరు నివేదిక ప్రకారం పర్యాటకం, రవాణా, లాజిస్టిక్స్, హెల్త్‌కేర్, ఐటీ, రిటైల్ రంగాలకు అనూహ్యమైన ప్రయోజనాలతో ప్రయాగ్‌రాజ్‌తో పాటుగా దాని పొరుగునున్న ప్రాంతాల్లో కూడా ఆర్థికాభివృద్ధి చోటు చేసుకుంటుంది. కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ – సీఏఐటీ ప్రకారం కుంభమేళా జరిగే 45 రోజుల్లో రూ.2 లక్షల కోట్లకు పైగా విలువైన ఆర్థిక లావాదేవీలు చోటు చేసుకుంటాయి. అనూహ్యమైన రీతిలో పలు రంగాల్లో ఉపాధి అవకాశాలు కలుగుతాయి.

# మారేడు రేడుకు 7.51 కోట్ల రుద్రాక్షలు

ప్రయాగ్‌రాజ్‌లోని సెక్టార్ 6లో శివ్‌నగరిలో 7 కోట్ల 51 లక్షల రుద్రాక్షలతో ప్రతిష్టించిన ద్వాదశ జ్యోతిర్లింగాలు పెద్ద సంఖ్యలో భక్తులను, సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రతి జ్యోతిర్లింగాన్ని 11 అడుగుల ఎత్తు, 9 అడుగుల వెడల్పు, 7 అడుగుల మందంతో నిర్మించడానికి తోడు రుద్రాక్షమాలలతో అలంకరించారు. జ్యోతిర్లింగాల రూపకల్పనకు అవసరమైన రుద్రాక్షలను దాదాపు 10 వేల గ్రామాల నుంచి సేకరించినట్టు రూపకర్త మౌని బాబా తెలిపారు. బంగ్లాదేశీ హిందువుల రక్షణ, ఉగ్రవాద నిర్మూలన లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపట్టినట్టు చెప్పారు. మొదటగా ఇనుప లోహంతో శివలింగాన్ని తయారు చేసి, ఆ శివలింగం చుట్టూ రుద్రాక్షలను పేర్చినట్టు తెలిపారు. దాదాపు 37 ఏళ్ల క్రితం రుద్రాక్షలతో జ్యోతిర్లింగాలను ప్రతిష్టించాలని తాను సంకల్పించినట్టు మౌనీ బాబా చెప్పారు. జ్యోతిర్లింగాల ఏర్పాటులో తెలుపు, నలుపు, ఎరుపు రంగుల్లో ఏకముఖి నుంచి 26 ముఖాల రుద్రాక్షలను వినియోగించినట్టు తెలిపారు. ప్రపంచంలోనే తొలిసారి అన్నట్టుగా మొత్తం రుద్రాక్షలతో శివ్‌నగరిని నిర్మించినట్టు చెప్పారు. ఇక్కడి శివలింగాల్లో ఆరు దక్షిణానికి అభిముఖంగా, మిగిలిన ఆరు ఉత్తర అభిముఖంగా ఉంటాయని తెలిపారు. ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా మహాకాళ్ శివలింగం దక్షిణానికి అభిముఖంగా ఉంటుందని మౌనిబాబా చెప్పారు. ఏకముఖి, ద్విముఖి





# కుంభమేళా భారతీయ సంస్కృతికి ప్రతిరూపం:

## బిహార్ గవర్నర్ ఆరిఫ్ మహమ్మద్ ఖాన్


మహా కుంభమేళా భారతీయ సంస్కృతికి ఆధారభూతమైన ఆదర్శాలకు ప్రతిరూపమని, అంతటి పవిత్రమైన ప్రాంతంలో అన్ని రకాల వైవిధ్యాలు సమసిపోతాయని, కులం, తదితర భేదాలు లేకుండా వచ్చినవారందరూ భక్తులేనని బీహార్ గవర్నర్ ఆరిఫ్ మొహమ్మద్ ఖాన్ అన్నారు.

ఇటీవల గుజరాత్‌లోని కుచ్‌లో సంస్కృతి ఫౌండేషన్, భారతీయ విచార్ మంచ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం మీడియాతో మాట్లాడుతూ కుంభమేళా సందర్భంగా అనేకమంది ఒకే చోట గుమి గూడినప్పటికీ వారందరూ ఒకే భావనతో ఉంటారని చెప్పారు. కుంభమేళాకు వచ్చిన సాధువులను వారి కులమేమిటని అడగరాదని చెబుతుంటారని అన్నారు.

అక్కడికి చేరుకున్నవారందరూ భక్తులేనని, ఇది భారతీయ సంస్కృతికి తార్కాణమని తెలిపారు. ఏకాత్మత భారతీయ సంస్కృతి, భారతీయ తత్త్వ చింతన, ధర్మాలకు అత్యున్నత ఆదర్శమైన ఏకాత్మత ప్రపంచానికి మార్గదర్శనం చేయగలదని బీహార్ గవర్నర్ అన్నారు.

మతం విచక్షణతో ధర్మాన్ని చూడని పక్షంలో భారతీయులమైన మనమందరం ప్రతి ఒక్కరిలోనూ భగవంతుని చూడగలమని తెలిపారు.

# త్రివేణి సంగమంలో యోగి పవిత్ర స్నానం



ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కుంభమేళాను పురస్కరించుకొని జనవరి 22 న ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణి సంగమం వద్ద పవిత్ర స్నానమాచరించారు. అంతకుమునుపు అదే రోజు 54 మంది మంత్రులతో మేళా అథార్టీ ఆడిటోరియంలో నిర్వహించ తలపెట్టిన మంత్రివర్గ సమావేశాన్ని భద్రతా కారణాల దృష్ట్యా, కుంభమేళాకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకూడదనే ఉద్దేశంతో అరయిల్‌లోని త్రివేణి సంకుల్‌కు మార్చారు. మంత్రివర్గ సమావేశానంతరం మంత్రులతో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బోట్లలో సీఎం యోగి అరయిల్ వీఐపీ ఘాట్ నుంచి త్రివేణి సంగమానికి చేరుకున్నారు. పూజలు చేసిన అనంతరం పవిత్రస్నానం ఆచరించారు. ఆయనతో పాటుగా ఉపముఖ్యమంత్రులు కేశవ్ ప్రసాద్ మౌర్య, బ్రిజేష్ పాథక్, తదితరులు స్నానమాచరించినవారిలో ఉన్నారు.



రుద్రాక్షలు అరుదుగా లభిస్తుంటాయని, తెల్లరంగులోని త్రిముఖి రుద్రాక్షలు కొన్ని ఎంపిక చేసిన ప్రాంతాల్లో మాత్రమే దొరుకు తుంటాయని తెలిపారు.

రుద్రాక్షల ప్రాముఖ్యతను వివరిస్తున్నట్టుగా నాలుగు ముఖాల రుద్రాక్ష పురుషార్థానికి అనుసంధానమైందని, ఐదు, ఆరు ముఖాల రుద్రాక్ష గృహస్తులకు ఉద్దేశించిందని, ఏడు ముఖాల రుద్రాక్ష విద్యార్థులకు ఎంతో మేలు చేస్తుందని, ఎవరికైతే ఎనిమిది, తొమ్మిది ముఖాల రుద్రాక్ష సిద్ధిస్తుందో వారి ఇంటి నుంచి అమ్మవారు లక్ష్మీదేవి నిష్క్రమించే ప్రసక్తే లేదని, 10, 11న ముఖాల రుద్రాక్ష వృత్తి, ఉద్యోగాల్లో పురోగతికి ఉపకరిస్తుందని మౌని బాబా చెప్పారు. రుద్రాక్షను కొనుక్కొని ధరించరాదని, ఎవరైనా బహుమతిగా ఇచ్చినప్పుడు మాత్రమే ధరించాలని తెలిపారు.

## 10 కోట్ల భక్తజనమేళా

ప్రయాగరాజ్‌లో అత్యంత పవిత్రంగా జరుగుతున్న కుంభమేళాకు వస్తున్న భక్తులు, సందర్శకుల సంఖ్య కోట్లలో ఉంటున్నది. అది ఏరోజుకారోజు పెరిగిపోతూనే ఉంది. కేంద్ర సాంస్కృతిక శాఖ విడుదల చేసిన గణాంకాల ప్రకారం జనవరి 14న కుంభమేళాకు విచ్చేసిన భక్తుల సంఖ్య 3.5 కోట్లు. ఆ తర్వాత 17న 7 కోట్లు, 18న 7.3 కోట్లు, 19న 7.7 కోట్లు, 20న 8.8 కోట్లు, 21న 9.2 కోట్లు, జనవరి 23న 10 కోట్లకు భక్తుల సంఖ్య చేరుకుంది.

## బడిపిల్లలకు కుంభమేళా పాఠాలు



మహాకుంభమేళా పాఠశాల పేరిట బడి పిల్లలకు కుంభమేళాల తాలూకు చారిత్రక, ధార్మిక ప్రాముఖ్యత పట్ల సమగ్రమైన అవగాహన కలిగించాలని ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఇందులో భాగంగా వారణాసిలో ప్రాథమిక పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు 10 పేజీల పుస్తకాన్ని అధికారులు పంపిణీ చేశారు. ఇదే విషయమై వారణాసి ముఖ్య అభివృద్ధి అధికారి – సీడీవో మాట్లాడుతూ "మహాకుంభమేళా చరిత్ర, నేటి వసతి సదుపాయాలు, మౌలిక సదుపాయాల కల్పన, భౌగోళిక ప్రాధాన్యతకు సంబంధించి ఒక సమగ్రమైన పుస్తకాన్ని మేం రూపొందించాం. రోజుకు 10 నుంచి 15 నిముషాలు చొప్పున మూడు వారాలపాటు పుస్తకంలోని అంశాలను విద్యార్థులకు బోధిస్తాం. బోర్డు పరీక్షలు రాసే విద్యార్థులను మినహాయించి ప్రతి ఒక్క విద్యార్థికి ఈ మహత్తరమైన ఆధ్యాత్మిక వేడుక పట్ల సమగ్రమైన అవగాహన కలిగేలా చూస్తాం" అని తెలిపారు. "కుంభమేళా అనేది ప్రపంచంలోనే ఎక్కువ మంది భక్తులు గుమిగూడే ఓ పవిత్రమైన వేడుక. ఆ క్రమంలో కుంభమేళా పట్ల పిల్లలకు సంపూర్ణ పరిజ్ఞానాన్ని కలిగించడంతో పాటుగా వారి ద్వారా వారి కుటుంబాలకు, వారి చుట్టుపక్కల ఉండేవారికి ఆ సమాచారాన్ని పంచే విధంగా విద్యార్థులను ప్రేరేపించడం లక్ష్యంగా మహాకుంభమేళా పాఠశాల కార్యక్రమాన్ని ప్రారంభించాం" ఆయన అని చెప్పారు.

కుంభమేళా పట్ల చక్కని అవగాహన సంతరించుకున్న విద్యార్థులకు సర్టిఫికేట్లు ప్రదానం చేస్తామని అధికారులు తెలిపారు. తద్వారా భారతీయ సంస్కృతీ సంప్రదాయాల వారసత్వాన్ని తర్వాతి తరాలకు అందుతుందనే ఆశాభావాన్ని వారు వ్యక్తం చేశారు. ★

## కథ

చుట్టూ గంభీరమైన వాతావరణం నెలకొని ఉంది. ఎంతో మంది సైనికులు ఆశీనులై ఉండగా.. అమర వీరుల పరాక్రమాలకు గుర్తుగా ఇచ్చే 'మహావీర చక్ర, పరమ వీర చక్ర' అవార్డుల ప్రదానం జరుగుతోంది. అవార్డ్ స్వీకరించడానికి భారతిని వేదిక పైకి పిలవగానే వేదిక ఎదురుగా ఆశీనులైనవారు, వేదికపై ఆశీనులై ఉన్న ఆఫీసర్స్ అంతా గౌరవ సూచకంగా లేచి నిలబడ్డారు.

లేత రంగు చీరకట్టుతో నుదుట స్టిక్కర్ బొట్టుతో నిండా ఇరవై ఆరేళ్లు కూడా నిండని యువతి కుర్చీ లోంచి లేచి హుందాగా, గర్వంగా చిరునవ్వుతో నడుచుకుంటూ వేదిక పైకి వెళ్తుంటే.. అమరవీరుల త్యాగాలను పొగుడుతూ, అవార్డ్ ప్రదాన కార్యక్రమాన్ని చూడటానికి ఆమె పుట్టింట్లో టీవీ ముందు తల్లిదండ్రులతో పాటు, దూరపు బంధువు దమయంతి కూడా కూర్చుని ఉంది.

ఆమె మెల్లగా గొంతు సవరించుకుని, భారతి తల్లి లీలావతితో.. 'దీనికి భర్త పోయాడన్న స్పృహ అసలుందా..? ఏమీ జరగనట్టే.. నవ్వుతూ పోతోంది. మొగుడుపోయి కొన్నాళ్లు కూడా కాలేదు. ఉత్తప్పుడు కాకపోయినా, ఇలాంటి చోటైనా కాస్త బాధ పడాలి కదా! లేకుంటే జనం ఏమనుకుంటారు? దీనికి మొగుడంటే ప్రేమ లేదనో! లెక్క లేదనో అనుకోరా..?' అంది.

ఆవిడ మాటలకు లీలావతి వస్తున్న కన్నీటిని అదిమి పెట్టుకోలేక కళ్లు మూసుకుంది. అయినా సరే పొంగి పొరలే ప్రవాహాన్ని ఆపేందుకు కట్టిన ఆనకట్ట లాకులలోంచి వరద నీరు చిమ్మినట్టు, మూసిన ఆమె కనురెప్పల చివర్నుంచి కన్నీటి చుక్కలు టపటపా రాలి పడుతుంటే చూసిన దమయంతికది చాలనిపించింది.. ఆమె అహం చల్లార్చుకోటానికి..

"ఎవరు మాత్రం ఊహించ గలం వదినా ఇలా జరుగుతుందని.." అని అంది లీలావతి.

"నేను ముందే చెప్పానుగా.. ఈ పెళ్లి వద్దు.. జరగరానిది జరిగితే బాధ పడేది మీరేనని! భారతి జీవితం మోడువారి పోవాలని రాసి పెట్టి ఉండబట్టే, ఇలాంటి దిక్కుమాలిన ఆలోచనలు మీకు వచ్చాయి. పోనీ అయిందేదో అయింది జరగబోయేదాని గురించి ఆలోచించాలి కదా! ఏదో పెద్ద మనసు చేసుకుని 'మన బంధువు ఒకాయన రెండవ పెళ్లి చేసుకోవాలి అనుకుంటున్నాడు, మన భారతినిచ్చి చేద్దామ'ని నేను అనగానే, అది నన్ను కొట్టినంత పని చేయబోయింది. అయినా మీరాపలేదు. మీ ఖర్మ ఎవరేం చెయ్య గలరు?" తన మాట విననందుకు ఇలా జరిగింది చూడు.. అన్నట్టు అంది దమయంతి. నిజమే.. ఆమె భారతి నిశ్చితార్థ జరిగే రోజున ఈ పెళ్లి వద్దనే చెప్పింది.

భారతి మంచి కోసం కాకపోయినా.. వంక పెట్టడానికి నోటి దురదతో దమయంతి అన్న మాటలు గుర్తుకొచ్చాయి లీలావతికి.

"ఏంటీ.. మీ కూతురికి ఆ ఆర్మీ సంబంధం చేస్తున్నారా?వాళ్లు మా తమ్ముడి కూతుర్ని కూడా అడిగారు. కానీ మేమే ఒప్పుకోలేదు. రేపెప్పుడైనా యుద్ధం వస్తేనో.. జరగరానిది జరిగితేనో.. పిల్లలపై ప్రేమున్నవాళ్లెవరైనా ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటారా? పోనీ కట్న కానుకలు ఇవ్వలేని పరిస్థితిలో ఉన్నారా.. అంటే అదీ కాదాయె.. కావల్సినంత ఉందిగా.. ఇలాంటి సంబంధాలను డబ్బు లేనోళ్లో.. పెళ్లిళ్లు కుదరకపోతేనో.. ఏదొక వంక ఉంటేనో చెయ్యాలి కానీ.. ఏది ఏమైనా మీ పిల్లకు మీరు అన్యాయం చేస్తున్నారు" చేతులు చిత్రంగా తిప్పేసుకుంటూ, కింది పెదిమ మాటిమాటికి విరుస్తూ అంది దమయంతి

"మేము కూడా ఆ విధంగా భయపడ్డ మాట నిజమే కానీ మా భారతి.. పెళ్లి చూపులప్పుడు అతని ఫ్యామిలీని చూసి, వాళ్లందరితోనూ మాట్లాడిన తర్వాత 'చేసుకుంటే ఈ పెళ్లే చేసుకుంటాను, బతికితే అలాంటి కుటుంబంతోనే బతకాలి, చస్తే అంత గొప్పింటి కోడలిగానే చావాలి' అంది. ఇక భయపడడానికేమీ లేదని..మేమూ ఒప్పుకున్నాము" అంది లీలావతి.

"సరే.. మీ పిల్లా మీ ఇష్టం.. దాని జీవితాన్ని కాపాడుకున్నా, కడతేర్చుకున్నా.. మీ చేతుల్లోనేగా.. కందకు లేని దురద కత్తిపీటకెందుకు? మీ ఏడుపు మీరేడవండి.. మా తమ్ముడు కాబట్టి నేను చెప్పినట్టూ విని బిడ్డని గోతిలో పడకుండా కాపాడుకున్నాడు' తన మాట లెక్క చెయ్యనందుకు అక్కసుగా అంది దమయంతి.

అప్పుడే అక్కడికి వచ్చి ఆమె మాటలు విన్న భారతి అన్న సుభాష్.. "అత్తయ్యా.. మేము పిలవగానే నిశ్చితార్థానికి వచ్చినందుకు చాలా కృతజ్ఞతలు.. మీరు ఇలాంటి అశుభాలు మాట్లాడకుండా.. భోంచేసి వెళితే మరీమరీ కృతజ్ఞతలు.." అంటూ కోపంగా రెండు చేతులూ జోడిస్తే.. అతనిని వారించింది లీలావతి.

అన్నీ గుర్తు తెచ్చుకున్న లీలావతి పైట చెంగు



**భండారు సదాశివరావు స్మారక దీపావళి కథల పోటీకి ఎంపికైనది**

నోటికడ్డం పెట్టుకుని లేచి లోనికి వెళ్లబోయి, అల్లుడు పోయినప్పుడు తను కూతుర్ని పట్టుకుని ఏడుస్తుంటే, కూతురు భారతి అన్న మాట గుర్తుకొచ్చి, మళ్లా మర బొమ్మలా సోఫాలో కూర్చుండి పోయింది. 'అమ్మా.. స్వరాజ్ పోయినందుకు బాధ ఉంది కానీ అంతకన్నా ఎక్కువ గర్వంగా ఉంది. ప్రతి వాళ్ల దగ్గరా 'నా కూతురి బతుకు అన్యాయమైపోయింది' అంటూ కన్నీళ్లు కార్చి, అతని వీర మరణాన్ని అవమాన పరిస్తే... నేను చచ్చినంత ఒట్టే' అన్న కూతురి మాటలు మననం చేసుకుని టీవీ వైపు చూస్తూ..

దమయంతి ఇంకేదో మాట్లాడబోతుంటే.. 'ఉష్..' అంటూ తన రెండు పెదవులపైనా చూపుడు వేలు పెట్టి చూపించింది.

"భలే మనుషులే మీరు.. ఈ కొంపలో చావు కూడా పండుగే అనుకుంటా.. చచ్చినాడి పేరు మీద ఏవో బహుమానాలిస్తుంటే..అది సంతోషంగా తీసుకోవడమూ.. మీరు చంకలు గుద్దుకుంటూ సినిమా చూస్తున్నట్టు చూడడం విడ్డూరంగా ఉంది" అంటూ.. అందరి వంకా కొరకొరా చూసి, ఇక తాను చూడాలనుకున్న దుఃఖం ఆ ఇంట్లో కనిపించదులే అనుకుంటూ సోఫాలోంచి లేచి వెళ్లబోయి టీవీ వైపు చూసి ఆగింది.


అవార్డ్ ప్రదానం జరిగాక, సైనిక వందనం స్వీకరించిన భారతిని మీడియావాళ్లు ఇంటర్వ్యూ చేస్తుంటే వాళ్లతో భారతి అంటున్న మాటలు వింటూ మళ్లీ కూర్చుండిపోయింది.

'ఇంత చిన్న వయస్సులో భర్తను పోగొట్టుకున్నారు కదా.. ఒంటరివారైనందుకు మీకు బాధ లేదా? మీ ముఖంలో విషాద ఛాయలు కనిపించడం లేదు.. ఎంతో ప్రశాంతంగా కనిపిస్తున్నారు' అని ఓ జర్నలిస్ట్ ప్రశ్నకు భారతి నోరు విప్పింది.

అతి స్పష్టంగా శ్రావ్యంగా ఉన్న ఆమె గొంతు నుండి వెలువడే మాటలు వింటూ.. అక్కడ వేదిక వద్దనున్న వారు కూడా బొమ్మల్లా చెవులప్పగించి కన్నార్పకుండా చూస్తుంటే.. ఆమె వాగ్ధాటి సాగిపోతోంది.

# భారతి అనే నేను

**దుద్దుంపూడి అనసూయ**



'స్వరాజ్ అమరులయ్యారనే మాట వినగానే నా ప్రాణాన్ని వదిలేయాలన్నంత బాధ కలిగిన మాట వాస్తవం, కానీ ఆయన దేశ సరిహద్దులలో కావలికి వెళుతూ.. ఒక విషయం చెప్పారు.

'ఇప్పటికీ భారతీయులందరికి గుండె దడ పుట్టిస్తున్న పందొమ్మిది వందల తొంభై తొమ్మిదవ సంవత్సరంలో జరిగిన కార్గిల్ యుద్ధంలో విజయం సాధించాక తోటి సైనికుని కాపాడబోతూ ఓ పాకిస్తాన్ సైనికుడు వెనుక నుండి పేల్చిన తుపాకీ గుండుకు వీర మరణం పొందిన కెప్టెన్ విక్రమ్ బాత్రా గారి నేతృత్వంలో పదమూడవ బెటాలియన్లో మా నాన్న కూడా పని చేశారు.

ఆ యుద్ధంలో మా నాన్న వీర మరణం పొందకముందే, మేజర్ పద్మ పాణీగారు వారి నాన్నగార్కి రాసినట్టుగానే మా నాన్న కూడా అమ్మకు ఒక ఉత్తరం రాశారు.. 'దేశం కోసం నేను పోతే ఇంట్లో ఎవరైనా కన్నీరు పెట్టారంటే నా ఆత్మ శాంతించదు. ధైర్యంగా బతుకుతూ, నా కొడుకుకు ప్రాణం కంటే దేశం గొప్పదనే వాస్తవం అర్థమయ్యేలా పెంచు' అని, మా



**భారత భూభాగంలోకి చొచ్చుకు వచ్చే చొరబాటుదారుల నుండి మన భూమిని కాపాడటానికి రాత్రనకాపగలనకా, ఎముకలు కొరికే చలిలో, సరైన నిద్రాహారాలు కూడా లేకుండా పహారా కాస్తూ, శత్రుమూకలతో పోరాడి చిందించిన ఆయన రక్తం భారతమాత పాదాలను అభిషేకించిన తీరు, భవిష్యత్తులో ప్రతి తల్లీ, పెరిగే తన పిల్లలకు మార్గదర్శకంగా ఈ యుద్ధవీరుని కథ వినిపిస్తూనే ఉంటుంది. విద్యార్థులు పాఠ్య పుస్తకాలలో చదువుకుని ఉత్తేజితులౌతారు.**

అమ్మ నన్నాలాగే పెంచింది. నువ్వూ మా అమ్మ నుండి అలాంటి విషయాలు నేర్చుకుని,నన్నర్థంచేసుకో' అని నా నుండి వీడ్కోలు తీసుకునేటప్పుడు మాట తీసుకున్నారు.

అందుకే నా స్వరాజ్ ఆత్మశాంతికై నా కంట నీరు రానీయ లేదు. అయినా.. ఒక మామూలు మనిషి మరణిస్తే.. ఏడవాలి. ఎందుకంటే..ఆ మనిషి మరి కనిపించడని, ఆ గొంతు వినిపించదని. కానీ నా భర్త స్వరాజ్ లాంటి వీర సైనికుడు మరణించడు. తాను కాపాడిన భూమి భారతి ఉచ్ఛ్వాస నిశ్వాసాలలో, ఆయన రూపు మనసంతా నింపుకున్న నా ప్రతి ఆలోచనలలో ఆయన ఎప్పటికీ బతికే ఉంటారు. భౌతికంగా ఆ రూపు కనిపించక పోవచ్చు.. కానీ ఈ దేశ ప్రజలందరి గుండెలలో ఆయన బొమ్మ ముద్రించుకునే ఉంటుంది.

భారత భూభాగంలోకి చొచ్చుకు వచ్చే చొరబాటు దారుల నుండి మన భూమిని కాపాడటానికి రాత్రనకా పగలనకా, ఎముకలు కొరికే చలిలో, సరైన నిద్రాహారాలు కూడా లేకుండా పహారా కాస్తూ, శత్రుమూకలతో పోరాడి చిందించిన ఆయన రక్తం భారతమాత పాదాలను అభిషేకించిన తీరు, భవిష్యత్తులో ప్రతి తల్లీ, పెరిగే తన పిల్లలకు మార్గ దర్శకంగా ఈ యుద్ధవీరుని కథ వినిపిస్తూనే ఉంటుంది. విద్యార్థులు పాఠ్య పుస్తకాలలో చదువుకుని ఉత్తేజితులౌతారు.

ఆయనతో నేను పంచుకున్న జీవితం రెండు నెలలు మాత్రమే. కానీ ఎన్ని జన్మలైనా ఆయన భార్యగానే జన్మించాలని, ఆయన మార్గంలోనే నడవాలని ఆశ పడుతున్నాను. 'చిన్న వయస్సు కదా.. మరో పెళ్లి చేసుకుని సుఖంగా సంసార జీవితాన్ని గడుపుతూ ఆనందంగా ఉండు' అని నా బంధువులంతా సలహా ఇచ్చారు.

అసలైన ఆనందం అంటే ఎందరికి తెలుసు? ఒకే గదిలో ఒకే మంచంపై ఒక్కటిగా ఉంటూ, ఎవరికి వారు వేరు వేరు ఆలోచనలతో ఉండి, ఎవరి కలలు వారు కనడం కాదు.

విడివిడిగా వేరు వేరు లోకాలలో ఉన్నా గాని ఒకే ఆలోచనతో గడపడం.. ఒకే కల కనడం.. అదీ దేశ భద్రత కావడం అసలైన ఆనందకరమైన విషయం. నా అత్తింటి నుండి నేను తెలుసుకున్న గొప్ప విషయం ఇది.

ప్రతి మనిషి ఎప్పటికైనా ఈ లోకాన్ని వదిలి పోవాల్సిందే.. కానీ చాలా మంది చిన్న చిన్న అపార్థాలతోనో.. చిన్న చిన్న సమస్యలతోనో ఆత్మ హత్యలు చేసుకుంటూ విలువైన జీవితాన్ని వృథాగా ముగిస్తున్నారు. కానీ దేశ రక్షణ ఒక్కటే అసలైన సమస్యగా ప్రతి భారతీయుడు భావించాలి. దేశ ప్రజల క్షేమం కోసం పరాయి దేశపు దురాక్రమణ దారులను, వారికి సహాయపడే ఉగ్రవాదులను అణిచి వేసే పోరాటంలో ధైర్యంగా మృత్యువుని ఆహ్వానించడం అన్నది గొప్ప విషయం.

తన మనవడితో కలసి నన్ను పెళ్లి చూపులు చూసుకోవడానికి వచ్చిన మా అత్తగారి అత్తగారు తొంభై ఏళ్ల లక్ష్మీబాయమ్మ గారు తమ కుటుంబం గురించి నాకు విడమరచి ఇలా చెప్పారు.

'స్వాతంత్రోద్యమ సమయంలో గాంధీ గార్కి నిధి సమకూర్చటం కోసం తన ఒంటి మీద ఉన్న కంటె, గాజులు, కడియాలు ఇచ్చేసిన మా అత్తగారైన సుబ్బరాజమ్మ గారు.. నన్ను పిలిచి, 'లక్ష్మీ! దేశ స్వాతంత్ర్య నిధి కోసం నాకు చేతనైన సాయం చేశాను.. మరి నీ వంతుగా దేశం కోసం నువ్వేమిస్తావు' అని అడిగారు. వెంటనే నేను నా పుట్టింటి నుంచి తెచ్చిన నగలతో పాటు, నా చేతి కున్న నిశ్చితార్థపు ఉంగరం కూడా ఇచ్చేసి, 'అత్తమ్మా మీరొప్పుకుంటే బారిష్టర్ చదవడానికి లండన్ వెళ్లిన మీ అబ్బాయిని కూడా ఇచ్చేస్తాను.. పిలిపించండి' అన్నాను. అప్పుడు నా వయస్సు పదిహేనేళ్లు.

ఆ విధంగా దేశ స్వాతంత్ర్యం కోసం నా బంగారంతో పాటు, బంగారం లాంటి నా భర్తనిచ్చేశాను. బ్రిటీష్ వారి తుపాకులకు ఎదురొడ్డి నిలబడిన ఆయన విశాల హృదయానికి జోహారులర్పించాను. ఆ తరువాత వచ్చిన స్వాతంత్ర్యం అనుభవించడానికి నా కుటుంబానికీ అర్హత ఉందని భావించాను. అయితే సంతానం లేని నేను ఈ దేశ స్వాతంత్ర్యాన్ని కాపాడ గలిగే ఓ వారసుడిని తయారు చెయ్యడం కోసం నా నలభై ఏళ్ల వయస్సులో ఓ పిల్లాడ్ని దత్తత తీసుకుని సైన్యంలో చేర్పించాను.

దేశ భద్రత కోసం నా కోడలు ఆనంది తన భర్తని యుద్ధానికి ధైర్యంగా పంపించడమే కాకుండా, కార్గిల్‌లో భర్త వీరమరణం చూసి కూడా తన బిడ్డ స్వరాజ్‌ను ఆనందంగా సైన్యంలోకి పంపించిన గొప్ప వీర వనిత' అని చెప్పి, చివరిగా నన్నొక ప్రశ్న అడిగారు.

'మరి ఈ దేశం కోసం నువ్వేమి చెయ్యగలవు? నువ్వేమి ఇవ్వగలవు?' అని. ముందు నాకేం చెప్పాలో తెలియలేదు.

నా చిన్నప్పుడు బడిలో మా మాష్టారు మరియన్ గారు ఓ విద్యార్థి 'దేశాన్నెందుకు ప్రేమించాలి? దేశం మనకేమిచ్చింది?' అని అడిగిన ప్రశ్నకు జవాబుగా 'దేశం నువు బతకడానికి చోటిచ్చింది, భారతీయుడనని చెప్పుకోవడానికి అర్హతనిచ్చింది. ఇంకేమివ్వాలి?' అని చెప్పిన మాట గుర్తు కొచ్చి, నేనామెకు సమాధానంగా

'అమ్మమ్మా.. నేను నీ మనవడి బాటలో నడుస్తాను.. నా వృత్తి ఉపాధ్యాయిని కాబట్టి, నా విద్యార్థులకు దేశ భక్తి పాఠాలుగా చెప్పి, ప్రతి ఒక్కరు ఇంజనీర్లుగానో.. డాక్టర్లుగానో, లాయర్లుగానో ఉండాలని కలలు కనడమే కాదు, మన భారతమాత రక్షణ కోసం మీలో కొందరైనా.. వీర జవాన్లుగా కావాలనే ఆశయంతో ఉండాలని నూరి పోస్తాను. అంతే కాదు అమ్మమ్మా! మీకు వాగ్దానం చేస్తున్నాను.. నా బిడ్డలను కూడా దేశం కోసమే కంటాను' అని చెప్పాను. వెంటనే ఆమె నా నుదట ముద్దు పెట్టి ఆశీర్వదించారు.

నా కుటుంబంలో మా అందరి నుదుటా.. మా ఆడ బిడ్డతో సహా స్టిక్కర్ బొట్లే ఉంటాయి. మేము మా కుంకుమను భారతమాత పాదపూజకు అర్పించేశాం. అయితే.. ఆరోజు నా కుంకుమార్పణ జరిగిన రోజు నేను భయపడ్డాను. 'ఒంటరిగా ఎలా బ్రతకాలా..' అని మాత్రం కాదు, పెళ్లిచూపుల నాడు అమ్మమ్మ లక్ష్మీబాయమ్మ గార్కి ఇచ్చిన మాట నేను నిలబెట్టుకోకుండానే స్వరాజ్ వెళ్లిపోయినందుకు.

కానీ.. ఈ మధ్యే తెలిసింది. నా కడుపున స్వరాజ్ రూపం ఊపిరి పోసుకుంటున్న సంతోషకరమైన నిజం. పుట్టే నా బిడ్డ ఆడైనా, మగైనా దేశ భక్తే ఊపిరిగా, దేశ భద్రతే లక్ష్యంగా బ్రతికేలా తీర్చి దిద్ది, దేశానికి ఇస్తానని.. భారతి అనే నేను మరోసారి అందరి ముందూ వాగ్దానం చేస్తున్నాను" అంటూ అపురూపంగా చేత్తో తన గర్భాన్ని తాకి, అదే చేత్తో సెల్యూట్ చేస్తున్న భారతిని టీవీలో చూస్తున్న దమయంతి చేతులు కూడా అప్రయత్నంగా నమస్కరించాయి.

**వచ్చేవారం కథ..**

**జీవనది**

**- హైమాభార్గవ్**




సినిమా



భారతీయ సంస్కృతిలోని అరవై నాలుగు కళల్లో అనేక కళలను ఇముడ్చుకున్నది సినిమా రంగం. వివిధ రంగాలలో నిష్ణాతులైన వారికి ఏదో రకంగా సినిమా రంగంలోని వివిధ శాఖలకు సహకారం అందించే ఆస్కారం లభిస్తుంది. వారి ప్రధాన రంగం సినిమా కాకపోయినా... ఈ మాధ్యమానికీ అక్కరకొచ్చే పనిని వారు చేస్తుంటారు. 2025లో పద్మ అవార్డులకు ఎంపికైన వారిలో అనేకమందికి సినిమాతో అనుబంధం ఉండటం అనేది అబ్బుర పరిచే అంశం. అంతేకాదు వారిలో కొందరికి నేరుగా తెలుగు సినిమా రంగంలో అనుబంధం ఉంది. ఈ యేడాది పద్మ విభూషణ్ అందుకోబోతున్న వారిలో ముగ్గురు, పద్మ భూషణ్ పొందుతున్న వారిలో ఆరుగురు, పద్మశ్రీ అవార్డుకు ఎంపికైన వారిలో ఆరుగురు వివిధ భాషల్లో సినిమా రంగంలో ప్రత్యక్ష అనుబంధం ఉన్నవారే కావడం విశేషం.

# చిత్రసీమకు సొబగులద్దిన పద్మపురస్కార గ్రహీతలు



బాలకృష్ణ



శోభన



శేఖర్ కపూర్



ఎంటీ

ఎప్పటిలానే ఈ యేడాది కూడా గణతంత్ర దినోత్సవానికి ఒక రోజు ముందు కేంద్ర ప్రభుత్వం పద్మ అవార్డులను ప్రకటించింది. ఇందులో ఏడుగురిని పద్మ విభూషణ్‌కు, 19 మందిని పద్మ విభూషణ్‌కు, 113 మందిని పద్మశ్రీ అవార్డ్‌లకు ఎంపిక చేశారు. వీరిలో 23 మంది మహిళలు ఉన్నారు. ప్రధానంగా తెలుగు సినిమా రంగానికి సంబంధించిన వారి గురించి చెప్పుకోవాలంటే... ప్రముఖ నటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణకు ఈ యేడాది పద్మ భూషణ్ అవార్డ్ వచ్చింది. గతంలో ఆయన తండ్రి, ప్రముఖ నటుడు, రాజకీయ నాయకుడు నందమూరి తారక రామారావు పద్మశ్రీ అవార్డును అందుకున్నారు. భారతరత్న అవార్డును ఆయనకు ఇవ్వాలనే డిమాండ్ కొన్నేళ్లుగా ఉంది. విశేషం ఏమంటే... 2023 ఎన్టీఆర్ శతజయంతి సంవత్సరం. ఆ సందర్భంగా జాతీయ స్థాయిలో పలు కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. అలానే 2024 నందమూరి బాలకృష్ణకు నట స్వర్ణోత్సవం. 1974లో 'తాతమ్మ కల' చిత్రంతో బాలకృష్ణ సినీ ప్రస్థానం మొదలైంది. దానికి ఎన్టీఆరే దర్శక నిర్మాత. గడిచిన యాభై ఏళ్లలో బాలకృష్ణ వందకు పైగా చిత్రాలలో నటించారు. ఈ యేడాది ఆయన కుమారుడు మోక్షజ్ఞ సైతం తెరంగేట్రమ్ చేస్తాడని అంటున్నారు. తండ్రి అడుగుజాడల్లో రాజకీయాల్లోకీ అడుగుపెట్టిన బాలకృష్ణ వరుసగా మూడోసారి హిందూపురం నుండి శాసన సభ్యుడిగా ఎంపికయ్యారు. తండ్రి నెలకొల్పిన బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. నటుడిగా, రాజకీయ నాయకుడిగానే కాకుండా వైద్య రంగంలోనూ తన సేవలను అందిస్తున్నారాయన. అలాంటి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డ్ రావడం పట్ల అందరూ హర్షాన్ని వ్యక్తం చేశారు.

పద్మభూషణ్ అవార్డుకు ఎంపికైన మరొకరు కర్ణాటకకు చెందిన అనంత్ నాగ్. కన్నడ సినీ చరిత్రలో అనంత్ నాగ్, శంకర్ నాగ్ సోదరులది ఓ ప్రత్యేక అధ్యాయం. అనంత్ నాగ్ నటుడు మాత్రమే కాదు, రాజకీయ నాయకుడు కూడా. ఎమ్మెల్యేగా, ఎమ్మెల్సీగా, మంత్రిగా కన్నడ ప్రజలకు సేవలు అందించారు. కెరీర్ ప్రారంభ సమయంలోనే తెలుగులో కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో 'ప్రేమలేఖలు' చిత్రంలో నటించారు. ఆ తర్వాత 'అనుగ్రహం, శాంతిక్రాంతి, రాత్రి, శంఖారావం, బాలు' చిత్రాలలో కీలక పాత్రలు పోషించారు. ఆ మధ్య వచ్చిన నితిన్ 'భీష్మ'లో సైతం ఆయన నటించారు. తెలుగువారికి సుపరిచితురాలైన నటి, నర్తకి శోభనను కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్‌కు ఎంపిక చేసింది. ట్రావెన్ కోర్ సిస్టర్స్‌గా పేరు తెచ్చుకున్న లలిత, పద్మిని, రాగిణి మేనకోడలైన శోభన వారి అడుగు జాడల్లో నడుస్తూనే నటన, నృత్యానికి జీవితాన్ని అంకితమిచ్చారు. తెలుగులో అగ్ర కథానాయకు లందరి సరసన అద్భుతమైన పాత్రలను శోభన పోషించారు. రజనీకాంత్ 'చంద్రముఖి' చిత్రానికి మూలమైన మలయాళ సినిమా 'మణిచిత్రతాళు'లో నటనకు తొలిసారి జాతీయ ఉత్తమనటిగా అవార్డును అందుకున్నారు శోభన. తెలుగు నేలపై జన్మించి, తెలుగు సినిమాతో కెరీర్ ప్రారంభించిన తమిళ స్టార్ హీరో అజిత్ కుమార్ సైతం ఈ యేడాది పద్మ భూషణ్‌కు ఎంపికయ్యారు. గొల్లపూడి మారుతీరావు తనయుడు శ్రీనివాస్ డైరెక్ట్ చేసిన 'ప్రేమపుస్తకం'లో




తొలిసారి హీరోగా నటించాడు అజిత్. దర్శకుడు శ్రీనివాస్ దుర్మరణంతో ఆ సినిమా విడుదల ఆలస్యమైంది. ఇవాళ తమిళనాడులో అగ్ర కథానాయకుడిగా ఉన్న అజిత్ బెస్ట్ రేసర్ కూడా. ఇటీవల దుబాయ్ లో జరిగిన కార్ రేస్‌లో పాల్గొని, మూడో స్థానంలో నిలిచి, అక్కడ మన మువ్వన్నెల పతాకాన్ని రెపరెపలాడించాడు అజిత్.

దేశం గర్వించే హిందీ చిత్రాలను రూపొందించిన శేఖర్‌కపూర్‌నూ ఈ యేడాది పద్మవిభూషణ్ వరించింది. గజల్ గాయకుడిగా అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన పంకజ్ ఉధాస్ సైతం పలు చిత్రాలలో గజల్ గానం చేసి సినిమా ప్రేక్షకులపై చెరగని ముద్రవేశారు.

దేశంలోనే రెండో అత్యున్నత పౌర పురస్కారం పద్మ విభూషణ్‌కు ఈ యేడాది ఎంపికైన వారిలో ముగ్గురికి సినిమా రంగంలో ప్రత్యక్ష సంబంధం ఉండటం విశేషం. ప్రముఖ వాద్యకారులు, సంగీత దర్శకుడు ఎల్. సుబ్రహ్మణ్యం ఆ రంగంలో విశేష కృషి చేశారు. వయొలిన్ పై రాగాలను అద్భుతంగా పలికించే సుబ్రహ్మణ్యం కొన్ని సినిమాలు సంగీతాన్ని సైతం అందించారు. మీరా నాయర్ తెరకెక్కించిన 'సలామ్ బాంబే, మిసిసిపీ మసాలా' చిత్రాలకు ఆయన సంగీత దర్శకులు.

ఇటీవలే కన్నుమూసిన ప్రముఖ మలయాళ రచయిత ఎం.టి. వాసుదేవన్ నాయర్ జ్ఞానపీఠ అవార్డు గ్రహీత కూడా. పలు చిత్రాలకు కథలు, కథనాలు అందించారాయన. విశేషం ఏమంటే ప్రముఖ తెలుగు రచయిత శ్రీరమణ 'మిధునం' కథ తెలుగులో అదే పేరుతో రూపుదిద్దుకుంది. కానీ దానికంటే ముందే ఆ కథను మలయాళ భాషలో ఎం.టి.వాసుదేవన్ నాయర్ వెండితెరపై 'ఒరు చిరు పుంజిరి' పేరుతో ఆవిష్కరించారు. వాసుదేవన్ నాయర్ రచన పట్ల విశేష అభిరుచి కలిగిన అగ్ర కథానాయకులు ఆయన రాసిన కథలతో రూపుదిద్దుకున్న 'మనోరథంగల్' అనే ఆంథాలజీలో నటించారు. దీనికి కమల్‌హాసన్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. మరో గొప్ప విషయం ఏమంటే... ప్రముఖ సినిమాటోగ్రాఫర్, డైరెక్టర్ ఎ. విన్సెంట్ దర్శకత్వం వహించిన 'మురప్పెణ్ణు' ఎం.టి. వాసుదేవన్‌నాయర్‌కు సినీ రచయితగా తొలి చిత్రం. ఆ సినిమాలో నాయికగా నటించింది ఊర్వశి శారదే! పద్మ విభూషణ్ అవార్డుకు మరణానంతరం ఎంపికైన బిహార్‌కు చెందిన జానపద గాయని శారద సిన్హాకూ చిత్రసీమలో అనుబంధం ఉంది. ఆమె పలు చిత్రాలకు నేపథ్య గానం అందించారు.

పద్మశ్రీ అవార్డుల విషయానికి వస్తే వివిధ భాషలకు చెందిన సినిమా రంగానికి చెందిన ఆరుగురికి ఈ అవార్డులు లభించాయి. ప్రముఖ బెంగాలీ సింగర్ అర్జిత్‌సింగ్‌కు పద్మశ్రీ పురస్కారం లభించింది. హిందీతో పాటు పలు భారతీయ భాషల్లో పాటలు పాడాడు అర్జిత్‌సింగ్. పదిహేనేళ్లుగా తెలుగులోనూ అనేక చిత్రాలకు అతను పాటలు పాడాడు. రెండుసార్లు ఉత్తమ నేపథ్య గాయకుడిగా జాతీయ అవార్డును అందుకున్నాడు. అలానే మరాఠీ, హిందీ సినిమాలలో హీరోగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా చక్కని గుర్తింపు తెచ్చుకున్న అశోక్ షరాఫ్‌నూ పద్మశ్రీ అవార్డుకు ఎంపిక చేశారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన ఫైట్ మాస్టర్ హస్సన్ రఘు పలు చిత్రాలకు స్టంట్ కొరియోగ్రాఫర్‌గా పని చేశారు. 'యాక్సిడెంట్' మూవీకి బెస్ట్ యాక్షన్ డైరెక్టర్‌గా కర్ణాటక ప్రభుత్వం నుండి అవార్డు పొందారు. సంప్రదాయ యుద్ధ కళలను యువతకు నేర్పుతున్న రఘును పద్మశ్రీ అవార్డుకు కేంద్రం ఎంపిక చేసింది. ప్రముఖ నేపథ్య గాయని జస్పిందర్ నరూలా పలు భారతీయ భాషల్లో పాటలు పాడారు. ముఖ్యంగా ఆమె పాడిన పాటలు హిందీలో శ్రోతలను విశేషంగా ఆకట్టుకున్నాయి. అలానే తేజేంద్ర నారాయణ మజుందార్ పేరెన్నికగన్న సరోద్ ప్లేయర్. సంగీతం మీద మంచి పట్టున్న తేజేంద్ర 'టాలీ లైట్స్, హనన్ కాల్' అనే బెంగాలీ చిత్రాలకు సంగీతాన్నీ సమకూర్చారు. ప్రముఖ నృత్యకారుడు ఉదయ్ శంకర్ కుమార్తె, నటి, నర్తకి మమతా శంకర్‌నూ ఈ యేడాది పద్మశ్రీకి ఎంపిక చేశారు. నృత్యంతో పాటు నటనకూ తగిన ప్రాధాన్యమిచ్చిన మమతా శంకర్ దేశం గర్వించే అగ్ర దర్శకుల చిత్రాలలో నటించారు. మృణాల్ సేన్ తెలుగులో రూపొందించిన 'ఒక వూరి కథ'లో నాయికగా నటించారామె. నారాయణరావు, వాసుదేవరావు తండ్రీ కొడుకులుగా నటించిన ఈ సినిమా విఖ్యాత రచయిత మున్షీ ప్రేమ్‌చంద్ రాసిన కథ 'కఫన్' ఆధారంగా రూపుదిద్దుకుంది. ఈ చిత్రానికి యండమూరి వీరేంద్రనాథ్ మాటలు రాశారు. మొత్తంగా 139 మందికి కేంద్రం పద్మ అవార్డులను ప్రకటించింది. వీరంతా ఈ యేడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లో భారత రాష్ట్రపతి చేతుల మీదుగా వీటిని స్వీకరిస్తారు.

**అరుణ**, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్

## హైదరాబాద్‌లో మహిళా భక్త సమ్మేళనం



ఆధునిక మహిళ శారదమ్మ బాటలో పయనించేలా ప్రేరేపించే సంకల్పంతో దక్షిణ భారత రెండవ మహిళా భక్త సమ్మేళనం నిర్వహిస్తున్నారు. గుంటూరు రామకృష్ణ శారదా మిషన్ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7 నుంచి 9వ తేదీ వరకు మూడు రోజుల పాటు శ్రీ మా శారదా మహిళా భక్త సమ్మేళనం శంషాబాద్ (హైదరాబాద్) కన్హా శాంతి వనంలో ఆధ్యాత్మిక వాతావరణంలో జరుగుతుంది. ఈ సమ్మేళనానికి ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి మహిళా భక్తులు విరివిగా పాల్గొనాలని ప్రవ్రాజిక భవానీ ప్రాణ మాతాజీ కోరారు. ఈ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా కోల్ కతా రామకృష్ణ శారదా మిషన్ ప్రధాన కార్యదర్శి పరివ్రాజిక అతంద్రప్రాణ మాతాజీ, గౌరవ అతిథిగా ఐపీఎస్ అధికారిణి సౌమ్యా మిశ్రా హాజరవుతారని తెలిపారు.

# రాష్ట్ర సేవికాసమితి పథ సంచలన్




**అనంతపురం :** హిందూపూర్ నగరంలో జనవరి 19న రాష్ట్ర సేవికాసమితి ఘోష్ సహిత పథ సంచలన్ జరిగింది. ఇందులో అనంతపురం, శ్రీసత్యసాయి, కడప జిల్లాల నుంచి 119 మంది సేవికలు పాల్గొన్నారు. వరిష్ఠ సేవిక శ్రీమతి సిద్ధగంగమ్మ, సామాజిక కార్యకర్త రాజేశ్వరి, ప్రాంత సహకార్యవాహిక ఉజ్వల సేవికలకు దిశానిర్దేశం చేశారు.

# నక్కల కులస్తులకు ఎస్‌టి హోదాకై వినతి



**భాగ్యనగర్ :** తెలంగాణలోని నక్కల కులస్తులకు ఎస్ టి సర్టిఫికెట్ ఇవ్వాలని కోరుతూ తెలంగాణ నక్కల కుల (ఎస్‌టి) హక్కుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జనవరి 21న రాష్ట్ర గవర్నర్‌ని కలిసి వినతి పత్రం సమర్పించారు.

సామాజిక సమరసత వేదిక సంయోజక్ అప్పాలప్రసాద్, మాజీ ఎం ఎల్ సి రామచంద్రరావు, సంచారజాతుల రాష్ట్ర కార్యదర్శి చిరంజీవి, ఎస్‌సి సంక్షేమ సంఘం రిటైర్డ్ జాయింట్‌డైరెక్టర్ అంకం శంకర్ గవర్నర్‌ని కలిసి వినతి పత్రం అందజేసి, తొగుట మండలం చిన్న ముత్యంపేట గ్రామప్రజల సమస్యలు వివరించారు. కుల సర్టిఫికెట్‌లు ఇవ్వక ఇబ్బందులకు గురి చేస్తున్న విషయం వివరించారు.

# శ్రీ వసిష్ఠాశ్రమ రజతోత్సవం



**తిరుపతి :** శ్రీ వసిష్ఠాశ్రమ రజతోత్సవములు జనవరి 24 నుంచి 27వరకు తిరుపతి సమీపంలోని శ్రీ లలితాపీఠం శ్రీనివాసమంగాపురంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పూజ్యశ్రీ స్వామీజీలు : సుకృతానందమహరాజ్, శివ రామానందభారతి స్వామి, అనుమపానందజీ మహరాజ్, వశిష్ఠ ఆశ్రమం స్థాపకులు స్వస్వరూపానందగిరి స్వామి, ఆర్.ఎస్.ఎస్. సహ క్షేత్రప్రచారక్ భరత్‌కుమార్, ఆంధ్రప్రదేశ్ ప్రాంత ప్రచారక్ ఆదిత్య తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృతి ఫౌండేషన్‌కు అవార్డు



**భాగ్యనగర్ :** కళాశాల స్థాయి సాంస్కృతిక నాయకత్వ కేంద్రాలు (కల్చరల్ లీడర్ షిప్ సెంటర్లు)తో బాటు ప్రభుత్వ విధానాలు వాటిపై సాంస్కృతిక వారసత్వ ప్రభావాల పై పరిశోధనల ద్వారా నలుగురికీ పనికి వచ్చే పనులు చేస్తూ మంచి అలవాట్లు ఉండేలా ప్రోత్సహించే కళాశాలల్లో సాంస్కృతిక నాయకత్వ కేంద్రాలను నెలకొల్పి అక్కడి యువతని ప్రోత్సహిస్తున్నందుకు జనవరి 26న సంస్కృతి ఫౌండేషన్‌కు గవర్నర్ అవార్డు ఇచ్చారు. సంస్కృతీ ఫౌండేషన్, 2009లో స్థాపించబడింది, ఇది భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను ప్రోత్సహించడానికి అంకితమైన రిజిస్టర్డ్ ట్రస్ట్. సంస్కృతి ప్రభుత్వ విధానం అంశాలపై జాతీయ వనరుల కేంద్రం (నేషనల్ రిసోర్స్ సెంటర్ ఫర్ కల్చర్) గా మారాలనేది దీని లక్ష్యం కాగా, పరిశోధన, విద్య, సంభాషణల ద్వారా భారతీయ సంస్కృతిని పరిరక్షించడం, ప్రోత్సహించడంపై దృష్టి పెడుతుంది. మేధావులను ప్రభుత్వ విధానాలు సాంస్కృతిక అంశాలపై పాల్గొనేలా చేయడం ద్వారా, వైవిధ్యమైన కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా, ఫౌండేషన్ భారతీయ విలువలు, సంప్రదాయాలను నిలబెట్టే వ్యక్తులను ప్రేరేపించడానికి ప్రయత్నిస్తుంది. ఈ ఫౌండేషన్ తన లక్ష్యాలను చేరుకోవడానికి సాంస్కృతిక నాయకత్వ కేంద్రాల ద్వారా యువతపై, సంస్కృతీ అధ్యాయ కేంద్రం ద్వారా మేధావులపై దృష్టి పెడుతుంది. సంస్కృతీ ఫౌండేషన్ కార్యక్రమాలు సంప్రదాయ విలువలను సమకాలీన సమాజ అవసరాలతో సమర్థవంతంగా మిళితం చేస్తాయి. ★

# బాల జాగృతి


## తెలుసుకుందాం

## శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవాలయం పొనుగుపాడు



ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా, ఫిరంగిపురం మండలం, పొనుగుపాడు గ్రామంలో నెలకొన్న ప్రముఖ శైవాలయమిది. జంపని వంశానికి చెందిన వారు ఈ ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయానికి "జంపనోరి గుడి" అనే మరో పేరు వాడుకలో ఉంది. దేవాలయంలో ప్రతిష్ఠించిన సాలగ్రామం (శివలింగం) వారణాసి నుండి తీసుకువచ్చారు. అప్పటి నుండి ఈ ఆలయాన్ని "శ్రీ గంగా అన్నపూర్ణ సమేత శ్రీ కాశీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం" అని పిలుస్తున్నారు. ఏటా మహా శివరాత్రి ఉత్సవాలు ఆలయంలో ఘనంగా నిర్వహిస్తారు.

## కథ — ఏకాగ్రత ముఖ్యం!



ఒక రోజు నలుగురు యువకులు తుపాకీ గురి సాధన చేయడం కోసం ఒక అడవికి వెళ్లారు.

అక్కడ కొంత దూరంలో నాలుగు కుండలు పెట్టి వాటిని పగులగొట్టాలని చూశారు.

కానీ ఒక్కటి కూడా పగుల గొట్టలేకపోయారు.

ఇదంతా చూస్తున్న ఒక సన్యాసి గట్టిగా నవ్వాడు. యువకులకు ఎంతో కోపం వచ్చింది.

"ఎందుకు నవ్వుతున్నావు? చేతనైతే పగులగొట్టు చూద్దాం.." అన్నారు.

వెంటనే సన్యాసి ఒకడి దగ్గరి నుంచి తుపాకీ అందుకుని ఒకే దెబ్బతో నాలుగు కుండల్నీ పగులగొట్టాడు.

## పద్యం

**అసువినాశమైన నానంద సుఖకేళి**
**సత్యనిష్ఠపరుని సంతరించు**
**సత్యనిష్ఠజూడ సజ్జన భావంబు**
**విశ్వదాభిరామ! వినుర వేమ!**

**భావం :** సత్యనిష్టాపరుడు తన ప్రాణాలు పోగొట్టుకోవడానికైనా ఆనందంగా సిద్ధపడతాడుగానీ, అసత్యమాడటానికి మాత్రం అంగీకరించడు. అటువంటి సత్యవంతుడే సజ్జనుడు. పూజ్యుడు, చిరస్మరణీయుడు.

## శ్లోకం

**అశ్వంనైవ గజంనైవ**
**వ్యాఘ్రం నైవచ నైవచ**
**అజాపుత్రం బలిందద్యాత్**
**దేవో దుర్బల ఘాతకః**

**భావం :** గుర్రాన్ని కానీ, ఏనుగును కాని, పులిని కానీ.. కాకుండా గొర్రెనే బలి ఇస్తారు. వాస్తవానికి విధి కూడా బలహీనులనే నాశనం చేస్తుంది.

## జత పరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.


| | |
|---|---|
| హిప్నాలజీ | కళ్లు |
| న్యూమరాలజీ | నిద్ర |
| ఆప్తాలమాలజీ | సంఖ్యలు |
| ఎంటమాలజీ | విత్తనాలు |
| కార్పోలజీ | కీటకాలు |

జవాబులు : హిప్నాలజీ–నిద్ర; న్యూమరాలజీ–సంఖ్యలు; ఆప్తాలమాలజీ–కళ్లు; ఎంటమాలజీ–కీటకాలు; కార్పోలజీ–విత్తనాలు.

నిర్వహణ : నయనశ్రీ

## భారత స్వాతంత్ర్య సమరయోధులు

### బ్రిజ్‌లాల్ బియానీ




మహారాష్ట్రకు చెందిన ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు. 1896లో నాగ్‌పూర్‌లోని అకోలా ప్రాంతంలో జన్మించారు. చిన్ననాటి నుంచే స్వాతంత్ర్య ఉద్యమం పట్ల ఆసక్తిచూపించారు. 1920లో సహాయ నిరాకరణోద్య మంలో చేరారు. ఉప్పు సత్యాగ్రహం, జంగిల్ సత్యాగ్రహం, నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొని నాలుగు సార్లు జైలు శిక్ష అనుభవించారు. స్వాతంత్ర్యానంతరం రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1968లో మరణించారు.

## జనరల్ నాలెడ్జ్

1. కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఏ రాష్ట్రంలో ఉంది?
2. 'ఆంధ్రాతిలక్' అనే బిరుదును కలిగిన ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు?
3. క్యాలిక్యులేటర్ ఆవిష్కర్త?

సమాధానాలు : 1. తెలంగాణ (మంచిర్యాల); 2. గాడిచర్ల హరిసర్వోత్తమరావు; 3. పాస్కల్.



యువకులు ఆశ్చర్యపోయారు. ఒక్కరి నోట మాట లేదు.

"ఇదేలా సాధ్యం? ఒకే గురిలో అన్నింటినీ ఎలా పగులగొట్టారు? మీకేమైనా మంత్రతంత్రాలు వచ్చా?" అని అడిగారు.

"నాకే మంత్రతంత్రాలూ రావు, వాటిని పగులగొట్టడానికి ఏకాగ్రత ఉంటే చాలు. ఫలితం మీరు చూశారుగా?!" అన్నాడు ఆ సన్యాసి.

సన్యాసి ఇచ్చిన ఆ సలహాకు ఆ నలుగురు యువకులు కృతజ్ఞతలు చెప్పారు. ★

## మెదడుకు మేత

జానెడు ఇంట్లో,
మూరెడు కర్ర..
ఏమిటది?

జవాబు : కుండలో గరిటె

## మంచిమాట

నిరంతరం ఏదో ఒక పనిలో నిమగ్నమయ్యేవారికి నిరాశ అనేది కలగదు!




# వారఫలాలు

03-09 ఫిబ్రవరి 2025




సింహంభట్ల సుబ్బారావు
6300674054


**మేషం :** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

పరిచయాలు పెరుగుతాయి. భూ వివాదాలు తీరతాయి. సేవాకార్యక్రమాలలో పాల్గొం టారు. తీర్థయాత్రలు చేస్తారు. వాహనాలు, భూములు కొంటారు. సమాజంలో విశేష గౌరవం. శుభకార్యా లపై కుటుంబంలో చర్చిస్తారు. ఉద్యోగులకు ప్రమో షన్లు. రాజకీయవేత్తలకు కొత్త పదవులు. రచయితలు, క్రీడాకారులకు నూతనోత్సాహం. 3,4 తేదీల్లో అనుకోని ఖర్చులు. కుటుంబ బాధ్యతలతో సతమత మవుతారు. ఆంజనేయ దండకం పఠించండి..

**వృషభం :** కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు

సమాజంలో మీకంటూ గౌరవం పెరుగు తుంది. కొత్త వ్యక్తుల పరిచయాలు సంతోషం కలిగి స్తాయి. ఆలోచనలు కార్యరూపం. రుణదాతల ఒత్తిడులు తొలగుతాయి. విద్యార్థుల ప్రతిభ వెలుగులోకి వస్తాయి.దేవాలయాలు సందర్శి స్తారు. భాగస్వాముల సలహాలతో వ్యాపారాలు విస్త రిస్తారు. ఉద్యోగులకు కొత్త హోదాలు. కళాకారులకు యోగదాయకం. రచయితలు, క్రీడాకారుల కృషి ఫలి స్తుంది. 8,9 తేదీల్లో దూరప్రయాణాలు. దేవీస్తోత్రాలు పఠించండి.

**మిథునం :** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

రాబడి మొత్తంమీద మెరుగ్గా ఉండి అవసరాలు తీరతాయి. దూరప్రాంతాల నుంచి శుభవార్తలు అందుతాయి. ఇంటి నిర్మాణాలు ముమ్మరం చేస్తారు. ప్రముఖులతో ఉత్తరప్రత్యుత్తరాలు సాగిస్తారు. దేవాలయాలు సందర్శిస్తారు. మీ అంచనాలు కొన్ని నిజం కాగలవు. ఉద్యోగులకు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. కళా కారులకు అవకాశాలు. 6,7 తేదీల్లో బంధువులతో విభేదాలు. కనకధారా స్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం:** పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష

అదనపు ఆదాయం సమకూరి అవసరాలు తీరతాయి. సన్నిహితుల నుంచి కొంత ధనలాభం. నిరుద్యోగులకు ఉద్యోగలాభ సూచనలు. అనుకోని సంఘటనలు ఎదురవుతాయి. ధార్మిక కార్యక్రమా లలో పాల్గొంటారు. గృహం, వాహనాలు కొంటారు. ఉద్యోగులకు పనిభారం తగ్గుతుంది. పారిశ్రామిక వేత్తలకు సంతోషకరమైన సమాచారం. రచయితలు, క్రీడాకారులకు అనుకూలం. 4,5 తేదీల్లో స్నేహి తులతో విరోధాలు.. హయగ్రీవస్తోత్రాలు పఠించండి.

**సింహం :** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

కొత్త కార్యక్రమాలు అనుకున్న విధంగా పూర్తి. దైవకార్యాలలో పాల్గొంటారు. కొంతకాలంగా వేధిస్తున్న శారీరక రుగ్మతలు తీరతాయి. వాహనాలు, భూములు కొంటారు. వ్యాపారులకు పెట్టుబడులు అందుతాయి. ఉద్యోగులకు కొత్త బాధ్యతలు. పారిశ్రామికవేత్తలకు కొత్త సంస్థల ఏర్పాటులో విజయం. 3,4 తేదీల్లో బంధువులతో తగాదాలు. వృథా ఖర్చులు. శ్రీరామరక్షాస్తోత్రాలు పఠించండి.

**కన్య :** ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు

నిరుద్యోగులకు ఉద్యోగలాభం కలిగే అవ కాశాలు. భూములు, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. ఆదాయం గతం కంటే మెరుగు. నూతన విద్యావ కాశాలు. వ్యాపారులు ఒత్తిడుల నుంచి బయట పడతారు. రాజకీయ, కళారంగాల వారి యత్నాలు సఫలం. రచయితలు, క్రీడాకారులు అనుకున్నది సాధిస్తారు. 6,7 తేదీల్లో వృథా ఖర్చులు. శారీరక రుగ్మతలు. శివపంచాక్షరి పఠించండి.

**తుల :** చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు

రాబడి మరింత మెరుగుపడి ఉత్సాహంగా గడుపు తారు. నిరుద్యోగులకు ఉద్యోగలాభం. సాంకేతిక విద్యావకాశాలు దక్కుతాయి. వ్యాపారులకు పెట్టు బడులు సమకూరతాయి. ఉద్యోగులకు సంతోష కరమైన సమాచారం. రాజకీయవేత్తలకు ఊహించని ఆహ్వానాలు. కళాకారులు, పరిశోధకులకు పట్టింది బంగారమే. 8,9 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. కుటుంబంలో సమస్యలు. దత్త స్తోత్రాలు పఠించండి.

**వృశ్చికం :** విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆదాయానికి ఇబ్బందిలేకుండా గడిచిపోతుంది. అప్పులు తీరి ఒడ్డునపడతారు. కొత్త కార్యక్రమాలు చేపడతారు. భూవివాదాలు పరిష్కారమవుతాయి. కాం ట్రాక్టులు అనూహ్యంగా దక్కుతాయి. వ్యాపారులకు సకాలంలో విస్తరిస్తారు. పారిశ్రామిక వేత్తలకు ఊహించని ఆహ్వానాలు రాగలవు. క్రీడాకారులు, పరిశోధకులకు అన్నింటా విజయమే. 4,5 తేదీల్లో ఖర్చులు. విష్ణునామ ధ్యానం చేయండి.

**ధనుస్సు :** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

నూతన కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. పలుకుబడి మరింత పెరుగుతుంది. ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారులకు పెట్టు బడులు సమకూర తాయి. ఉద్యోగులకు కొత్త పోస్టులు లభిస్తాయి. రాజకీయవేత్తలకు నూతన పదవులు. క్రీడాకారులు, రచయితలకు ఉత్సాహవంతంగా ఉంటుంది. 5,6 తేదీల్లో బంధువిరోధాలు. మానసిక అశాంతి. ఆదిత్య హృదయం పఠించండి.

**మకరం :** ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

బంధువుల నుంచి కీలక సమాచారం. దేవా లయాలు సందర్శన. వాహన సౌఖ్యం. నూతన పరిచయాలు. కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుం టారు. ఇంటి నిర్మాణాలకు ప్రణాళిక. వ్యాపారులకు లాభసాటిగా ఉంటుంది. ఉద్యోగులకు విధుల్లో అనుకూలం. రాజకీయవేత్తలకు శుభవార్తలు. 6,7 తేదీల్లో కుటుంబంలో సమస్యలు. అనారోగ్య సూచనలు. అంగారక స్తోత్రాలు పఠించండి.

**కుంభం :** ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు

రాబడి తగ్గినా అవసరాలకు లోటురాదు. ఆకస్మిక ప్రయాణాలు సంభవం. శారీరక రుగ్మతలు ఇబ్బంది కలిగిస్తాయి. వ్యాపారులకు నిరాశాజనకంగా ఉంటుంది. ఉద్యోగులకు మార్పులు అనివార్యం. కళా కారులకు కొంతమేర ఒత్తిడులు తప్పవు. క్రీడా కారులు, నాయకులకు ఒడిదుడుకులు. 7,8 తేదీల్లో శుభవార్తలు. ఆకస్మిక్ర వస్తులాభాలు. ఆహ్వానాలు అందుతాయి. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి..

**మీనం :** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

రాబడి కొంత పెరిగి అవసరాలు తీరతాయి. విద్యార్థులు కోరుకున్న విద్యావకాశాలు పొందుతారు. సమాజంలో మరింత ఆదరణ. ప్రముఖులతో చర్చలు ఫలిస్తాయి. దేవాలయాలు సందర్శిస్తారు. వాహనాలు, వ్యాపారులకు లాభాలు. ఉద్యోగులకు ఉన్నతస్థితి లభించే సూచనలు. కళాకారులకు కొత్త అవకాశాలు దక్కుతాయి. పారిశ్రామికవేత్తలు, రచయితల ఆశలు నెరవేరతాయి. 6,7 తేదీల్లో శారీరక రుగ్మతలు. స్నేహితులతో విభేదాలు. గణేశాష్టకం పఠించండి.

# పదరసం-499

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ■ | 3 | ■ | ■ | 4 | |
| | ■ | | ■ | 5 | | 6 | | | ■ |
| 7 | | | | ■ | ■ | | ■ | 8 | |
| | ■ | | ■ | 9 | | | | | ■ |
| | ■ | 10 | | | ■ | | ■ | ■ | 11 |
| 12 | 13 | ■ | ■ | | ■ | 14 | 15 | | |
| ■ | 16 | | 17 | | 18 | ■ | | ■ | |
| ■ | | ■ | | ■ | 19 | | | ■ | |
| 20 | | | | ■ | | ■ | 21 | 22 | ■ |
| | ■ | ■ | 23 | | | | ■ | 24 | |

## ఆధారాలు

**అడ్డం**

1) దర్పం, గొప్పతనం చూపించుకోవడం (4)
4) శివాలయాలలో లింగానికి ఎదురుగా ఉండేది (2)
5) సొరకాయ (5)
7) దౌత్యం (4)
8) దీనిని పూసి మారేడుకాయ చేయడమని సామెత (2)
9) కొత్తగా పెళ్లైన జంటలను విడగొట్టే నెల (5)
10) తప్పనిసరి బాదరబందీ (3)
12) అటునుంచి వెళ్లరా ! (2)
14) తిరగబడ్డ ఇంద్రధనుస్సు (4)
16) కల్లాకపటం తెలియని అమాయకుడు (ప్రస్తుత వాడుక భాషలో) (5)
19) బంక సరిగాలేదు (3)
20) పొలంలో పక్షులని రాళ్లతో అదిలించేది (4)
21) అటు నుంచి పడే వాన తుంపర (2)
23) సేద్యం బాలేదు (4)
24) సరికాదు (2)

**నిలువు**

1) హడావిడి, తొందర తొందరగా (6)
2) సముద్రంలో పుట్టిన అగ్ని (5)
3) పిల్ల (2)
4) ఓర్పు సరిగా లేదు (4)
6) గొప్పగా ఒప్పారు (5)
9) లక్షలాది మందిని చంపే ఆధునిక ఆయుధం (4)
11) తోడుగా ఉండటం, స్నేహం (4)
13) అతిగా తినేవాడు అటూ ఇటూ అయ్యాడు (4)
15) ప్రకాశించు (4)
17) నామకరణోత్సవం సరిగా లేదు (4)
18) ఇలా అడగడమంటే అనుమానంతో పూర్తి విషయం తెలుసుకోవడం(పైకి)(4)
20) దీపంలో వెలిగేది (2)
22) జోడీ (2)

## పదరసం - 498 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| పు[1] | న | రా[2] | వా | సం[3] | ■ | వ[4] | ల్ల | కా[5] | దు |
| రు | ■ | జీ | ■ | ప్ర[6] | సా | దం | ■ | రా | ■ |
| షో | ■ | ■ | ఆ[7] | దా | ■ | తు[8] | య | గా | ల |
| త్త[9] | మ్మొ | ఉ[10] | ■ | యం | ■ | లు | ■ | రం | ■ |
| ము | ■ | ద[11] | మ్మ | ■ | అ[12] | ■ | స[13] | ■ | వ[14] |
| డు[15] | ర్ణు | క | ■ | ■ | మ[16] | ర్యా | ద | ■ | ర |
| ■ | ■ | మం[17] | త | నా[18] | లు | ■ | స్సు[19] | ర[20] | స |
| ఆ[21] | మ | డ | ■ | లు | ■ | భా[22] | ■ | భ | ■ |
| ప | ■ | లం[23] | ద | అం | ■ | వ | ■ | స[24] | ప[25] |
| ద[26] | స్కం | ■ | ■ | చ[27] | క్క | న | మ్మ | ■ | ర్ర |




# నిన్నటి క్రికెటర్లు... నేటి వీరసైనికులు!

భారత క్రికెట్‌కు అసమానసేవలు అందించిన ప్రపంచ మేటి క్రికెటర్లూ మనుషులే. క్రికెటర్లుగా కోట్ల రూపాయలు ఆర్జించినా రిటైర్మెంట్ తరువాత కొందరు సైనికదళాలకు గౌరవ హోదాలో సేవలు అందిస్తుంటే.. మరికొందరు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఉద్యోగులుగా తమ ప్రస్థానం కొనసాగిస్తున్నారు...

హరియాణా హరికేన్ కపిల్ దేవ్, భారత క్రికెట్ దేవుడు మాస్టర్ సచిన్ టెండుల్కర్, జార్ఖండ్ డైనమైట్ మహేంద్ర సింగ్ ధోనీలకు భారత క్రికెట్ చరిత్రలో మాత్రమే కాదు ప్రపంచ క్రికెట్ చరిత్రలోనే ప్రత్యేకస్థానం ఉంది. క్రికెటర్లుగా అసాధారణ రికార్డులు నెలకొల్పడమే కాదు భారత సైనికదళాలకు చెందిన వివిధ విభాగాలతో అనుబంధం ఏర్పరచుకొని గౌరవ సైనికులుగా తమవంతు సేవలు అందిస్తూ పులకించిపోతున్నారు.

**లెఫ్ట్ నెంట్ కర్నల్ కపిల్ దేవ్**

భారత్‌కు 1983 ప్రపంచకప్ అందించడం ద్వారా క్రికెటర్‌గా తన జన్మను సార్థకం చేసుకొన్న హరియాణా హరికేన్ కపిల్ దేవ్ 2008లో భారత సరిహద్దు భద్రతా దళాలలో గౌరవ్ లెఫ్టినెంట్ కర్నల్‌గా చేరి సాధారణ సైనికుడిలా శిక్షణపొందారు. సైనిక దుస్తులు ధరించడం తనలో సరికొత్త స్ఫూర్తిని నింపిందని, భారత క్రికెట్ జట్టుకు టీమ్ జెర్సీ ధరించడాన్ని ఎంత గౌరవంగా భావించానో సైనికదుస్తులు ధరించడాన్ని అంతే గొప్పగా పరిగణిస్తున్నట్లు కపిల్ దేవ్ తరచూ గుర్తు చేసుకొంటూ సైనికదళాల పట్ల తన అభిమానాన్ని చాటుకొంటూ వస్తున్నారు.

**గ్రూపు కెప్టెన్ సచిన్ టెండుల్కర్**

సచిన్ టెండుల్కర్ రిటైర్మెంట్ ప్రకటించిన రెండేళ్ల తర్వాత భారత వైమానికదళం 2015లో ఆయనకు గ్రూప్ కెప్టెన్‌గా గౌరవ హోదా ఇచ్చి సత్కరించింది. 83వ భారత వైమానికదళ దినోత్సవాలలో భాగంగా సచిన్‌కు వైమానికదళం ధరించే దుస్తులను ప్రదానం చేసింది. అంతేకాదు.. రాజస్థాన్‌లోని పోఖ్రాన్‌లో నిర్వహించిన వాయుశక్తి వైమానిక పాటవ ప్రదర్శనకు సచిన్‌ను ముఖ్యఅతిథిగా ఆహ్వానించింది.

భారత వైమానికదళంలో తానూ ఓ భాగం కావడం పూర్వజన్మసుకృతమని ప్రకటించడం ద్వారా సచిన్ తన ఆనందాన్ని పంచుకొన్నాడు.

**క్రికెటర్ టు వీరజవాన్...**

భారత క్రికెట్ చరిత్రలోనే అత్యుత్తమ కెప్టెన్‌గా నిలిచిన మహేంద్ర సింగ్ ధోనీ పూర్వీకులకు భారత సైనికదళాలతో సంబంధం ఉంది. ధోనీ 2011 లోనే భారత ప్రాదేశిక దళాలకు చెందిన పారాట్రూప్ వింగ్‌లో గౌరవ లెఫ్ట్‌నెంట్ కల్నల్ హోదా సంపాదించాడు. కఠోర శిక్షణ పొందాడు. ఆగ్రాలోని భారత సైనికదళాల పారా ట్రూప్ శిక్షణ విభాగంలో ఐదుసార్లు పారా ట్రూప్ జంప్‌లు చేయడం ద్వారా సుశిక్షితుడైన పారాజంపర్‌గా గుర్తింపు సంపాదించాడు.

**గస్తీ విధుల్లో మహేంద్రసింగ్ ధోనీ...**

వికెట్ కీపర్, బ్యాట్స్‌మన్‌గా భారత క్రికెట్‌కు అసమాన సేవలు అందించిన ధోనీ తన జీవితంలో తొలిసారిగా, అంకితభావం కలిగిన ఓ సైనికుడుగా కాశ్మీర్ లోయలో గస్తీ విధుల్లో పాలుపంచుకొన్నాడు. తమ బృందంతో పాటే గస్తీ విధులతో పాటు గార్డుగా కూడా విధులు నిర్వర్తించినట్లు సైనికదళాలు ప్రకటించాయి.

ధోనీ సైతం ఓ సాధారణ సైనికుడులానే తన రెండుమాసాల కాలాన్ని గడిపాడు. క్రికెట్ దిగ్గజం ధోనీకి తాము రక్షణ కల్పించాల్సిన అవసరం లేదని, ధోనీనే భారత ప్రజలకు రక్షణకవచంలా నిలిచాడంటూ భారత సైనికదళాధిపతే కొనియాడారంటే లెఫ్ట్ నెంట్ కల్నల్ ధోనీ అంకితభావం, విధినిర్వహణ తీరు ఏ స్థాయిలో ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు.

**డీఎస్పీలుగా పలువురు క్రికెటర్లు**

భారత మేటి క్రికెటర్లు పలువురు ప్రస్తుతం వివిధ రాష్ట్ర ప్రభుత్వాల పోలీసు శాఖలో డీఎస్పీలుగా పనిచేస్తున్నారు. 2007 ప్రారంభ టీ-20 ప్రపంచకప్‌ను భారత్ గెలుచుకోడంలో తనవంతు పాత్ర పోషించిన పేస్ బౌలర్ జోగిందర్ శర్మ క్రికెట్ రిటైర్మెంట్ తరువాత హరియాణ పోలీసుశాఖలో డీఎస్పీగా విధులు నిర్వర్తిస్తున్నాడు.

భారత జాదూ స్పిన్నర్ హర్భజన్ సింగ్ పంజాబ్ పోలీసు శాఖలో డీఎస్పీగా ఉంటే, నేటితరం ఫాస్ట్ బౌలర్ మహ్మద్ సిరాజ్ తెలంగాణా పోలీసు శాఖలో డీఎస్పీగా పని చేస్తున్నాడు. భారత మహిళా క్రికెట్ సారథి హర్మన్ ప్రీత్ కౌర్ సైతం పంజాబ్ పోలీసు శాఖలోనే డీఎస్పీగా సేవలు అందిస్తోంది.

**రిజర్వ్ బ్యాంకు సహాయక మేనేజర్‌గా కెఎల్ రాహుల్**


భారత ఓపెనర్ కమ్ వికెట్ కీపర్ బ్యాటర్ కెఎల్ రాహుల్ రిజర్వ్ బ్యాంకులో సహాయక మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. దేశంలోని కోట్లాదిమందిని సైబర్ మోసగాళ్లబారిన పడకుండా, రిజర్వ్ బ్యాంక్ నిర్వహించే ప్రచారకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటూ జాగురూకత కల్పిస్తున్నాడు. భారత మాజీ ఫాస్ట్ బౌలర్ ఉమేశ్ యాదవ్ సైతం నాగపూర్‌లోని రిజర్వ్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. లెగ్ స్పిన్ జాదూ యజువేంద్ర చహాల్ హర్యానాలోని ఇన్‌కమ్ ట్యాక్సు విభాగంలో అధికారిగా సేవలు అందిస్తున్నాడు.

క్రికెటర్లు మాత్రమే కాదు రెండుసార్లు ఒలింపిక్స్ పతక విజేత నీరజ్ చోప్రా భారత సైనికదళాలలో అధికారిగా ఉంటే, మహిళా బాక్సర్ నిఖత్ జరీన్ తెలంగాణా పోలీసుశాఖలో డీఎస్పీగా నియమితురాలయ్యింది. బ్యాడ్మింటన్ క్వీన్ పీవీ సింధు, కిడాంబీ శ్రీకాంత్ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో సబ్ కలెక్టర్లుగా పనిచేస్తున్నారు. సంపాదనతో పనిలేకుండా భారత సైనికదళాలకు గౌరవహోదాలతో సేవలు అందిస్తున్న భారత మాజీ కెప్టెన్లు కపిల్ దేవ్, సచిన్ టెండుల్కర్, మహేంద్రసింగ్ ధోనీ దేశంలోని కోట్లాది మంది యువతకు స్ఫూర్తిగా, ప్రేరణగా మిగిలిపోతారనడంలో ఏమాత్రం సందేహం లేదు. ★



**కృష్ణారావు చొప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# కరీంనగర్‌లో స్వదేశీ మేళా












భారతీయ విలువలు, నైపుణ్యంతో భారతీయులే తయారు చేసిన హస్తకళా ఆకృతుల ప్రదర్శన 'స్వదేశీ మేళా' ఫిబ్రవరి 11 నుంచి 16 వరకు, తెలంగాణ రాష్ట్రంలోని కరీంనగర్‌లో జరుగుతుంది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ స్టేడియం వేదికగా జరిగే ఈ మేళాను స్వదేశీ జాగరణ్ మంచ్ కరీంనగర్ శాఖ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నది. సనాతన, స్వదేశీ, స్వావలంబన అనే సమున్నత సూత్రాలే పునాదిగా సాగే ఈ మేళాలో గోష్ఠులు, సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఉంటాయి. సంప్రదాయ పంథాను, ఆధునికతను మేళవించి తయారుచేసిన ఉత్పత్తులను ఇందులో ప్రదర్శిస్తారు. ఇవన్నీ భారీ, మధ్య, కుటీర పరిశ్రమల వారు తయారు చేసినవే. మేళా అన్ని రోజులు పలువురు ప్రముఖులు, వివిధ రంగాల నిపుణులు పాల్గొంటారు. దేశీయ మైన ఉత్పత్తుల గురించి, శాస్త్ర సాంకేతిక రంగాల గురించి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తారు. ఎలక్ట్రానిక్ వస్తువులు, ఐటీ ఉత్పత్తులు, బ్యాంకింగ్-బీమా సేవలపై సలహాలు ఇచ్చే స్టాల్స్, గ్రామీణోత్ప త్తులు, గృహోపకరణాలు, చేనేత, చేతి వృత్తుల వారి ఉత్పత్తులు, ఆటోమొబైల్ వస్తువులు కూడా ఈ మేళాలో ప్రదర్శిస్తారు. ఆయుర్వేద ఔషధ లక్షణాలు కలిగిన మొక్కలు, సోలార్ విద్యుత్, పాల ఉత్పత్తులు, సౌందర్య సాధనాలు కూడా ఈ మేళాను అలంకరించనున్నాయి.



భారతీయ పంథాలో, దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించే స్వదేశీజాగరణ్ మంచ్ 1991లో ఏర్పడింది. వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ ఏర్పడిన తరువాత నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో మంచ్ ఆవిర్భవించింది. గోరక్షణకు, ఎన్రాన్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగాను మంచ్ ఉద్యమాలు చేపట్టింది. డీప్ సీ ఫిషింగ్‌తో సంక్షోభంలో పడిన జాలర్ల సంక్షేమం కోసం కూడా దేశవ్యాప్త పాదయాత్ర నిర్వహించింది.


ఇతర వివరాలకు :
**పోగుల తిరుపతి,** సెల్: 9949778843









From: JAGRITI Telugu Weekly
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 77 Issue : 15

